


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 09, సంచిక: 177 | బుధవారం | 27-05-2026 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00

బాధ్యతలు విస్మరించి మా ప్రభుత్వంపై విమర్శలా? 10

- ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్ర సర్కార్‌పై మంత్రి ఉత్తమ్ మండిపాటు



## మావోయిస్టు కీలక నేతలు లొంగుబాటు

- జనజీవన స్రవంతిలో చేరిన పసునూరి నరహరి, మేదర ధనమ్మ
- డిజిపి సివి ఆనంద్ ఎదుట సరెండర్
- నరహరికి రూ.25లక్షలు, ధనమ్మకు రూ.20 లక్షల ప్రోత్సాహక నగదు అందించిన పోలీసులు
- ప్రస్తుతం తెలంగాణకు చెందిన ముగ్గురు మావోయిస్టులే అండర్‌గ్రౌండ్‌లో కొనసాగుతున్నారు

ప్రజాపక్షం/హైదరాబాద్

పార్టీలో అత్యున్నత స్థాయి లో కొనసాగుతున్న ఇద్దరు కీలక అండర్‌గ్రౌండ్ నేతలు తెలంగాణ పోలీసుల ఎదుట మంగళవా రం లొంగిపోయి ప్రధాన స్రవంతిలోకి చేరారు. కేంద్ర కమిటీ సభ్యుడు (సిసిఎం), బిహార్‌–ఝార్ఖండ్ స్పెషల్ ఏరియా కమిటీ (బిజెఎస్‌ఎసి) కార్యదర్శి పసునూరి నరహరి అలియాస్ విశ్వనాథ్ అలియాస్ సలాయిదా, అలాగే రాష్ట్ర కమిటీ సభ్యురాలు (ఎస్‌సిఎం) మేదర దనమ్మ అలియాస్ లత అలియాస్ పూనం అలియాస్ జోబా సోమవారం డిజిపి సి.వి ఆనంద్ సమక్షంలో లొంగిపోయారు. ఈ మేరకు విలేకరుల సమావేశంలో డిజిపి లొంగిపోయిన మావోయిస్టుల తరువాయి 8లో

### ప్రజాసేవ చేసే అవకాశం కోల్పోయాం : నరహరి

తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయిన సిపిఐ(మావోయిస్టు) కేంద్ర కమిటీ సభ్యుడు, బిహార్‌– జార్ఖండ్ స్పెషల్ ఏరియా కమిటీ కార్యదర్శి పసునూరి నరహరి అలియాస్ విశ్వనాథ్ విలేకరుల సమావేశంలో కీలక వ్యాఖ్యలు చేశారు. దశాబ్దాల పాటు అండర్‌గ్రౌండ్‌లో పనిచేసిన అనంతరం తన భార్యతో కలిసి ప్రధాన స్రవంతిలోకి రావాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. మావోయిస్టు ఉద్యమం ప్రారంభ దశలో ఉన్న లక్ష్యాలు, ప్రస్తుత పరిస్థితుల మధ్య చాలా మార్పు వచ్చిందని అభిప్రాయపడ్డారు.అడవుల్లో పనిచేస్తూ జీవితంలో చాలా కాలం గడిచిపోయిందని, ప్రజల మధ్య ఉండి సేవ చేసే అవకాశాలు కోల్పోయామని పేర్కొన్నారు.ప్రభుత్వ పునరావాస విధానాలు, పోలీసుల హామీలపై విశ్వాసంతో ప్రధాన స్రవంతిలోకి రావాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.



### ఎపి పోలీసుల నుంచి ఎలాంటి నోటీసులు రాలేదు

మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్॥ నాగేశ్వర్

### ఎసిబికి చిక్కిన శామీర్‌పేట్ తహసీల్దార్ 03

రూ. 2లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ సుచరిత





## ట్రంప్ కొత్త మెలిక

- గల్ఫ్‌– అరబ్ దేశాలు ఇజ్రాయెల్‌తో సంబంధాలు పునరుద్ధరించుకోవాలి
- యుద్ధ ముగింపు ఒప్పందంలో ఈ అంశాన్ని చేర్చాలని అమెరికా అధ్యక్షుడు డిమాండ్
- ఇజ్రాయెల్ ఆధిపత్యంకోసం తెరమీదకు అబ్రహం ఒప్పందం

**వాషింగ్టన్:** గల్ఫ్–అరబ్ దేశాలు ఇజ్రాయెల్‌తో సాధారణ సంబంధాలు పునరుద్ధరించుకోవాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కొత్త మెలిక పెట్టారు. అమెరికా–ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధ ముగింపు ఒప్పందంలో ఈ అంశాన్ని చేర్చాలని ట్రంప్ చేసిన కొత్త డిమాండ్ చర్చలకు ఒక బెదిరింపుగా మారింది.వైట్‌హౌస్ వర్గాల సమాచారం ప్రకారం, శనివారంనాడు ట్రంప్ ముస్లిం దేశాల నాయకులతో కాన్ఫరెన్స్ కాల్ ఏర్పాటుచేసి మాట్లాడారు. ఇజ్రాయెల్‌తో సాధారణ సంబంధాలను పునరుద్ధరించుకోవాలని ఆకస్మికంగా ఆయన ఒక ప్రతిపాదన తెరమీదకు తెచ్చారు. ఇరాన్‌తో కుదిరే ఎలాంటి ఒప్పందానికైనా ఖతార్,పాకిస్థాన్,ఈజిప్టు,తుర్కియే,జోర్డాన్ దేశాలు విధిగా అబ్రహాం ఒప్పందంపై సంతకాలు చేయాలని కోరారు. చారిత్రకంగా ఇజ్రాయెల్‌తో శత్రుత్వం ఉన్న దేశాలతో అంటే యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, బహ్రైన్‌లతో దౌత్య సంబంధాల సాధారణీకరణకు 2020 ఆగస్టులో అమెరికా మధ్యవర్తిత్వం వహించి అబ్రహాం ఒడంబడిక(పాలస్తీనా–ఇజ్రాయెల్ వివాద పరిష్కారం కాదు)లను తెచ్చింది. ఇప్పటికే ఒడిదొడుకుల్లో ఉన్న చర్చల ప్రక్రియ మరింత సంక్లిష్టంగా మారింది. ముస్లిం మిత్ర దేశాలు అబ్రహాం ఒప్పందంలో చేరాలని, ఇజ్రాయెల్‌తో గల్ఫ్, అరబ్ దేశాలు సాధారణ సంబంధాలను పునరుద్ధరించుకోవాలని ట్రంప్ కొత్త డిమాండ్‌ను తెరమీదకు తీసుకురావడం అతిపెద్ద సమస్యగా మారింది. అమెరికాకు అత్యంత విశ్వసనీయమైనదిగా ఇటీవల ట్రంప్ భావిస్తున్న మధ్యవర్తిదేశం పాకిస్థాన్‌కు కూడా ఇందుకు సుముఖంగా లేదు. పాకిస్థాన్ తరహాలోనే సౌదీ అరేబియా కూడా పదే పదే తూర్పు జెరూసలెం రాజధానిగా తరువాయి 8లో

## ఇంధన ధరల పెంపునకు వ్యతిరేకంగా దేశవ్యాప్త నిరసనలు

- సిపిఐ పిలుపు : ధరల పెంపునకు ఖండన
- ప్రజాసంక్షేమం కంటే కార్పొరేట్ ప్రయోజనలకే మోదీ సర్కార్ ప్రాధాన్యతనిస్తుందని మండిపాటు
- ద్రవ్యోల్బణంతో ప్రజలపై మరింత భారం మోపే కుట్ర
- ఇంధన ధరల పెరుగుదలకు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలే కారణమని చెప్పడం విడ్డూరం

**న్యూఢిల్లీ :** ప్రజా వ్యతిరేక ఇంధన ధరల పెం పును సిపిఐ తీవ్రంగా ఖండించింది. కార్పొరేట్ ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యతనిచ్చే మోదీ ప్రభుత్వసంపూర్ణ వైఫల్యానికి, దాని విధానాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా నిరసనలు,ప్రజాస్వామిక ప్రతిఘటన చేపట్టాలని పిలుపును ఇచ్చింది. ఈ మేరకు మంగళవారం సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం ప్రకటనను విడుదల చేసింది. కేవలం పది రోజుల వ్యవధిలోనే నిరవధికంగా నాలుగోసారి పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడాన్ని సిపిఐ తీవ్రంగా ఆక్షేపించింది. మోదీ ప్రభుత్వపు ప్ర జావ్యతిరేక, కార్పొరేట్ అనుకూల స్వభావా న్ని మరోసారి బట్టబయలు చేసిందని ధ్వజమెత్తింది. కొద్ది రోజుల్లోనే ఇంధన ధరలు లీటర్‌కు దాదాపు ఎనిమిది రూపాయలు పెరిగాయని, దీంతో ఢిల్లీలో పెట్రోల్ లీటర్‌కు రూ. 102, ముంబయిలో రూ.111కు చేరడం బా ధాకరం అని పేర్కొంది. ఈ పెరుగుదలలు కే వలం కొన్ని ప్రాంతాల ఆర్థిక నిర్ణయాలు కావ ని, ఇవి రవాణా ఖర్చులు, ఆహార ధరలు, వ్యవసాయ ఖర్చులు, ప్రజారవాణా ఛార్జీలు మొత్తం జీవన తరువాయి 8లో



## ఫైనల్‌కు ఆర్‌సిబి

- క్వాలిఫయర్ – 1 మ్యాచ్‌లో 92 పరుగులతో గుజరాత్‌ను చిత్తు చేసిన బెంగళూరు
- బెంగళూరు కెప్టెన్ రజత్ పటీదార్ విశ్వరూపం

**ధర్మశాల :** రెండో టైటిల్‌పై కన్నేసిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు క్వాలిఫయర్–1లో గర్జించింది. ధర్మశాలలో ఏకపక్ష పోరులో గుజరాత్ టైటాన్స్‌పై ఘన విజయంతో ఫైనల్‌కు దూసుకెళ్లింది. రజత్ పటిదార్(93) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో రికార్డు స్కోర్ కొట్టిన ఆర్‌సిబి.. జాకబ్ డఫ్ఫీ(39–3), రసిక్ దార్ సలాం(24–2), భువనేశ్వర్(28–4) విజృంభణతో గుజరాత్‌ను చిత్తు చేసి నాలుగోసారి ఫైనల్లో అడుగుపెట్టింది. ఘోర ఓటమి చవిచూసిన శుభ్‌మన్ గిల్ సేన ఎలిమినేటర్ విజేతతో క్వాలిఫయర్ 2లో తలపడనుంది. డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మరో టైటిల్‌కు అడుగుదూరంలో నిలిచింది. 19వ సీజన్ క్వాలిఫయర్–1లో 254 పరుగులతో అత్యధిక స్కోర్ రికార్డు బద్ధలు కొట్టిన ఆర్‌సిబి.. గుజరాత్ టైటాన్స్‌ను చిత్తు చిత్తుగా ఓడించింది. కనీసం పోరాడకుండానే మ్యాచ్‌ను బెంగళూరుకు అప్పగించేసింది. పేసర్లు జాకబ్ డఫ్ఫీ (39–3) రసిక్ దార్(24–2), హేజిల్‌వుడ్(39–1)లు వికెట్ల వేటతో చెలరేగగా ప్రత్యర్థిని 162 కే కట్టడి చేసిన రజత్ పటిదార్ తరువాయి 12లో

## కర్ణాటకలో నాయకత్వ మార్పు లేదు

- ఊహాగానాలను కొట్టిపారేసిన కాంగ్రెస్ అదిష్ఠానం
- రాజ్యసభ, కర్ణాటక శాసనమండలి అభ్యర్థుల ఎంపిక కోసమే భేటీ



**న్యూఢిల్లీ :** కర్ణాటకలో ముఖ్యమంత్రి పదవికోసం ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ మధ్య పోరు పతాకస్థాయికి చేరింది.ఈ నేపథ్యంలో కర్ణాటకలో నాయకత్వ మార్పులపై వస్తున్న వార్తలను కాంగ్రెస్ కొట్టిపారేసింది. అవి 'కేవలం ఊహాగానాలు మాత్రమే'నని, వాస్తవం కాదని స్పష్టం చేసింది. కేంద్ర కాంగ్రెస్ పార్టీ నాయకత్వం, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాధినేతల మధ్య రోజంతా జరిగిన చర్చలు కేవలం రాజ్యసభ, రాష్ట్ర శాసన మండలికి జరగబోయే ఎన్నికలపై మాత్రమే కేంద్రీకృతం అయ్యాయని కాంగ్రెస్ స్పష్టీకరించింది. రాజ్యసభ, రాష్ట్ర శాసనమండలికి సంబంధించిన ఈ రెండు ఎన్నికల అభ్యర్థులను ఖరారు చేసేందుకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నివాసంలో సమావేశం ఏర్పాటు చేసినప్పటికీ ఢిల్లీకి పిలిపించబడిన కర్ణాటక తరువాయి 12లో

## అన్ని వర్గాలకూ... కళాకారులు కీలకం

- నాటి కళాకారుల చరిత్ర తెలుసుకుని నేటి యువ కళాకారులు ముందడుగు వేయాలి
- సమాజాన్ని మేల్కొలిపి చైతన్యం చేసేలా సాంస్కృతిక దృష్టి కోణాన్ని మలుచుకోవాలి
- తెలంగాణ ప్రజానాట్యమండలి 4వ రాష్ట్ర మహాసభ ప్రతినిధుల సభలో టిజెఎస్ అధ్యక్షుడు, ఎంఎల్‌సి ప్రొఫెసర్ ఎం.కోదండరామ్



ప్రజాపక్షం / హైదరాబాద్

సమాజాన్ని మేల్కొలిపి చైతన్యం చేసే విధంగా కళాకారులు తమ సాంస్కృతిక దృష్టి కోణాన్ని మలుచుకోవాలని కళా రూపాలను రూపొందించాలని టిజెఎస్ అధ్యక్షులు, ఎంఎల్‌సి ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ అన్నారు. సమస్య తీవ్రత తెలిసినప్పుడే ఉద్యమం ఉప్పెనలా మారుతుందని, తద్వారా సమస్య పరిష్కారమవుతుందన్నారు. కవి, రచయిత గూడ అంజయ్య రాసిన ''దొర ఏందిరో... దొర పీకుడేందిరో'' పాట ఒక శక్తిగా మారి నాడు కార్మికులను, పనిమనుషులను చైతన్యం చేసిందని గుర్తు చేశారు. తెలంగాణ ప్రజానాట్యమండలి 4వ రాష్ట్ర మహాసభ ప్రతినిధుల సభ మంగళవారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారకభవన్‌లో జరిగింది. మహాసభను సిపిఐ రాష్ట్ర సహాయకార్యదర్శి ఈ.టి.నరసింహ ప్రారంభించగా, ప్రొఫెసర్ కోదండరామ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సభలో ప్రొఫెసర్ తరువాయి 12లో



## పంచాయతీ సిబ్బందికి 1వ తేదీనే జీతాలు

- వేతనాల కోసం నెలకు రూ.500 కోట్లు విడుదల చేస్తాం
- పెన్షన్ దారులకు నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమచేయాలి
- అర్హులకే పెన్షన్ అందేలా చూడాలి : సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

ప్రజాపక్షం/ హైదరాబాద్

స్వంత ఆదాయంపై గ్రామ పంచాయతీల స్వతంత్రతను నిర్వీర్యం చేస్తూ గత ప్రభుత్వం తొలగించిన నిబంధనను పునరుద్ధరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం, 2018 లోని సెక్షన్ 70(3) ప్రతిపాదిత సవరణ ప్రకారం గ్రామ పంచాయతీ స్వంత ఆదాయాన్ని ట్రెజరీ ఖాతాలో కాకుండా బ్యాంకు ఖాతాలో జమ చేసే విధంగా సవరణ చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. పోస్టల్ శాఖ ద్వారా ప్రస్తుత పెన్షన్ల పంపిణీ విధానాన్ని మార్చి నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమచేయాలని ఆదేశించారు. అర్హులకే పెన్షన్లు తరువాయి 12లో

## చెరువుల ఆక్రమణలపై 'హైడ్రా' భారీ ఆపరేషన్



- రూ. 4 వేల కోట్ల భూముల కబ్జాకు హైడ్రా విముక్తి
- ఒకే రోజు 34 ఎకరాల భూమి సంరక్షణ
- మాదాపూర్‌లో మాయమైన ఈదులకుంట గుర్తింపు
- కోకాపేట కొత్త చెరువులో 22 ఎకరాల ఆక్రమణల తొలగింపు

ప్రజాపక్షం/హైదరాబాద్

చెరువుల ఆక్రమణలను తీవ్రంగా పరిగణిస్తున్న హైడ్రా అధికారులు మంగళవారం భారీ స్థాయిలో చర్యలు చేపట్టారు. రంగారెడ్డి జిల్లాలోని మాధాపూర్ ఈదులకుంట, కోకాపేట కొత్త చెరువులపై జరిగిన ఆక్రమణలను గుర్తించి తొలగించారు. రెండు ప్రాంతాల్లో కలిపి దాదాపు 34 ఎకరాల భూమిని రక్షిస్తూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. మొత్తం రూ.4 వేల కోట్లకు పైగా విలువైన ప్రభుత్వ భూమి, చెరువు పరిధిని కాపాడినట్లు అధికారులు తెలిపారు. ఐటి కారిడార్‌లోని మాధాపూర్ ప్రాంతంలో ఆక్రమణదారులు మాయం చేసే స్థితికి తీసుకెళ్లిన 6.05 ఎకరాల ఈదులకుంటను హైడ్రా గుర్తించి రక్షించింది. శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ గ్రామం సర్వే నెంబర్ 7లో ఉన్న ఈ చెరువు శిల్పారామం ఎదురుగా ఉన్న తమ్మిడికుంటతో గొలుసుకట్టు విధానంలో అనుసంధానమై ఉండేది. వరద కాలువను మళ్లించడం వల్ల ఈదులకుంటకు నీరు చేరకుండా చేసి చెరువు హద్దులను చెరిపివేసే ప్రయత్నాలు జరిగినట్లు స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుల ఆధారంగా హైడ్రా అధికారులు రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ శాఖలతో తరువాయి 8లో

## కీలక ఖనిజాలపై భారత్–అమెరికా డీల్



**న్యూఢిల్లీ :** ప్రపంచ సాంకేతిక సరఫరా గొలుసులకు కీలకమైన అరుదైన భూమూలకాలు, వ్యూహాత్మక లోహాలపై చైనా విధించిన ఎగుమతి నియంత్రణలపై పెరుగుతున్న ఆందోళనల మధ్య, కీలక ఖనిజాల స్థిరమైన సరఫరాలను నిర్ధారించే విషయమై సహకారం కోసం భారత దేశం, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా (యుఎస్‌ఎ) ఒక కీలకమైన చట్రాన్ని ఖరారు చేశాయి. మంగళవారం ఇక్కడ జరిగి 'క్వాడ్' విదేశాంగ మంత్రుల సమావేశం సందర్భంగా కీలక ఖనిజాల తవ్వకం, శుద్ధి సరఫరాలను సురక్షితం చేసే చట్రంపై సంతకాలు జరిగాయి. 'ఇది చాలా సమయోచితమైన, కీలకమైన విషయం' అని అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో సమక్షంలో విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ అన్నారు. 'మైనింగ్, ప్రాసెసింగ్, రీసైక్లింగ్ తరువాయి 12లో

## 'సైబర్ సెక్యూరిటీ' శిక్షణలు రూ.5.56 కోట్ల మోసం

- కేంద్ర ప్రభుత్వ సంస్థగా నమ్మించి వ్యాపారవేత్తను దోచుకున్న నకిలీ సంస్థ నిర్వాహకుడు

ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వానికి చెందిన సంస్థగా నమ్మించి సైబర్ సెక్యూరిటీ శిక్షణల పేరుతో హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త నుంచి రూ. 5.56 కోట్లకు పైగా వసూలు చేసిన భారీ మోసం వెలుగులోకి వచ్చింది. నేషనల్ ఇన్ఫర్మేషన్ అండ్ సైబర్ తరువాయి 8లో

# అస్సాంలో యుసిసి

హిందూత్వ ఎజండాతో ఎన్నికల్లో విజయంతో విర్రవీగుతున్న అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ 'ఏకరూప పౌరస్మృతి అస్సాం బిల్లు, 2026'ను సోమవారం శాసనసభలో ప్రవేశపెట్టారు. వివాహం, విడాకులు, వారసత్వ ఆస్తి, సహజీవనానికి సంబంధించిన విషయాల్లో రాష్ట్ర నివాసితులందరికీ ఇది ఉమ్మడి శాసనమవుతుంది. ప్రతిపాదిత చట్టం బహుభార్యాత్వం, బహుభర్తృత్వంలను నిషేధిస్తుంది. ఉల్లంఘించినవారికి భారతీయ న్యాయసంహిత, 2023 లోని సెక్షన్ 82 కింద ఏడు సంవత్సరాలు జైలుశిక్ష విధించబడుతుంది. ఏకపత్నీవ్రతాన్ని ఆదేశిస్తున్న ఈ బిల్లు పెండ్లి కుమారులకు 21సంవత్సరాలు, పెండ్లి కుమార్తెలకు 18సంవత్సరాలు ప్రామాణిక లీగల్ వయస్సుగా ప్రకటించింది. సహజీవనం చేసేవారు నెలరోజుల్లో తమ సంబంధాన్ని రిజిస్టర్ చేయించుకోవాలని, ఈ సంబంధం వల్ల జన్మించే సంతానానికి చట్టబద్ధత లభిస్తుందని, ఈ సంబంధం తెగిపోయినపుడు కోర్టుల ద్వారా భరణం కోరే హక్కు ఉంటుందని, రిజిస్ట్రేషన్ చేయించుకోకపోతే మూడు నెలలవరకు జైలుశిక్ష, రూ.10వేల వరకు జరిమానాను బిల్లు ప్రతిపాదించింది.

"అస్సాం ముస్లిం వివాహాలు, విడాకులు నిర్బంధ రిజిస్ట్రేషన్ చట్టం, 2024"ను ఈ బిల్లు రద్దు చేస్తుంది. పౌరులందరికీ ఒకే చట్టం అని తమ ముస్లిం మైనారిటీల వ్యతిరేక చర్యను సమర్థించుకునే బిజెపి, ఈ బిల్లు పరిధి నుంచి షెడ్యూల్డు తెగలను మినహాయించింది. భిన్నమైన ఆచార వ్యవహారాలు పాటించే కొండజాతుల జోలికివెళితే రాజకీయంగా ఎదురుదెబ్బ తగులుతుందనే ఉద్దేశంతోనే ఈ మినహాయింపు ఇచ్చారు. మూడు ప్రతిపక్ష పార్టీలు ఈ బిల్లు ప్రవేశపెట్టటాన్ని వ్యతిరేకించాయి. బిజెపి రాజకీయ ఎజండా ప్రకారం ప్రభుత్వం ఈ బిల్లును "బుల్డోజ్" చేసిందని కాంగ్రెస్ నాయకుడు జకీర్ హుస్సేన్ సిక్దర్ విమర్శించారు. ఎంతో వివాదాస్పదమైన ఈ బిల్లును రాజకీయ పక్షాలతో, రాజకీయేతర పౌర సంస్థలతో చర్చించకుండా ప్రవేశపెట్టటంలోనే ప్రభుత్వ దురుద్దేశం వెల్లడవుతోందన్నారు. ఈ బిల్లు బుధవారమే చర్చకు రానుంది. ఏకరూప పౌరస్మృతి(యుసిసి) బిల్లు తెచ్చిన నాల్గవ రాష్ట్రం అస్సాం. గోవా, ఉత్తరాఖండ్, గుజరాత్ ఇంతకుముందే చట్టాలు చేశాయి.

యుసిసి అనేది రాజ్యాంగం ఆర్టికల్ 44లో 'రాజ్య విధానానికి ఆదేశిక సూత్రాలు' కింద రాజ్యాంగ నిర్మాతలు చేర్చారు. గోవధ నిషేధం కూడా అందులోనే ఉంది. అవి దీర్ఘకాల లక్ష్యం తప్ప తక్షణ ఆదేశం కాదు. వివిధ మత సముదాయాలు తమ సొంత సాంప్రదాయాల ప్రకారం వ్యక్తిగత చట్టాల వ్యవస్థను పాటించటాన్ని స్వాతంత్ర్యం నాటినుంచీ అనుమతించబడింది. ముస్లింలు ముస్లిం పర్సనల్ లా పాటిస్తున్నారు. క్రైస్తవులు, పార్శీలు, ఇతరులు తమ ప్రత్యేక లీగల్ ఏర్పాట్లను కొనసాగిస్తున్నారు. జవహర్‌లాల్ నెహ్రూ, బి.ఆర్.అంబేద్కర్ చొరవతో 1950లో హిందూ చట్టాల క్రోడీకరణ, సంస్కరణ జరిగింది. అయితే ముస్లింలకు వ్యతిరేకంగా హిందువులను కూడగట్టే తమ రాజకీయ విధానం ప్రకారం తొలుత భారతీయ జనసంఘ్, ఆ తర్వాత దాని వారసురాలు భారతీయ జనతాపార్టీ యుసిసిని తమ ఎజండాలో చేర్చాయి. బహుభార్యాత్వంవల్ల ముస్లిం జనాభా పెరిగిపోతోందని, ఒక నాటికి హిందువులను మించిపోతారని పనిగట్టుక ప్రచారం చేశారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చి ఆర్‌ఎస్‌ఎస్ ఎజండాను అమలు జరపటంలో భాగంగా ఆర్టికల్ 370 రద్దు చేసింది, రామాలయ నిర్మాణం పూర్తి చేసింది. ఇక వారి మూల ఎజండాలో మిగిలి ఉన్న అంశం ఉమ్మడి పౌరస్మృతి. పార్లమెంటులో చట్టం ద్వారా దాన్ని నిర్బంధంగా అమలులోకితెస్తే దేశంలో రాగల అలజడి, తీవ్ర పర్యవసానాలు వారికి తెలుసు. అందుకనే ఒక్కొక్కటిగా రాష్ట్రాల్లో చట్టాల ద్వారా ప్రతిస్పందనను పరీక్షిస్తున్నారు. గోవాలో స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి అమలులో ఉన్న పోర్చుగీసు కాలపు పౌరస్మృతి తొలుత సంస్కరించారు. ఆ తర్వాత 2024లో ఉత్తరాఖండ్, 2026లో గుజరాత్ చట్టాలు ఆమోదం పొందాయి.

మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్ వగైరా బిజెపి పాలిత రాష్ట్రాలు యుసిసి అమలును చర్చించాయి. తమిళనాడు, పశ్చిమబెంగాల్ (టిఎంసి ప్రభుత్వం), కేరళ, కర్నాటక యుసిసిని బహిరంగంగా వ్యతిరేకించాయి. యుసిసి ఆక్రమిస్తున్న రాజ్యాంగ క్షేత్ర భావోద్వేగాన్నిది ప్రతిబింబిస్తున్నది. యుసిసి ద్వారా బిజెపిది తటస్థ సర్దుబాటు వైఖరికాదు. భారతదేశాన్ని హిందూ మెజారిటీ రాజ్యంగా తీర్చిదిద్దే విశాలమైన సైద్ధాంతిక ప్రయత్నం. "హిందూ రాష్ట్ర" పదం తరచూ చర్చల్లో వినిపిస్తోంది. అందువల్ల యుసిసి అనేది కేవలం పౌరస్మృతి అంశం కాదు, రాజ్యాంగ నిర్మాతలు ఊహించిన రాజ్యాంగ లౌకిక నిర్మాణ స్వరూపాన్ని కోతకు గురిచేస్తుంది. సామరస్యపూర్వక సంస్కరణే ధ్యేయమైనట్లయితే, కేంద్రప్రభుత్వం అన్ని మతాలవారి ప్రాతినిధ్యంతో ఒక కమిటీ వేసి హిందూకోడ్ సహా అన్ని వ్యక్తిగత చట్టాలను అధ్యయనం చేసి ఏకరూప పౌరస్మృతి రూపకల్పనను కోరి ఉండవచ్చు. అలాకాకుండా ఏకపక్షంగానే వ్యవహరిస్తున్నారంటే వారి ఉద్దేశం శంకించదగింది అవుతుంది.



## ప్రతి పౌరుడికీ వైఫై లక్ష్యంగా చర్యలు

**పిఎం వాణి ద్వారా ప్రతి పౌరుడికీ సులభమైన పబ్లిక్ వైఫై అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యం. ప్రస్తుత డిజిటల్ యుగంలో విద్యార్థులు, ప్రయాణికులు, చిన్న వ్యాపారులు, ఉద్యోగులు సహా ప్రతి ఒక్కరికీ ప్రజా వైఫై కీలక ప్రజా సేవగా మారుతోంది. వినియోగదారులకు మరింత సులభతరం చేసేలా ల్యాప్‌టాప్‌లు, ఇతర సెకండరీ పరికరాలకు క్యూఆర్ ఆధారిత లాగిన్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొస్తాం.**

- కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

# దేశం వెలుగుతున్నా... ఇల్లు చీకటేనా?

ఒక సామాన్య కుటుంబంలో తండ్రి సంపాదన అంతంత మాత్రంగానే ఉంది అనుకుందాం. ఇంట్లో పిల్లల చదువులకు డబ్బుల్లేవు, నిత్యావసరాల సరుకులు కొనడానికి అప్పులు చేయాల్సి వస్తోంది. కానీ, ఆ తండ్రి మాత్రం వీధి అరుగుమీద కూర్చుని.. 'మా వంశం గొప్పది, మా తాతల ఆస్తులు కోట్లల్లో ఉన్నాయి' అని ఊరంతా గొప్పలు చెప్పుకుంటూ తిరిగితే ఆ కుటుంబం ఆకలి తీరుతుందా..? ఈ రోజు మన దేశ ఆర్థిక పరిస్థితి, సామాన్యుడి జేబును గమనిస్తే సరిగ్గా ఇలాంటి చిత్రమే కళ్లముందు కదలాడుతోంది. పత్రికలు చూసినా, టివిలు ఆన్ చేసినా.. దేశం అద్భుతంగా అభివృద్ధి చెందిపోతోందని, ప్రపంచ దేశాల సరసన మన దేశం ఎంతో ఎత్తున నిలిచిందని పెద్ద పెద్ద అంకెలు, లెక్కలు చెప్తుంటారు. కానీ, అదే సామాన్యుడు ఉదయాన్నే సంచి పట్టుకుని కూరగాయల మార్కెట్‌కో, కిరాణా కొట్టుకో వెళ్తే.. వంద రూపాయల నోటు ఐదు నిమిషాల్లో కరిగిపోతోంది. కూరగాయలు, పప్పులు, వంట నూనెలు, గ్యాస్ సిలిండర్, బైకులో పోయించే పెట్రోల్.. ఇలా ఒకటేమిటి, నిత్యావసరాల ధరలన్నీ ఆకాశాన్ని తాకుతున్నాయి. దేశం వెలుగుతోందని పాలకులు చెప్తున్న మాట నిజమే అయితే.. మరి సామాన్యుడి ఇంట్లో ఇంకా చాలీచాలని బతుకులు, ఆర్థిక చీకట్లు ఎందుకు ముసురుతున్నట్లు..? ఈ ప్రశ్న ప్రతి సామాన్యుడి గుండెల్లో తొలిచేస్తోంది.

ప్రస్తుతం మన సమాజం రెండు ముక్కలుగా విడిపోయింది. పెద్ద పెద్ద వ్యాపారాలు, కోటీశ్వరుల ఆస్తులు, నగరాల్లోని బహుళ అంతస్తుల భవనాల వెలుగులు పైపైకి దూసుకుపోతున్నాయి. కానీ, రెక్కాడితే గాని డొక్కాడని రోజువారీ కూలీలు, చిన్న వ్యాపారులు, చేతివృత్తుల వారు, నెల జీతాల మధ్యతరగతి జీవులు మాత్రం రోజురోజుకూ కిందికి పడిపోతున్నారు. దేశంలో వందమంది సంపాదనాపరులను తీసుకుంటే.. అందులో కేవలం ఒక ఐదు, ఆరుగురికి మాత్రమే పెద్ద కంపెనీలలో స్థిరమైన ఉద్యోగాలు, నెల నెలా పెరిగే జీతాలు, బోనస్‌లు ఉన్నాయి. మిగిలిన 94 మంది రోడ్డు పక్కన బండ్లు పెట్టుకునేవారు, భవన నిర్మాణ కార్మికులు, చిన్న దుకాణదారులు, చేనేత కార్మికులు, ముఠా కూలీలు, వ్యవసాయ కూలీలుగానే బతుకు వెళ్లదీస్తున్నారు. గతంలో జరిగిన కొన్ని హఠాత్ నిర్ణయాలు, ఆ తర్వాత వచ్చిన కరోనా లాక్డౌన్‌ల దెబ్బకు ఈ మెజారిటీ ప్రజల నడుము విరిగిపోయింది. ప్రభుత్వమేమో కేవలం ఆ కొద్దిమంది ఉన్న పెద్ద కంపెనీల లాభాలను చూసి, 'దేశం అంతా వెలిగిపోతోంది' అని మురిసిపోతోంది. ఒక పెద్ద చెట్టు వేళ్లకు నీళ్లు పోయడం మానేసి, కేవలం పైనున్న కొమ్మలకు, ఆకులకు రంగులు పూస్తే ఆ చెట్టు ఎంతోకాలం బతకదు కదా..!. మన దేశానికి కావలసిన ముడి చమురు (పెట్రోల్, డీజిల్)లో దాదాపు ఎక్కువ భాగం మనం విదేశాల నుంచే కొంటున్నాం.

ప్రపంచంలో ఎక్కడో యుద్ధాలు జరిగితే, అక్కడ చమురు ధరలు పెరుగుతాయి. దాంతో మనం ఎక్కువ డబ్బులు పెట్టి చమురు కొనాల్సి వస్తుంది, ఫలితంగా మన దేశ కరెన్సీ బలం తగ్గిపోతుంది. ఇక్కడ పెట్రోల్, డీజిల్ రేట్లు పెరగగానే రవాణా ఖర్చులు పెరిగి, చివరికి సామాన్యుడు తినే ఉప్పు, పప్పు, టమోటాల ధరలు కూడా ప్రియమవుతాయి.వనరుల కోసం, ఇంధనం కోసం మనం ఇంకా విదేశాలపైనే ఆధారపడటం మన పెద్ద బలహీనత. మరోవైపు, దేశంలో చట్టబద్ధంగా జరగాల్సిన వ్యాపారాల కంటే, వెనుకదారిలో నడిచే 'నల్లధన' సామ్రాజ్యం ఒక పెద్ద భూతంలా విస్తరిస్తోంది. రాజకీయ నాయకులు, కొందరు బడా వ్యాపారవేత్తల చేతుల్లోనే ఈ సంపద కేంద్రీకృతమై మురిగి పోతోంది. ఈ దొంగ చాటు వ్యవస్థ వల్ల ప్రభుత్వానికి రావలసిన పన్నుల ఆదాయం రాదు. ఫలితంగా పేదలకు అందాల్సిన నిజమైన సాయానికి, ప్రభుత్వ ఆసుపత్రులు, పాఠశాలల అభివృద్ధికి నిధుల కొరత ఏర్పడుతోంది.

ఇలాంటి క్లిష్ట తరుణంలో ప్రభుత్వాలు చేయాల్సింది కేవలం తాత్కాలికంగా ఎన్నికల స్టంట్లుగా 'ఉచితాలు' ప్రకటించడమో, లేదా కాగితాల మీద లెక్కలతో మాయ చేయడమో కాదు. సామాన్యుడి చేతికి పని దొరకాలి. పల్లెల్లో, చిన్నచిన్న పట్టణాల్లో ఉపాధి అవకాశాలు పెరగాలి. చిన్న తరహా పరిశ్రమలకు, చేతివృత్తులకు రాయితీలు ఇచ్చి ఆదుకోవాలి. ఎందుకంటే.. సామాన్యుడి చేతిలో నాలుగు డబ్బులు ఆడితేనే, వాడు మార్కెట్‌కి వెళ్లి వస్తువులు కొంటాడు. వాడు కొంటేనే దేశంలో చిన్న చిన్న వ్యాపారాలు నడుస్తాయి. వ్యాపారాలు నడిస్తేనే దేశ ఆర్థిక వ్యవస్థకు నిజమైన బలం వస్తుంది. కార్పొరేట్ దిగ్గజాల లాభాల అంకెల్లో కనిపించే వెలుగు కంటే.. సామాన్యుడి కళ్లలో, అతని నిండు ఇంట్లో కనిపించే తృప్తే దేశ ప్రగతికి అసలైన కొలమానం..! అప్పుడే 'దేశం వెలుగుతోంది' అనే మాట ప్రతి సామాన్యుడి ఇంటా నిజమవుతుంది.



**రాజేందర్ దామెర** (దారా)
rajenderdamera@mail.com

# అంతర్జాతీయ కోర్టులో కార్మికుల చారిత్రక విజయం

## సానుకూల తీర్పు వచ్చినా 'సమ్మె హక్కు'పై పోరు తప్పదు

డాక్టర్ జ్ఞాన్ పాఠక్

అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఒ) ప్రకారం 'సంఘం ఏర్పాటు స్వేచ్ఛ, సంఘటితమయ్యే హక్కు పరిరక్షణ' సదస్సు (ఫ్రీడమ్ ఆఫ్ అసోసియేషన్, అండ్ ప్రొటెక్షన్ ఆఫ్ ద రైట్ టు ఆర్గనైజ్ కన్వెన్షన్) – 1948 నెం.87' ప్రకారం కార్మికుల సమ్మె హక్కుకు రక్షణ ఉందని అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసిజె) 2026 మే 21వ తేదీన 10– 4 ఓట్ల తేడాతో తుది తీర్పు ఇచ్చింది. 1948 ఒప్పందంలో సమ్మె హక్కు ఉందా లేదా అనే విషయంపై కార్మికులు, యజమానుల మధ్య దీర్ఘకాలంగా కొనసాగుతున్న వివాదాన్ని ఈ అడ్వైయిజరీ ఒపీనియన్ (సూచనాత్మక అభిప్రాయం) పరిష్కరిస్తుంది.

ఐసిజె అడ్వైయిజరీ ఒపీనియన్‌లకు చట్టబద్ధమైన కట్టుబాటు ఉండనప్పటికీ, అవి ఐఎల్ఒ ఒప్పందం నెం.87పై సంతకాలు చేసిన 158 దేశాల కార్మిక చట్టాలను ప్రత్యక్షంగా, ప్రపంచంలోని అన్ని దేశాలను పరోక్షంగా ప్రభావితం చేయగలవు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న న్యాయవ్యవస్థలు ఐసిజె అభిప్రాయాన్ని అధికారిక వ్యాఖ్యానంగా అంగీకరించవచ్చు.

ఒక రకంగా చెప్పాలంటే 'సమ్మె చేసే హక్కు'కు సంబంధించిన చారిత్రక పోరాటంలో కార్మికులు మరోసారి విజయం సాధించారు. ఐఎల్ఒ కన్వెన్షన్ నెం. 87 ప్రకారం సమ్మె చేసే హక్కు తమకు రక్షితమైన హక్కు అని కార్మికులు నిత్యం నొక్కి చెబుతూ వచ్చారు. అయితే, యజమానులు దీనితో విభేదించి, కార్మికుల 'సమ్మె హక్కు ను' రద్దు చేయాలని కోరుకున్నారు. అయినప్పటికీ ఈ విజయం కార్మికుల ను రక్షించడానికి సరిపోదు. ఎందుకంటే, ఆ హక్కుకు రక్ష ణ ఉన్నప్పటికీ, దానిని వినియోగించుకోవడానికి సంబంధించి న కచ్చితమైన అంశాలు, పరిధి లేదా షరతులను తన అభిప్రాయం నిర్ధారించలేదని అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసిజె) పేర్కొంది. దీనిఅర్థం, కార్మికులు మున్ముందు సుదీర్ఘ పోరాటం చేయాల్సి ఉంటుందని అర్థం. ఎందుకంటే, ఇది యజమానులు, వారికి మద్దతు ఇచ్చే ప్రభుత్వాలు దీనిని తారుమారుచేసే అవకాశం కల్పిస్తుంది. వీటికి సంబంధించిన సమస్యలు తదుపరి పరిశీలన కోసం ఐఎల్ఒ పాలక మండలి వద్దకు రావడం ఖా యం.

దీని పూర్తి పరిణామాలను అర్థం చేసుకోవాలంటే 2024 జూన్‌లో జరిగిన అంతర్జాతీయ కార్మిక సదస్సు (ఇంటర్నేషనల్ లేబర్ కౌన్సిల్ – ఐఎల్‌సి) 112వ సమావేశ అజెండాలో ఈ అంశాన్ని తక్షణమే చేర్చాలని కోరుతూ, అంతకుముందు పాలకమండలిలోని 14మంది యజమాన్య ప్రతినిధులు 2023 సెప్టెంబర్ 12న ఒక అభ్యర్థన చేశారనే విషయాన్ని మనం గుర్తు చేసుకోవాలి. కార్మికుల సమ్మె హక్కును హరించడమే ఆ అభ్యర్థన ఉద్దేశం. అంతే కాకుండా సంఘం ఏర్పాటు చేసుకునే హక్కుతో సహా కార్మికుల హక్కులను మరింతగా పరిమితం చేయడానికి ఒక లాబీ చాలా చురుకుగా పనిచేసింది.

సభ్య దేశాలు ఆమోదించిన కన్వెన్షన్‌ల(సదస్సుల) నిర్ణయా లు, సిఫార్సుల అమలును పర్యవేక్షించే బాధ్యత కలిగిన స్వతంత్ర నిపుణులతో కూడిన ఐఎల్ఒ కమిటీ చాలా సంవత్సరాలుగా సమ్మెచేసే హక్కు అనేది సంఘ స్వేచ్ఛ హక్కుకు ఒక సహజ పర్యవసానమని అభిప్రాయం వ్యక్తం చేస్తోంది. అది 1948 నాటి సంఘ స్వేచ్ఛ, సంఘటితమయ్యే హక్కుల పరిరక్షణ సదస్సు (నెం.87) ద్వారా పునర్వ్యవస్థీకరించబడిందని చెబుతోంది.

అయినప్పటికీ, యజమానుల బృందం కన్వెన్షన్ నెం.87పై నిపుణుల కమిటీ వ్యాఖ్యానాన్ని పదే పదే ప్రశ్నిస్తూ వచ్చింది. ఈ వివాదం క్రమంగా తీవ్రమై 2012లో ఒక పెద్ద సంస్థాగత సంక్షోభానికి దారితీసింది. దీంతో ప్రమాణాల అమలుపై కాన్ఫరెన్స్ కమిటీ తన పర్యవేక్షక విధులను నిర్వర్తించకుండా మొదటిసారిగా నిరోధించబడింది.

సమష్టి బేరసారాల అంశం 2022 మే లో త్రైపాక్షిక పరిశీలన బృందం ముందుకు వచ్చింది. సమష్టి బేరసారాల హక్కును ప్రోత్సహించడం, అమలు చేయడం కోసం రూపొందించిన వ్యూహాన్ని పాలకమండలి అజెండాలో చేర్చాలని ఆ బృందం నిర్ణయించింది. దీనిని మార్చి 2023 సమావేశంలో చేర్చి, 30 అక్టోబర్ – 9 నవంబర్ 2023 వరకు జరిగిన పాలకమండలి 349వ సమావేశంలో దీనిపై



వివరంగా చర్చించారు. అయినప్పటికీ, ఈ అంశంపై నిర్ణయం తీసుకోలేకపోయారు. పాలకమండలి సమావేశానికి వెలుపల 2023 నవంబర్ 10–11 తేదీలలో రెండు రోజుల ప్రత్యేక సమావేశం నిర్వహించబడింది. ఇది ఒక అరుదైన సంఘటన. 1919 నుండి ఐఎల్ఒ చరిత్రలో ఈ విధంగా జరగడం నాలుగవసారి. అంతకుముందు ఈ విధంగా 1932 సెప్టెంబర్, 1935 అక్టోబర్, 1970 మేలో జరిగాయి. సమష్టి బేరసారాల హక్కును ప్రోత్సహించేందుకు, అమలు చేసేందుకు ప్రతిపాదించిన ఐఎల్ఒ సమీకృత వ్యూహాన్ని ఐఎల్ఒ పాలక మండలి అప్పుడే ఆమోదించింది. ఆ వ్యూహాన్ని అమలు చేయడంలో తన మార్గదర్శకత్వాన్ని పరిగణనలోకి తీసుకుని, 2024 నవంబర్‌లో జరిగే తన 352వ సమావేశంలో ఒక పురోగతి నివేదికను సమర్పించవలసిందిగా ఐఎల్ఓ డైరెక్టర్ జనరల్‌ను కోరింది.

> ***మానవ చరిత్రలో నమోదైన మొట్టమొదటి సమ్మె, క్రీ.పూ. 1152 నవంబర్ 14న ప్రాచీన ఈజిప్టులో ఫారో రామ్సెస్ II ఆధ్వర్యంలో జరిగింది. తమకు జీతాలు చెల్లించనందున చేతివృత్తి కార్మికులు తమ పనులను విడిచిపెట్టారు. 1830లలో పారిశ్రామిక విప్లవం వచ్చాక బ్రిటన్‌లో నిజమైన, విస్తృతమైన 'కార్మిక చైతన్యం' ఆవిర్భవించే వరకు, కార్మికులు శతాబ్దాల పాటు బానిసలుగా చేయబడ్డారు. 1842లో మెరుగైన వేతనాలు, పని పరిస్థితులకోసం చేసిన డిమాండ్‌లు ఇంగ్లాండ్‌లో మొట్టమొదటి ఆధునిక సార్వత్రిక సమ్మెకు దారితీశాయి.***

అయినప్పటికీ, ఆ ప్రత్యేక సమావేశంలో ఐఎల్ఒ పాలక మండలి ఈ సమస్యను పరిష్కరించలేకపోయింది. కార్మికుల హక్కులను పరిమితం చేసేందుకు యజమానుల వర్గం పట్టుదలతో ఉంది. ఆ తర్వాత కార్మిక బృందం సమర్పించగా, 36 ప్రభుత్వాల మద్దతు పొందిన ఒక అభ్యర్థన మేరకు, ఐఎల్ఒ నియమావళిలోని ఆర్టికల్ 37 ప్రకారం, అడ్వైయిజరీ ఒపీనియన్ కోసం దీనిని అంతర్జాతీయ న్యాయస్థానానికి (ఐసిజె) నివేదించాలని పాలక మండలి 2023 నవంబర్ 10న నిర్ణయించింది.

కార్మికుల 'సంఘం ఏర్పాటు చేసుకునే హక్కు', 'సమ్మె చేసే హక్కు' విషయంలో ఐసిజె నిర్ధారణకు ఇప్పుడు ప్రాముఖ్యత ఉంది. అంతేగాక, కొత్త న్యాయశాస్త్రాన్ని రూపొందించడానికి ఐఎల్ఒ కమిటీ చేస్తున్న ప్రయత్నాలను యజమానుల బృందం వ్యతిరేకించినందున సైతం ఐసిజె తీర్పు ఇప్పుడు ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఐసిజెకు చట్టాలు చేసే అధికారంగాని, లేక జాతీయ చట్టాలు, నిబంధనలు అమలు చేసే అధికారం లేదని యజమాను లు వాదించారు.

ఐఎల్ఒ తన నియమావళిలోని ఆర్టికల్ 37 కింద అడ్వైజరీ ఒపీనియన్‌ను కోరడం ఇది ఏడవసారి. కానీ ఒక అంతర్జాతీయ కార్మిక ఒప్పందం వ్యాఖ్యానానికి సంబంధించి ఇది కేవలం రెండవసారి మాత్రమే. అంతేకాకుండా, 1945లో అంతర్జాతీయ న్యాయస్థానం ఏర్పడినప్పటి నుండి దానిని ఆశ్రయించడం ఇదే మొదటిసారి. వ్యాఖ్యానంపై మొదటి అభ్యర్థన 1932లో శాశ్వత అంతర్జాతీయ న్యాయస్థానానికి (ఐసిజెకు పూర్వగామి) చేయబడింది. ఇది 1919 నాటి రాత్రి పని (మహిళల) సదస్సు (నం.4) వ్యాఖ్యానానికి సంబంధించింది.

ప్రస్తుతం ఐసిజె నుంచి ఐఎల్ఒకు అడ్వైజరీ ఒపీనియన్ వచ్చింది. దాని పాలక మండలి 2026 నవంబర్‌లో జరిగే తన 358వ సమావేశంలో ఈ విషయాన్ని పరిశీలించనుంది. దీనిపై తదుపరి చర్యలు తీసుకోవలసి ఉంటుంది. ముఖ్యంగా ఐసిజె అడ్వైయిజరీ ఒపీనియన్‌లో సమ్మె హక్కును వినియోగించుకోవడానికి సంబంధించిన కచ్చితమైన విషయాలు, పరిధి లేదా షరతులు వంటి నిర్ధారించని విషయాలు ఉన్నాయి.

ఘనమైన పోరాటం, ప్రాణనష్టం తర్వాత కార్మికులు 'సమ్మె హక్కు'ను సాధించారని గమనించాలి. మానవ చరిత్రలో నమోదైన మొట్టమొదటి సమ్మె, క్రీ.పూ. 1152 నవంబర్ 14న ప్రాచీన ఈజిప్టులో ఫారో రామ్సెస్ II ఆధ్వర్యంలో జరిగింది. తమకు జీతాలు చెల్లించనందున చేతివృత్తి కార్మికులు తమ పనులను విడిచిపెట్టారు. 1830లలో పారిశ్రామిక విప్లవం వచ్చాక బ్రిటన్‌లో నిజమైన, విస్తృతమైన 'కార్మిక చైతన్యం' ఆవిర్భవించే వరకు, కార్మికులు శతాబ్దాల పాటు బానిసలుగా చేయబడ్డారు. 1842లో మెరుగైన వేతనాలు, పని పరిస్థితులకోసం చేసిన డిమాండ్‌లు ఇంగ్లాండ్‌లో మొట్టమొదటి ఆధునిక సార్వత్రిక సమ్మె కు దారితీశాయి. 20వ శతాబ్దంలో సమ్మెకు ఒక సాధనంగా చట్టపరమైన గుర్తింపు లభించింది. కానీ అది కేవలం గుర్తింపు పొందిన ట్రేడ్ యూనియన్ల ద్వారా మాత్రమే సాధ్యమైంది. ఉదాహరణకు 1901లో జరిగిన యుఎస్ స్టీల్‌లో గుర్తింపు సమ్మె, తరువాత 1902 లో జరిగిన బొగ్గు సమ్మె.

20వ శతాబ్దం మొదటి అర్ధభాగం లో, సుమారు 40 శాతం సమ్మెలు కేవలం ట్రేడ్ యూనియన్‌లుగా గుర్తింపు పొందడం కోసమే జరిగాయి. కార్మికుల సంఘటిత హక్కు, సమ్మెచేసే హక్కును పరిరక్షించడానికి ఐఎల్ఒ 1948లో కన్వెన్షన్ నెం.87ను ఆమోదించింది.

# డిజిటల్ యుగంలో చేతిరాత : సవాళ్లు

అక్షరం అంటే నాశనం లేనిది. మనిషి తన భావాలను కలకాలం పదిలపరుచుకోవడానికి కనిపెట్టిన అద్భుతమైన సాధనం లిపి. ఆ లిపికి అందమైన రూపాన్ని ఇచ్చేది చేతిరాత. ఒకప్పుడు చేతిరాతను కేవలం సమాచార మార్పిడి సాధనంగానే కాకుండా, ఒక గొప్ప కళగా, వ్యక్తిత్వానికి ప్రతిబింబంలా చూసేవారు.

నేటి డిజిటల్ కాలంలో కీబోర్డ్ వినియోగం, కంప్యూటర్ అక్షరాస్యత జీవితానికి అవసరమైన సాధనాలుగా మారాయి. సాంకేతికత మన పనులకు వేగాన్ని ఇస్తున్నప్పటికీ, అక్షరాలను అందంగా దిద్దే మధురమైన చేతిరాత కళ క్రమంగా మరుగున పడుతుండటం విచారించదగ్గ విషయం. ఇక్కడ సాంకేతికతను నిరసించడం కంటే, దాంతోపాటుగా మన మూలాలను కాపాడుకోవడం ముఖ్యం.

**చేతి రాతపై గాంధీజీ సందేశం :**

చేతిరాత ప్రాముఖ్యత గురించి మహాత్మా గాంధీ తన ఆత్మకథలో ప్రస్తావిస్తూ.. 'అశుద్ధమైన లేదా అస్పష్టమైన చేతిరాత అసంపూర్ణ విద్యకు సంకేతం' అని హెచ్చరించారు. విద్యార్థి దశలోనే అక్షరాలను అందంగా దిద్దడం నేర్చుకోవాలని, బాల్యంలో అలవడే గుండ్రని రాతే భవిష్యత్తు విద్యా వికాసానికి పునాది అవుతుందని ఆయన హితవు పలికారు.

ప్రపంచంలోని అందమైన లిపి కలిగిన భాషల్లో తెలుగు ఒకటి. తెలుగు వృత్తాకారంలో రాయబడుతుంది కాబట్టి దీనికి గుండ్రటి ఆకృతి ఉంటుంది. తలకట్టులు, కొమ్ములు, దీర్ఘాల నిర్దిష్టమైన వంపులతో తెలుగు అక్షరాలు లయబద్ధంగా సాగుతాయి. అందుకే తెలుగు చేతిరాత చూడ్డానికి ముత్యాల సరాల కోవలా మెరిసిపోతుంది.

మన పూర్వీకులు తాళపత్ర గ్రంథాల మీద ఘంటంతో రాసేటప్పుడు అక్షరం ఏ మాత్రం వంకరపోయినా ఆకు విరిగిపోయే ప్రమాదం ఉండేది. అందుకే వారు అత్యంత ఏకాగ్రతతో, కళాత్మకంగా రాయడం అలవాటు చేసుకున్నారు. అచ్చు యంత్రాలు రాకముందే మన లిపి ముత్యంలా ప్రకాశించేది.



'చేతిరాతను చూసి మనిషి వ్యక్తిత్వా న్ని చెప్పవచ్చు' అంటారు పెద్దలు. దీనిని చేతిరాత విశ్లేషణ శాస్త్రం(గ్రాఫాలజీ) అని పరిగణిస్తారు. మనం అక్షరాలను రాసే తీరు, వాటి మధ్య ఇచ్చే ఖాళీలు మన ఆత్మవిశ్వాసాన్ని సూచిస్తాయి.

విజ్ఞాన శాస్త్రం ప్రకారం, మనం చేతితో రాస్తున్నప్పుడు మెదడులోని వివిధ భాగాలు చురుగ్గా పనిచేస్తాయి. కీబోర్డ్‌పై టైప్ చేయడం యాంత్రికమైనది. కానీ చేత్తో రాసేటప్పుడు కళ్లు, చేతి కండరాలు, మెదడు మధ్య లోతైన సమన్వయం అవసరమవుతుంది. చేత్తో రాసి నేర్చుకున్న విషయాలు మెదడులో ఎక్కువ కాలం గుర్తుంటాయని పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి.

ప్రస్తుత విద్యా విధానంలో రాత నాణ్యత కంటే వేగానికే, మార్కులకే ప్రాధాన్యత ఇస్తున్నారు. దీనివల్ల విద్యార్థులు తీవ్రమైన ఆచరణాత్మక సమస్యలను ఎదుర్కొంటున్నారు.



**అక్షర నిర్మాణ క్రమం తెలియకపోవడం:** నేటితరం విద్యార్థులకు ఒక అక్షరాన్ని ఎక్కడ ప్రారంభించాలో, ఎలా ముగించాలో అవగాహన లోపిస్తోంది. ఉదాహరణకు తెలుగులో 'ఓ' కు 'ఒ' కు ఉన్న తేడా, 'ఔ' కు 'ఙా' కు ఉన్న వ్యత్యాసం, అలాగే 'ఘ' 'ఝ', 'న' 'స', 'ఫ' 'ష', 'భ', 'మ' 'య'వంటి అక్షరాల ప్రాథమిక నిర్మాణ భేదాలు తెలియక తికమకపడుతున్నారు. ఒత్తులను సరైన స్థానంలో రాయడానికి ఇబ్బంది పడుతున్నారు.

**కృత్రిమ రాత, అక్షర దోషాలు:** అక్షరాల ఆకృతులపై స్పష్టత లేకపోవడంతో, వారు రాసే రాత ఇతరులకు అర్థం కాకపోవడమే కాకుండా, వారిలో అక్షర దోషాలు విపరీతంగా పెరుగుతున్నాయి.

**అభ్యాస పద్ధతులు లోపించడం:** పాఠశాలల్లో ఒకప్పుడు కాపీ రైటింగ్ పుస్తకాలు తప్పనిసరిగా ఉండేవి. నేడు ప్రాథమిక స్థాయిలోనే స్క్రీన్ టైమ్ పెరగడంతో పెన్ పట్టి రాసే అలవాటు క్రమంగాతప్పుతోంది.

**పునరుజ్జీవనానికి ఆచరణాత్మక చర్యలు: పాఠశాల స్థాయి లో శాస్త్రీయ శిక్షణ:** ప్రాథమిక తరగతుల నుంచే అక్షరాల స్ట్రోక్స్ (ఎక్కడ మొదలుపెట్టా లి, ఎలా ముగించాలి) అనే పద్ధతిని ఉపాధ్యాయు లు నేర్పించాలి. నేటి డిజిటల్ బోర్డులపై కూడా అక్షరాల అమరికను చలనచిత్రాల (యానిమేషన్)ద్వారా చూపిస్తూ సులువుగా నేర్పించవచ్చు.

**పోటీలు, ప్రోత్సాహకాలు:** విద్యార్థుల అందమైన చేతిరాతలను పాఠశాల సమాచా ర పలకాలపై ప్రదర్శించాలి. పాఠశాల, మండల స్థాయిల్లో చేతిరాత పోటీలు నిర్వహించి ఉత్తమ రాత కలిగిన విద్యార్థులను గుర్తించి బహుమతులు అందించాలి.

**నిత్య జీవితంలో భాగం చేయడం:** విద్యార్థులు రోజువారీ డైరీ రాయడం, ఉపాధ్యాయులకు లేదా తల్లిదండ్రులకు చేత్తోరాసిన కృతజ్ఞతా లేఖలు ఇవ్వడం, స్వయంగా సెలవు పత్రం రాయడం అలవాటు చేయాలి.

పండుగలకు చేత్తో రాసిన శుభాకాంక్షల కార్డులు పంపడం వల్ల ఆత్మీయత పెరుగుతుంది. చేతిరాత ఒక మనిషి హృదయ స్పందనకు, సృజనాత్మకతకు ప్రతీక. డిజిటల్ యుగంలో మనం ఎంత వేగంగా దూసుకుపోతున్నా, సాంకేతికతను జీవనోపాధికి వాడుకుంటూనే, మన మానసిక వికాసానికి చిహ్నమైన చేతిరాతను వదులుకోకూడదు.

అక్షర సంస్కృతిని కాపాడుకోవడం అంటే మన ఆలోచనా సరళిని కాపాడుకోవడమే. గాంధీజీ అన్నట్లు, అందమైన రాతను ఒక ఆస్తిగా భావించి భావితరాలకు అందిద్దాం. అక్షరం ముత్యంలా మెరిసి, సరైన ఆకృతిని పొందినప్పుడే విద్యార్థి చదువుకు పరిపూర్ణత లభిస్తుంది.

**మారెపల్లి అనిల్ కుమార్,**
చేతిరాత నిపుణులు, 99121 62087.

# హైదరాబాద్‌కు మరో గ్లోబల్ కెపబిలిటీ సెంటర్

## తెలంగాణలో రీజెనరాన్ తొలి విదేశీ జిసిసి ఏర్పాటు



ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రపంచ ప్రఖ్యాత బయోటెక్నాలజీ సంస్థల దృష్టిని ఆకర్షిస్తున్న హైదరాబాద్ మరో ప్రతిష్టాత్మక గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ (జిసిసి) రానుంది. అమెరికాకు చెందిన బయోటెక్ దిగ్గజం రీజెనరాన్ అమెరికా వెలుపల తమ తొలి జిసిసిని తెలంగాణలో ఏర్పాటు చేయాలని నిర్ణయించుకోవడం రాష్ట్రానికి మరో కీలక మైలురాయిగా నిలిచింది. న్యూయార్క్‌లోని టర్రీ టౌన్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న రీజెనరాన్ ప్రతినిధి బృందం మంగళవారం తెలంగాణ సచివాలయంలో ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో సమావేశమైంది. ఈ సందర్భంగా రీజెనరాన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బ్యారీ కోవెల్, తెలంగాణ లైఫ్ సైన్సెస్ సిఇఒ సత్యేశ్ సింగ్ సమక్షంలో జిసిసి ఏర్పాటుకు సంబంధించిన అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, అత్యున్నత స్థాయి మౌలిక సదుపాయాలు, ప్రతిభావంతులైన సాంకేతిక నిపుణులు, వేగంగా విస్తరిస్తున్న డిజిటల్ ఎకోసిస్టం కారణంగా ప్రపంచ సంస్థలు హైదరాబాద్‌ను తమ గ్లోబల్ కార్యకలాపాల కేంద్రంగా ఎంపిక చేస్తున్నాయని తెలిపారు. రీజెనరాన్‌కు ఇప్పటికే ఐర్లాండ యూకే, జర్మనీ, నెదర్లాండ్స్‌లలో కార్యాలయాలు, ఉత్పత్తి కేంద్రాలు ఉన్నప్పటికీ, హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్న జిసిసి ప్రత్యేకమైన గ్లోబల్ హబ్‌గా పనిచేస్తుందని ఆయన వివరించారు. ఈ కేంద్రం ద్వారా ప్రపంచవ్యాప్తంగా సంస్థ కార్యకలాపాల సమన్వయం, క్లినికల్ ట్రయల్స్ నిర్వహణ, అధునాతన డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇంజినీరింగ్, కమర్షియల్ అనలిటిక్స్ వంటి కీలక సేవలు అందించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో దాదాపు 450 గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని, జిసిసిల స్థాపనలో ముంబై, ఢిల్లీ, చెన్నైలను అధిగమించి హైదరాబాద్ దేశంలో రెండో స్థానానికి చేరుకుందని మంత్రి పేర్కొన్నారు. బయోటెక్నాలజీ, లైఫ్ సైన్సెస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, డిజిటల్ టెక్నాలజీల రంగాల్లో తెలంగాణ బలమైన వాతావరణాన్ని కల్పించిందని, అదే ప్రపంచ పెట్టుబడులను ఆకర్షిస్తోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పరిశోధన, తయారీ, పారిశ్రామిక అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్న మంత్రి, జీనోమ్ వ్యాలీ విస్తరణతో పాటు త్వరలో ఏర్పాటు కానున్న గ్రీన్ ఫార్మా సిటీ రాష్ట్ర లైఫ్ సైన్సెస్ రంగానికి మరింత ఊతమిస్తాయని చెప్పారు. రీజెనరాన్ ఏర్పాటు చేయనున్న ఈ గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ ద్వారా రాబోయే సంవత్సరాల్లో పెద్ద సంఖ్యలో ఉన్నత స్థాయి ఉద్యోగ అవకాశాలు సృష్టించబడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. సమావేశంలో రీజెనరాన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బ్యారీ కోవెల్, జీసీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజీవ్ ఓనాల్, సంస్థ ప్రతినిధులు, పరిశ్రమల శాఖ అధికారులు పాల్గొన్నారు.



# ఉద్యోగులకు అండగా నిలుస్తాం

### ఆర్‌టిసి ఎండి నాగిరెడ్డి

### రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉద్యోగులకు రూ. కోటి చొప్పున ఆర్థిక సాయం

ప్రజాపక్షం/హైదరాబాద్: రోడ్డు ప్రమాదాల్లో అకాల మరణం చెందిన ఉద్యోగుల కుటుంబాలకు అండగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నిలిచింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో అమలు చేస్తున్న ఉచిత ప్రమాద బీమా పథకం ద్వారా ఇద్దరు మృతి చెందిన డ్రైవర్ల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. కోటి చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేసింది. పికెట్, పరిగి డిపోలకు చెందిన డ్రైవర్లు శ్రీనివాసరెడ్డి, సుధాకర్‌లు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో మరణించగా, వారి కుటుంబాలకు సోమవారం బస్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో చెక్కులను అందజేశారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ ఎం. రవీంద్ర బాబు, రీజనల్ హెడ్ డి. వెంకటేశ్వర్లుతో కలిసి ఎండి వై. నాగిరెడ్డి ఈ ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎండీ నాగిరెడ్డి మాట్లాడుతూ విధులకు వెళ్తున్న సమయంలో ప్రమాదాలకు గురై ఇద్దరు డ్రైవర్ల ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. ఎలాంటి తప్పు లేకపోయినా కుటుంబాలకు పెద్దదిక్కుగా ఉన్న ఉద్యోగులు ప్రమాదంలో మృతి చెందడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి సంస్థ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఆపద సమయంలో కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేలా పథకాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని చెప్పారు. ఇలాంటి ప్రమాద బీమా పథకాలు కష్టకాలంలో ఎంతగానో ఉపయోగపడతాయని, ఉద్యోగులు వాటిని నిర్లక్ష్యం చేయకుండా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇడి సిహెచ్. వెంకన్న, ఫైనాన్స్ అడ్వైజర్ విజయపుష్ప, సిపిఎం ఉషాదేవి, యూనియన్ బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

### పెద్ద షాపూర్‌లో ప్రభుత్వ భూమి

# ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసే కుట్ర

### బిఆర్ఎస్ఎల్‌పి హరీశ్ రావు ఆరోపణ



ప్రజాపక్షం/హైదరాబాద్: శంషాబాద్ మండలం పెద్ద షాపూర్ 173 నుంచి 183 మధ్య ఉన్న భూముల్లో 170 ఎకరాల ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసేందుకు కుట్ర జరుగుతోందని బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్ రావు ఆరోపించారు. ప్రభుత్వ భూమి రాత్రికి రాత్రి ఎలా ప్రైవేటుపరమైందని, దీనిపై సిట్ వేయాలని, లేదా సిబిఐతో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఈ భూమి ప్రభుత్వ భూమి అని, దీనిని ఆక్రమణకు గురి కాకుండా ఉండాలని, ఈ స్థలాన్ని ప్రొహిబిటరీ 22 ఎ లిస్టులో పెట్టాలని తహశీల్దార్‌కు ఆర్‌డిఓ సూచించారని, ఇదే విషయమై జనవరి 30, 2026న హైకోర్టులో అఫిడవిట్ పొందుపరిచారని హరీశ్‌రావు వివరించారు. ఈ భూమి ప్రభుత్వ భూమి అని ఫిబ్రవరి 24, 2026న చెప్పిన తహశీల్దార్, మరో నాలుగు రోజుల తర్వాత ఫిబ్రవరి 28, 2026 ఈ భూమి ప్రైవేటు వ్యక్తులకు చెందుతుందని ఆర్డర్ పాస్ చేశారని ఆరోపించారు. వెయ్యి కోట్ల రూపాయల విలువ చేసే భూమిని స్కామ్ జరిగితే అధికారులు ఏ చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. ముఖ్యమంత్రికి అతి సన్నిహితుడు ఇందులో ఉన్నందునే ఎసిబి తనిఖీలకు వెళ్లి మళ్లీ వెనక్కి వచ్చిందని ఆరోపించారు. ఆ తహశీల్దార్‌ను కాపాడే పెద్దలు ఎవరో? బయటకు రావాలని డిమాండ్ చేశారు. వెయ్యి కోట్ల విలువైన భూమి వెనుక కలెక్టర్ ఉన్నారా?, లేదా ప్రభుత్వ పెద్దలు ఉన్నారా? అని అన్నారు. ఈ భూములు రాత్రికి రాత్రి ఎలా ప్రైవేటు భూమి అయిందన్నారు. ఆర్డర్ జారీ చేసిన తహశీల్దార్‌ను వెంటనే సర్వీస్ నుంచి డిస్మిస్ చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. దీనిపై సిట్ లేదా సిబిఐ విచారణ జరిపించాలి. కలెక్టర్, సిసిఎల్ఎ, ఉన్నతాధికారులు ఉన్నరా అదా తేలాలన్నారు. ఈ భూ కుంభకోణంలో భాగస్వామ్యం లేకపోతే తహశీల్దార్‌ను వెంటనే డిస్మిస్ చేయాలని, ఆ ప్రభుత్వ భూమిని కాపాడాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, సబితాఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్, ఎంఎల్‌సిలు ఎల్.రమణ, దేశపతిశ్రీనివాస్, ఎంఎల్ఎ మురాగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



# అర్హులందరికీ ఓటు హక్కు

### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : భారత ఎన్నికల సంఘం రాష్ట్రంలో త్వరలో చేపట్టనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను పూర్తి స్థాయి పారదర్శకతతో నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో నమోదు కావడంతో పాటు, అనర్హులైన ఓటర్ల పేర్ల తొలగింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. హైదరాబాద్‌లోని బిఆర్‌కె భవన్‌లో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి, ఉప ప్రధాన ఎన్నికల అధికారి (ఎఫ్ఎసి) జి.ఎస్. చారి, జిహెచ్ఎంసి కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి ఆర్.వి. కర్ణన్, మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి, సంబంధిత ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్ఓలు) హాజరయ్యారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో బూత్ స్థాయి అధికారులు (బిఎల్ఓలు) కీలక పాత్ర పోషిస్తున్నందున వారికి తగిన శిక్షణ అందించాలని సిఈఓ సూచించారు. బిఎల్ఓల పనితీరును నిరంతరం సమీక్షిస్తూ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎత్తైన అపార్ట్‌మెంట్ సముదాయాలు, గేటెడ్ కమ్యూనిటీలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లోని మురికివాడలలో విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రజలకు మరింత సులభతరం చేయడానికి ఎన్యూమరేషన్ ఫారాలు తెలుగు, ఆంగ్ల భాషల్లో అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. అలాగే విఐపి, వివిఐపి ఓటర్ల మ్యాపింగ్ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా పనిచేసే సిబ్బందిని ప్రోత్సహించేందుకు అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన బూత్ స్థాయి అధికారికి బెస్ట్ బిఎల్ఓ అవార్డు ప్రదానం చేయనున్నట్లు సుదర్శన్ రెడ్డి ప్రకటించారు.

### జిఓ 7 రద్దు చేయకపోతే

# ఉద్యమం తీవ్రం చేస్తాం

### ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై బిసి నేతల అల్టిమేటం



ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని, జిఓ 7ను వెంటనే రద్దు చేసి పాత విధానంలోనే పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బిసి సంఘాలు, వివిధ రాజకీయ పార్టీల నేతలు ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక జారీ చేశారు. ఫీజుల విడుదలలో జాప్యం చేస్తూ పేద, బడుగు విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని మండిపడ్డారు. ఇదే పరిస్థితి కొనసాగితే బిసిలు ఏకమై ప్రభుత్వంపై తిరగబడే పరిస్థితులు వస్తాయని హెచ్చరించారు. హైదరాబాద్ కాచిగూడలోని బిసి విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై అమలులోకి వచ్చిన జిఓ7ను రద్దు చేసి పాత విధానంలోనే పథకాన్ని కొనసాగించాలని సమావేశంలో తీర్మానించారు. మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయకుండా వేలాది పేద విద్యార్థుల జీవితాలను అనిశ్చితిలోకి నెట్టొద్దని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డికి ఇదే చివరి హెచ్చరికగా భావించాలని, తక్షణమే బకాయిలు విడుదల చేసి పాత విధానాన్ని అమలు చేయాలని డిమాండ చేశారు. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందా? లేక విద్యార్థుల విద్యను నిర్లక్ష్యం చేస్తోందా? అని ప్రశ్నించారు. ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని గుర్తు చేశారు. అదే కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఆ పథకంపై ప్రతికూల భావన తీసుకురాకూడదన్నారు. త్వరలో సిఎం, ఉప ముఖ్యమంత్రిని కలిసి బిసి విద్యార్థుల ఫీజుల అంశంపై చర్చిస్తానని తెలిపారు. బిఆర్ఎస్ శాసనమండలి పక్ష నేత సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా బీసీల పట్ల వైఖరిలో మార్పు లేదన్నారు. రాష్ట్ర అభివృద్ధి పేరుతో భారీ ప్రాజెక్టులకు నిధులు కేటాయిస్తున్న ప్రభుత్వం పేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం అవసరమైన నిధులు ఎందుకు విడుదల చేయలేకపోతుందని ప్రశ్నించారు. బిసి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్ రాష్ట్ర అధ్యక్షుడు గొడుగు మహేష్ యాదవ్ మాట్లాడుతూ పాత విధానంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలుపై ప్రభుత్వం ముందుగా స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, బిసి జెఎసి కో చైర్మన్ కులకచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బిసి కుల సంఘాల జెఎసి చైర్మన్ కుందారం గణేష్ చారి, బిజి జెఎసి కో చైర్మన్ ఉప్పరి శేఖర్ సగర, టిజెఎస్ పార్టీ ప్రతినిధి జస్వంత్ కుమార్, బిసి జెఎసి నాయకులు చంద్రశేఖర్ గౌడ్ వేముల రామకృష్ణ, దీటి మల్లయ్య, కౌలే జగన్నాథం, గోద వరుణ్ కుమార్ గౌడ్ నరసింహ నాయక్, జిల్లెల నరసింహ, తారాకేశ్వరి, సమతా యాదవ్, సంధ్యారాణి, స్వర్ణ గౌడ్ కొప్పుల చందు గౌడ గజ్జల సత్యరాజ్ గౌడ్ సుజాత, గౌతమి, ఇంద్రం రజక, గూడూరు భాస్కర్ , నాగరాజుగౌడ్ మాదేశి రాజేందర్, నరసింహ చారి, బ్రహ్మాచారి, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు

# 40వేల మెట్రిక్ టన్నుల బొగ్గు ఎక్కడుందో చూపాలి?

### కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని హరీశ్‌రావు డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో 40వేల మెట్రిక్ టన్నుల బొగ్గు ఎక్కడుందో ఆధారాలు చూపించాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డిని బిఆర్ఎస్ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థ అధికారిక వెబ్‌సైట్‌లో 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు స్టాక్ ఉన్నట్టు చూపిస్తోందని, మరో వైపు రూ. 16వందల కోట్ల విలువ చేసే 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గుకు పన్నులను చెల్లించారని తెలిపారు. ప్రస్తుతం ఆ రూ.16 వందల కోట్లు ఎక్కడున్నాయో చూపాలన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం 'బొగ్గు గని కార్మిక రాష్ట్ర కార్యవర్గ' సమావేశం జరిగింది. ఈ సమావేశంలో హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత సింగరేణి సంస్థ ఆందోళనలో ఉన్నదని, ఈ సంస్థ ప్రస్తుతం ఒక స్కామ్ తరహా మారిందని ఆరోపించారు. సింగరేణి సంస్థకు 2014లో కేవలం 2 వేల కోట్ల బకాయిలు ఉంటే,ఆ తర్వాత టిఎస్ జెన్‌కో నుంచి సింగరేణికి రూ. ఏడు వేల కోట్ల బకాయిలు ఉండేవని,ప్రస్తుత కాంగ్రెస్ రెండునరేళ్ల పాలనలో సింగరేణి బకాయిలు రూ. 21 వేల కోట్లు అని వివరించారు. కాంగ్రెస్ పాలనలో సింగరేణికి రూ. 14 వేల కోట్ల బకాయిలు ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ 'ఒడి' రూ.3,200 కోట్లు ఉంటే, సింగరేణి 'ఒడి' రూ.4 వేల కోట్లు అని అన్నారు. ఎన్‌టిపిసి అత్యంత చౌకగా విద్యుత్ ఇచ్చేందుకు సిద్ధమైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకోవడం లేదని ఆరోపించారు. బొగ్గు గనుల్లో అవినీతి జరుగుతుందని బిఆర్ఎస్ ప్రస్తావించగా, దీనిపైన కేంద్రం స్పందిస్తూ ఒక కమిటీ ఏర్పాటు చేసిందని, ఈ కమిటీ ఏం తేల్చిందనే విషయాన్ని పబ్లిక్ డొమెన్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ బొగ్గు గని కార్మిక నాయకులు పాల్గొన్నారు.

# ఎంఐఎం ఒత్తిడితోనే జిహెచ్‌ఎంసి మూడు ముక్కలు

### బిజెపి అధ్యక్షుడు రాంచందర్ రావు

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఎంఐఎం పార్టీ ఒత్తిడికి లొంగి రేవంత్ రెడ్డి ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్‌ఎంసి) పరిధిని అశాస్త్రీయంగా మూడు ముక్కలు చేసిందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తీవ్ర స్థాయిలో విమర్శించారు. నగరంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఎంఐఎం కనుసన్నల్లో నడుస్తూ హైదరాబాద్ ప్రజలను వంచిస్తున్నాయన్నారు. జిహెచ్‌ఎంసిని విభజించి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సిఎంసి), మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి)లను తీసుకురావాలనే ఆలోచన కేవలం ఎంఐఎం ప్రయోజనాల కోసమేనని ఆయన ఆరోపించారు. నగరాన్ని విడగొడితే తప్ప ఎంఐఎం గెలవలేని పరిస్థితి ఉందని, అందుకే రేవంత్ సర్కార్ ఆ పార్టీకి ఒక భాగాన్ని దారాదత్తం చేయడానికి సిద్ధమైందని విమర్శించారు. విభజన మ్యాప్‌లపై అధికారులకే కనీస స్పష్టత లేదని, ఎక్కడ ఏ సరిహద్దు వస్తుందో తెలియకుండా గందరగోళం సృష్టించారన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో గరీబోళ్లను ముంచితే, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం 'ఇందిరమ్మ ఇళ్లు' అంటూ నివేదికల పేరుతో కాలయాపన చేస్తూ ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. హిల్ట్ పాలసీ పేరుతో కాలుష్య కారక పరిశ్రమలను నగరం వెలుపలికి తరలించి, ఆ ప్రాంతాలను రెసిడెన్షియల్ జోన్లుగా మార్చి భారీ రియల్ ఎస్టేట్ కుంభకోణానికి తెరలేపారని ఆరోపించారు. దీనివల్ల ఎంతమంది ఉపాధి కోల్పోతారనే దానిపై ఎలాంటి 'ఇంపాక్ట్ అసెస్‌మెంట్' చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కమిషన్‌ల శాతాన్ని 30 శాతం నుండి 40 శాతానికి పెంచి బిల్డర్లను వేధిస్తుండటంతో నగరంలో కొత్త వెంచర్లు రాక రియల్ ఎస్టేట్ రంగం పూర్తిగా దెబ్బతిన్నదని తెలిపారు. కాంగ్రెస్, బిఆర్ఎస్‌లకు ఓటు వేస్తే అది ఎంఐఎంకు ఓటు వేసినట్లేనని, రాబోయే జిహెచ్‌ఎంసి ఎన్నికల్లో ఈ మూడు స్వార్థ పార్టీలకు బుద్ధి చెప్పి, అవినీతి రహిత పాలన అందించే బిజెపిని గెలిపించాలని ఆయన నగర ప్రజలను కోరారు.

# ఎన్నికలు ముగియగానే ప్రజలపై పెట్రో బాదుడు

### మోదీ ప్రభుత్వానికి తగునా?

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసిన వెంటనే పెట్రోల్, డీజిల్ ధరలను భారీగా పెంచి సామాన్య ప్రజలపై మోదీ ప్రభుత్వం మోయరాని భారాన్ని మోపారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత మూడు నాలుగు నెలలుగా అంతర్జాతీయంగా యుద్ధ వాతావరణం నడుస్తున్నప్పటికీ, ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కేంద్రం ఆయిల్ ధరలను పెంచకుండా నియంత్రించిందని విమర్శించారు. తీరా ఎన్నికలు ముగియగానే విడతల వారీగా లీటరుకు రూ. 8 నుండి రూ. 9 వరకు పెంచడం ప్రజలను వంచించడమేనన్నారు. ఎన్నికల్లో గెలవడం కోసం బిజెపి ఎంతటి అడ్డదారులైనా తొక్కుతుందని ఆయన మండిపడ్డారు. పెట్రో ధరల పెంపు ప్రభావంతో నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటి, సామాన్య ప్రజలు బతకడమే కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ ఆయిల్ కంపెనీలతో కేంద్ర ప్రభుత్వం లోపాయికారీ ఒప్పందాలు కుదుర్చుకుందని, ప్రజల కష్టాలను, కన్నీళ్లను పట్టించుకోకుండా ధరలు పెంచుకుంటూ పోతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశం లక్షల కోట్ల అప్పుల్లో కూరుకుపోతున్నా, బిజెపికి మాత్రం కోట్ల రూపాయల నిధులు ఎక్కడి నుండి వస్తున్నాయని ఆయన ప్రశ్నించారు. 'డబుల్ ఇంజన్ సర్కార్', 'పారదర్శక సర్కార్' అని గొప్పలు చెప్పుకునే బిజెపి పెద్దలు దీనికి సమాధానం చెప్పాలని చాడ వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తగ్గించాలన్నారు. లేనిపక్షంలో ప్రజాస్వామ్యంలో ప్రజలే బిజెపి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని చాడ వెంకట్ రెడ్డి హెచ్చరించారు.

# విద్యార్థుల డేటా ప్రైవేట్ ఏజెన్సీలకు చేరితే కఠిన చర్యలు

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలోని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, సంరక్షకుల మొబైల్ నంబర్లు, వ్యక్తిగత డేటాను ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటు వ్యక్తులకు, ప్రైవేటు ఏజెన్సీలకు, సంస్థలకు ఇవ్వకూడదని రాష్ట్ర పాఠశాల విద్య సంచాలకులు డాక్టర్ ఇ.నవీన్ నికోలస్ ఆదేశించారు. సమాచారాన్ని దుర్వినియోగం చేస్తే తీవ్రంగా పరిగణిస్తామని, అలాంటి వారిపైన నిబంధనల ప్రకారం క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. నిర్దేశించిన నియమాలు, నిబంధనలకు అనుగుణంగా అధికారిక విద్యా ప్రయోజనాల కోసం మాత్రమే ఉపయోగించాలని సూచించారు.

# ఎపి పోలీసుల నుంచి ఎలాంటి నోటీసులు రాలేదు

### ప్రొఫెసర్ నాగేశ్వర్



ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె. నాగేశ్వర్ మంగళవారం తెలంగాణ డిజిపి సివి ఆనంద్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తనకు ఆంధ్రప్రదేశ్ పోలీసుల నుంచి ఎలాంటి నోటీసులు అందలేదని స్పష్టం చేశారు. తనపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారం, తప్పుడు సమాచారంపై చర్యలు తీసుకోవాలని డిజిపిని కోరినట్లు ఆయన వివరించారు. ఇటీవల ఒక టీవీ చర్చా కార్యక్రమంలో పవన్ కల్యాణ్, అమిత్ షా, వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సంబంధించి నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదమైన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలను తాను ఇప్పటికే ఉపసంహరించుకున్నట్లు ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో జనసేన నాయకుల ఫిర్యాదులతో కాకినాడ, మచిలీపట్నం వంటి ప్రాంతాల్లో ఆయనపై పలు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. ఈ క్రమంలో నాగేశ్వర్‌ను అరెస్ట్ చేసేందుకు ఎపి పోలీసులు హైదరాబాద్ వెళ్లారంటూ సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరిగింది. అయితే, ఈ వార్తలను ఎపి ప్రభుత్వం అప్పుడే ఖండించింది.

# ఎసిబి వలలో అవినీతి తిమింగలం

### రూ.2 లక్షలు తీసుకొంటూ రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కిన శామీర్‌పేట తహసీల్దార్ సుచరిత

### ఆర్డీఓ రాజేష్ కార్యాలయంపైనా సోదాలు

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా యంత్రాంగం అవినీతి మరోసారి బట్టబయలైంది. తాజాగా శామీర్‌పేట మండల మహిళా తహసీల్దార్ సుచరిత ఓ భూ కన్వర్షన్‌కు సంబంధించి ఎకరాకు రూ. లక్ష చొప్పున మొత్తం రూ. 30 లక్షలకు బేరం కుదుర్చుకొంది. ఇందుకోసం అడ్వాన్స్‌గా రూ. 2 లక్షలు తీసుకొంటున్న తరుణంలో ఎసిబి ఎంట్రీతో సీన్ రివర్స్ అయింది. ఆమె ఆదేశాలతో డబ్బు తీసుకొంటున్న డ్రైవర్‌తో పాటు ఆమె సైతం కటకటాల వెనక్కు వెళ్లాల్సివచ్చింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఎసిబి వలలో పడుతున్న వారిలో మొన్న జలమండలి జనరల్ మేనేజర్, నిన్న డిప్యూటి కలెక్టర్‌ల జాబితాలో మరో అవినీతి మహిళా తిమింగలం చేరింది. జిల్లాలో కీలకమైన శామీర్‌పేట తహసీల్దార్‌గా పని చేస్తున్న సుచరిత ఆమె డ్రైవర్ నాగేష్ ద్వారా రూ. 2 లక్షలు తీసుకొంటుండగా ఎసిబి అధికారుల బృందం వల పన్ని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొన్నారు. కార్యాలయంలోని కీలక పత్రాలు, భూ అనుమతులకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకొన్నారు. సదరు తహసీల్దార్ సుచరితకు సహకరించారన్న అనుమానాలతో కీసర ఆర్డీఓ రాజేష్‌తో పాటు శామీర్‌పేట, ఆర్డీఓ కార్యాలయ సిబ్బందిని సైతం విచారిస్తున్నారు. రంగారెడ్డి ఎసిబి డిఎస్పీ ఆనంద్ కుమార్ దీనికి సంబంధించిన వివరాలు తెలియ చేస్తూ శామీర్‌పేట మండలం అలియాబాద్ ప్రాంతంలో సుమారు 30 ఎకరాల భూమి నాలా కన్వర్షన్ కోసం సంబంధించిన రైతులు తహసీల్దార్‌ను సంప్రదించారు. ఈ పని పూర్తి చేసేందుకు తనకు ఎకరానికి లక్ష రూపాయల చొప్పున చెల్లించాల్సి ఉంటుందని ఆమె ఖరాఖండీగా చెప్పారు. విడతల వారీగా చెల్లిస్తామంటూ రైతులు కోరటంతో అంగీకరించిన తహసీల్దార్ తొలి విడతగా మంగళవారం రూ 2 లక్షలు తెచ్చి తన డ్రైవర్ నాగేష్‌కు ఇవ్వాలని చెప్పారు. కాగా ఈ విషయాన్ని బాధిత రైతులు లిఖితపూర్వకంగా ఎసిబి అధికారులను సంప్రదించగా ముందస్తు పథకం ప్రకారం మంగళవారం తహసీల్దార్ చెప్పిన విధంగా రూ.2లక్షలు ఆమె డ్రైవర్ నాగేష్‌కు ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొన్నారు. అనంతరం తహసీల్దార్‌ను సైతం అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని తెలిపారు.



**మూడేళ్ల క్రితం ఇక్కడే తహసీల్దార్ సత్యనారాయణ**

2024లో శామీర్‌పేట తహసీల్దార్‌గా పని చేసిన సత్యనారాయణ రూ. 2 లక్షలు డ్రైవర్‌తో కల్సి తీసుకొని ఎసిబికి చిక్కిన ఘటన అప్పట్లో తీవ్ర సంచలనం సృష్టించగా తాజాగా అదే కార్యాలయ మహిళా తహసీల్దార్ సుచరిత సైతం అదే తరహాలో డ్రైవర్ ద్వారా లంచం తీసుకొంటూ రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కటం చర్చనీయాంశంగా మారింది.


**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ :: సరూర్‌నగర్ సర్కిల్-12**

NIT No. 06/EE12/SRNR/MMC/2026-27, తేది: 25-05-2026, పని పేరు: (01) నెం. పనికి సంబంధించి: ''అల్యూమినియం కాంపోజిట్ క్లాడింగ్ మరియు గ్రానైట్ క్లాడింగ్ సరఫరా మరియు అమరిక'', అంచనా విలువ: రూ.6.75 లక్షలు, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 02.06.2026 మ.03.10గం.ల వరకు, అధికారి పేరు & చిరునామా: శ్రీ వి.కార్తీక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సరూర్‌నగర్ సర్కిల్-12, ఎంఎంసి. సెల్ నెం. 9701365519. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ http://www.eprocurement.telangana.gov.in/లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సరూర్‌నగర్ సర్కిల్-12, ఎంఎంసి.

DIPR R.O. No. : 3015-PP/CL/ADVT/2026-27, Date: 26-05-2026

**శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానము**

మట్టపల్లి మహాక్షేత్రము, మఠంపల్లి మండలము, సూర్యాపేట జిల్లా.

టెండర్ - కం - బహిరంగ వేలముల ప్రకటన

లేఖ నెం.29/యస్.యల్.యన్.యస్.డి/2024, తేది: 26-05-2026

ఇందు మూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా ! సదరు దేవస్థానమునకు సంబంధించిన బహిరంగ వేలము ది: 04-06-2026, గురువారము రోజున మ. 2-00 గం.లకు దేవాలయ ప్రాంగణం నందు దేవాదాయ శాఖ అధికారుల సమక్షములో నిర్వహించబడును.

| క్ర.సం. | వేలము వివరము | డిపాజిట్ డి.డి | కాలపరిమితి |
|---|---|---|---|
| 1 | కిరాణం, జనరల్ & ఫ్యాన్సీ సామాగ్రి అమ్ముకొను హక్కు | 3,00,000/- | 05-06-2026 నుండి 04-06-2027 వరకు |

కావున పైన తెలిపిన టెండర్ - కం - బహిరంగ వేలం నిర్వహించుటకు ఒక గంట ముందు ఆసక్తిగలవారు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనగలరని కోరనైనది. ఇతర వివరములకు మొబైల్ నెంబర్ 9849539594 సంప్రదించగలరు.

ఇట్లు,

చెన్నూరు మట్టపల్లిరావు, అనువంశిక ధర్మకర్త, మొబైల్ నెం.9490626253

బి.జ్యోతి, కార్యనిర్వహణాధికారి, మొబైల్ నెం.7981570939

DIPR R.O. No. : 3052-PP/CL/ADVT/2026-27, Date: 26-05-2026

**GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, సికింద్రాబాద్ జోన్, జిహెచ్ఎంసి.

క్ర.సం.1, NIT No. 08/SE(M)/SBZ/GHMC/2026-27, తేది: 26.05.2026, పని పరిధి: 'జిహెచ్ఎంసి, సికింద్రాబాద్ జోన్ పరిధిలోని న్యూ బోయిగూడ మరియు అంబర్‌పేట కబేళాల వద్ద ETP కోసం ''రక్త ఘనీభవన యూనిట్, బ్లోయర్ మరియు ఎనర్జీ మీటర్'' కొనుగోలుకు సంబంధించిన RFQ' (4వ పిలుపు)., బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: వెబ్‌సైట్ నుండి RFQని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు (తేదీ & సమయం): 27.05.2026 మ.1.00గం.లకు, జిహెచ్ఎంసి, సికింద్రాబాద్ జోన్, సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం వద్ద బిడ్‌కు ముందుగా సమావేశం : 30.05.2026 మ.3.00గం.లకు, బిడ్ దాఖలుకు ఆఖరి తేది: 03.06.2026 మ.1.00గం.ల వరకు. అధికారి పేరు & చిరునామా: సూపరింటెండింగ్ ఇంజనీర్, సికింద్రాబాద్ జోన్, జిహెచ్ఎంసి. సెల్ నెం. 9963550657. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్ www.tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, సికింద్రాబాద్ జోన్, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 3091-PP/CL/ADVT/2026-27, Date: 26-05-2026



## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

తపస్ మండల శాఖ ఆధ్వర్యంలో ఎస్ఎస్‌సి టాపర్స్‌కు సన్మానం

**ప్రజాపక్షం/ఉట్కూర్ :** స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్ ) ఆధ్వర్యంలో 2026 పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన మండలంలోని పాఠశాల టాపర్స్, వారి తల్లి దండ్రులు, ప్రధానోపాధ్యాయులను మంగళవారం ఉట్కూర్ కేంద్రం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి మాధవి, గ్రామ సర్పంచ్ రేణుక భరత్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత మార్కులు సాధించి మండలానికి మంచి పేరు తీసుకురావడం అభినందనీయమన్నారు. తపస్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కోకన్వీనర్ గుంపు బాలరాజ్, జిల్లా అధ్యక్షుడు నరసింహా, మండల అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో క్రమశిక్షణగా చదివి భవిష్యత్తులో మరింత రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తపస్ నాయకులు, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నర్వ తహసీల్దార్ కార్యాలయంలో నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు

మూడు రోజుల నుండి కార్యాలయం చుట్టూ రైతుల ప్రదక్షిణలు

లాగిన్ కోసం వేచి చూస్తున్న ప్రజలు

**ప్రజాపక్షం/నర్వ:** మండల తహసీల్దార్ కార్యాలయంలో గత మూడు రోజుల నుంచి రిజిస్ట్రేషన్‌లు కొనసాగడంలేదు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ మల్లారెడ్డి సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానంలో ధన్వాడ డిప్యూటీ తహసీల్దార్ కాలప్పకు బాధ్యతలు అప్పగించారు. భూమి రిజిస్ట్రేషన్‌ల కోసం రైతులు స్లాట్ బుక్ చేసుకుని కార్యాలయంకు వస్తే ఇక్కడ ఇన్‌చార్జి డిప్యూటీ తహసీల్దార్‌కు లాగిన్ రాకపోవడంతో ప్రజలు కార్యాలయం ముందు కూర్చుని వేచి చూస్తున్నారు. గత మూడు రోజుల నుంచి రైతులు కార్యాలయం చుట్టూ తిరుగుతూ సాయంత్రం వేళలోకి రాలేదని నిరాశగా వెనుతిరుగుతున్నారు. మరోపక్క విద్యార్థులు వివిధ ధృవపత్రాల కోసం తీవ్ర అవస్థలు పడుతున్నారు. డిజిటల్‌కి లేనందున విద్యార్థుల ధృవ పత్రాలు నిలిచిపోయాయి. విద్యార్థులు వివిధ ఉన్నత చదువులకు దరఖాస్తులు చేసుకోవాలన్నా కులం, ఆదాయం స్థానిక ధృవపత్రాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అందుకు జిల్లా కలెక్టర్ స్పందించి తక్షణమే ఇన్‌చార్జి డిప్యూటీ తహసీల్దార్‌కు లాగిన్ ఇవ్వాలని మండల ప్రజలు కోరుతున్నారు.



## పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలి

ఆటోకు తాళ్లు కట్టి లాగుతూ సిపిఐ(ఎం) నేతల వినూత్న నిరసన

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ(ఎం) వీపనగండ్ల మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఆటోకు తాళ్లు కట్టి లాగుతూ పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎం) మండల కార్యదర్శి డి. బాల్ రెడ్డి మాట్లాడుతూ... ఎన్నికల ముందు ధరల పెరుగుదలను నియంత్రిస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం, ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతూ ప్రజల పై ఆర్థిక భారం మోపడం దురదృష్టకరమన్నారు. అంతర్జాతీయ మార్కెట్ లో ముడి చమురు ధరలు తగ్గినప్పటికీ దేశంలో ఇంధన ధరలు తగ్గించకపోవడం ప్రజలకు అన్యాయమని విమర్శించారు. ఎన్నికల అనంతరం మే 15 నుంచి ఇప్పటి వరకు నాలుగు సార్లు పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడంతో నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరిగాయని తెలిపారు. దీంతో పేద, మధ్య తరగతి ప్రజల జీవనం మరింత భారంగా మారిందన్నారు. కార్పొరేట్ సంస్థల లాభాల కోసం కాకుండా ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వాలు పనిచేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు సి.హెచ్ . వెంకటయ్య, నక్క ఈశ్వర్, ఎం. ఆది, వెంకటేశ్వర గౌడ్, వెంకన్న, రామకృష్ణ, నవీన్, రఘు పాల్గొన్నారు.

## మీ సేవ దరఖాస్తులపై అమలుకాని ప్రభుత్వ ఆదేశాలు

స్కాన్ చేసిన పత్రాలు ఉన్నా ...

హార్డ్ కాపీలు తప్పనిసరి చేస్తున్న సిబ్బంది

**ప్రజాపక్షం/పెబ్బేరు :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు సులభంగా పౌరసేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన మీసేవ వ్యవస్థ ద్వారా వేలాది మంది పౌరులు వివిధ ధృవపత్రాలు, రెవెన్యూ సేవలు, ఆదాయం, కులం, నివాసం వంటి సేవల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు పారాలు అవసరమైన ధృవపత్రాలను పూర్తిగా స్కానింగ్ చేసి ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేసిన తర్వాత ప్రభుత్వానికి నిర్ణయించిన ఫీజులు కూడా చెల్లిస్తున్నారు. అయితే కమిషనర్ ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ వనపర్తి కార్యాలయాల నుండి గతంలో స్పష్టమైన ఆదేశాలు జారీ అయినప్పటికీ, అనేక ప్రభుత్వ కార్యాలయాల్లో ఇప్పటికీ పౌరులను ఫిజికల్ హార్డ్ కాపీలు తప్పనిసరిగా తీసుకురావాలి అని ఒత్తిడి చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం మీసేవ ద్వారా సమర్పించిన దరఖాస్తులు, స్కాన్ చేసిన పత్రాలు చెల్లుబాటు అయ్యే అధికారిక రికార్డులుగా పరిగణించాలి. మీసేవ నిర్వాహకులు స్కాన్ చేసిన తర్వాత ఫిజికల్ పత్రాలను సంబంధిత కార్యాలయాలకు సమర్పించాల్సిన అవసరం లేదని స్పష్టమైన సూచనలు ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేకంగా రెవెన్యూ కార్యాలయాల్లో దరఖాస్తుదారులను పలు మార్లు తిరగబెట్టి హార్డ్ కాపీలు ఇవ్వకపోతే సర్టిఫికెట్ మంజూరు చేయలేమని చెప్పడం వల్ల ప్రజలకు అదనపు ఖర్చు, సమయం నష్టం కలుగుతోందని ఆరోపిస్తున్నారు. డిజిటల్ సేవల లక్ష్యానికి విరుద్ధంగా ఈ విధానం కొనసాగుతుందని పలువురు అభిప్రాయపడ్డారు. మీ సేవ ద్వారా పూర్తిస్థాయిలో డిజిటల్ సేవలు అందించాలని ప్రభుత్వ ఉద్దేశ్యం ఉన్నప్పటికీ, దిగువ స్థాయి కార్యాలయాల్లో పాత విధానాలనే కొనసాగించడం వల్ల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదని సామాజిక వర్గాలు పేర్కొంటున్నాయి. దీనిపై ప్రభుత్వం మరోసారి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి, అధికారులకు బాధ్యతలు నిర్ధారించాలని ప్రజలు కోరుతున్నారు. డిజిటల్ తెలంగాణ లక్ష్యాన్ని సాకారం చేయాలంటే మీసేవ దరఖాస్తులను పూర్తిగా ఆన్‌లైన్ ఆధారంగానే పరిశీలించి సేవలు అందించే విధానాన్ని కచ్చితంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

సాగునీటి రంగానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం చేపడుతున్న...

# ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలి

భూసేకరణ పనులను రానున్న వారం రోజుల్లో పూర్తిచేయాలి

రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణ రావు



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాల్లో సాగునీటి రంగానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయాలని, భూ సేకరణ పనులను రానున్న వారం రోజుల్లో పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. మంగళవారం నాగర్ కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని పాలమూరు రంగారెడ్డి వటేం 8వ ప్యాకేజ్ హౌస్, గెస్ట్ హౌస్‌లో నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాలో కొనసాగుతున్న పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల, మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల కెఎల్ఐ, డిండి, ఉమామహేశ్వరం బాలెన్సింగ్ రిజర్వాయర్, అచ్చంపేట లిఫ్ట్ ఇరిగేషన్, మార్కండేయ రిజర్వాయర్, కర్ణేతాండ్రా బాలెన్సింగ్ రిజర్వాయర్‌లతో పాటు వివిధ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాల, భూ సేకరన పనుల పురోగతిపై మంత్రి జూపల్లి కృష్ణారావు సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాలో ప్రాజెక్టుల వారీగా జరుగుతున్న పనులు, భూ సేకరణ పురోగతిని అధికారులు మంత్రికి వివరించారు. ముఖ్యంగా కాలువల నిర్మాణం, రిజర్వాయర్ల అనుబంధ పనులు, పంప్ హౌస్ ల ఏర్పాట్లు, విద్యుత్ కనెక్షన్ల కల్పన వంటి అంశాల పై చర్చించారు. ఇంకా భూ సేకరణలో పెండింగ్‌లో ఉన్న కేసులు, రైతులకు చెల్లించాల్సిన పరిహారం వంటి అంశాలను కూడా మంత్రి సమీక్షించారు. ప్రాజెక్టుల పనులు ఆలస్యం కాకుండా రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. నాగర్ కర్నూల్, వనపర్తి జిల్లాలు ప్రధానంగా వర్షాధార వ్యవసాయం పై ఆధారపడిన ప్రాంతాలు కావడంతో సాగునీటి ప్రాజెక్టులు పూర్తయితే వేల ఎకరాలకు నీరు అందే అవకాశం ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. దీని ద్వారా రైతుల ఆదాయం పెరగడంతో పాలు వ్యవసాయ ఉత్పత్తి కూడా గణనీయంగా పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, ప్రభుత్వం చేపడుతున్న ప్రతి సాగునీటి ప్రాజెక్టు రైతుల భవిష్యత్తుకు బలమైన ఆధారమని మంత్రి తెలిపారు. సాగునీటి ప్రాజెక్టుల సమీక్ష సమావేశంలో నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీ కృష్ణ, కల్వకుర్తి ఎమ్మెల్యే కసి రెడ్డి నారాయణరెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే తూడి మెగారెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ అమరేందర్, ఇరిగేషన్ శాఖల అధికారులు రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఎసిబి వలలో మానవపాడు భూ సర్వేయర్ బ్రహ్మయ్య



**ప్రజాపక్షం/అలంపూర్ :** జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం మానవపాడు మండల భూసర్వే బ్రహ్మయ్య ఎసిబి వలలో చిక్కడంతో ఒక్కసారిగా ఈ రెండు మండలాలలో ప్రభుత్వ ఉద్యోగ అధికారులకు వణుకు పుట్టడం జరిగింది. భూముల సర్వే కోసం 10,000 లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కిన వడ్డేపల్లి మండల మానవపాడు మండల సర్వేయర్ బ్రహ్మయ్య భూముల సర్వే చేయడానికి ఒక ఫిర్యాదు దారుడి నుండి అధికారికంగా లబ్ధి చేకూర్చేందుకు లంచం తీసుకుంటూ జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండల సర్వేయర్ బ్రహ్మయ్య అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయారు. ఘటన వివరాలు బాధితుడు తన భూమిని సర్వే చేయాల్సిందిగా మండల సర్వేయర్ బ్రహ్మయ్యను ఆశ్రయించారు. అయితే, ఈ అధికారిక పనిని పూర్తి చేయడానికి సర్వేయర్ 10,000 లంచం డిమాండు చేశారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని బాధితుడు ఈ విషయంపై ఎసిబి అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.

బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఎసిబి అధికారులు పక్కా వ్యూహంతో వలపన్నారు. వడ్డేపల్లిలో ఫిర్యాదుదారుడి నుండి సర్వేయర్ బ్రహ్మయ్య రూ.10,000 లంచం డబ్బులు తీసుకుంటుండగా ఎసిబి అధికారులు దాడి చేసి ఆయననను లంచం సొమ్ముతో సహా పట్టుకున్నారు. నిందితుడి నుంచి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్న ఎసిబి అధికారులు ఆయనపై కేసు నమోదు చేసి తదుపరి విచారణ నిమిత్తం ఎసిబి కోర్టుకు తరలించనున్నారు. అవినీతికి పాల్పడితే ఎంతటి వారినైనా వదిలేది లేదని ఈ సందర్భంగా ఎసిబి అధికారులు హెచ్చరించారు. ఈ అవినీతికి పాల్పడిన భూ సర్వేయర్ బ్రహ్మయ్యను ఎసిబి అధికారులు పట్టుకోగా ఈ రెండు మండలాల రైతులు సంతోషాన్ని వ్యక్తపరిచారు.

## ఆరు మందిపై బైండోవర్

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** మండలంలోని కల్వకోల్, దేవుని తిరుమలాపురం గ్రామాలలో సారాయి అమ్మే ఏడు మందిని కొల్లాపూర్ ఎక్సైజ్ ఎస్సై హనుమంత్ మంగళవారం పెద్దకొత్తపల్లి తహసీల్దార్ ముందు హాజరుపరిచారు. తహసీల్దార్ శ్రీనివాసులు వారిపై ఒక సంవత్సరంపాటు బైండోవర్ కేసు నమోదు చేసి, మరల సారాయి అమ్మితే లక్ష రూపాయలు ఫైన్ విధించడం జరుగుతుందన్నారు.



ఎమ్మెల్యే సహకారంతో...

# జిల్లెల గ్రామ విద్యుత్ సమస్యలకు మోక్షం

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** కల్వకుర్తి మండలం జిల్లెల గ్రామంలో ఎన్నో సంవత్సరాలుగా విద్యుత్ సమస్యతో గ్రామస్తులు చాలా ఇబ్బంది పడ్డారు. గ్రామంలో చిన్నపాటి గాలి, వర్షం వచ్చినా విద్యుత్ సరఫరా ఉండేది కాదని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో విద్యుత్ సమస్యలకు మోక్షం కలిగిందని గ్రామస్తులు కొనియాడారు. జిల్లెల గ్రామానికి పక్కన ఉన్న గ్రామాలకు కలిపి ఒకలైన్ తోనే విద్యుత్ సరఫరా అయ్యేది. అన్ని గ్రామాలకు కలిపి ఒకటే లైన్ ఉండడంతో గ్రామంలో ఓల్టేజ్ సమస్య కూడా ఉండేది ఈ విద్యుత్ సమస్యలను మాజీ సర్పంచ్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి, విజిలెన్స్ కమిటీ మెంబర్ జిల్లెల రాములు ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించి గ్రామానికి విద్యుత్ సమస్యలు లేకుండా 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా



చేయించారు. మాజీ సర్పంచ్, ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ, విజిలెన్స్ కమిటీ మెంబర్ జిల్లెల రాములు సహకారంతో గ్రామంలో 24గంటల కరెంట్ సరఫరాకు మోక్షం లభించిందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన 24 గంటల నిరంతరాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్స్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ, విజిలెన్స్ కమిటీ మెంబర్ జిల్లెల్ల రాములు పాల్గొని గ్రామ సర్పంచ్ కొమ్ముగోని రాజేశ్వరి రవి గౌడ్ లతో ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎముక రవి, పంచాయతీ కార్యదర్శి తిరుపతి గౌడ్, వార్డు సభ్యులు తాడెం మౌనిక మల్లయ్య, గుమ్మకొండ, నాగమణి, మహేందర్, దొక్కు చెన్నమ్మ, జంగయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ముచ్చర్ల శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ వీరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, హనుమాన్ దేవాలయ వైస్ చైర్మన్ వీరెడ్డి శ్యామ్ సుందర్ రెడ్డి, మాజీ కోఆప్షన్ నెంబర్ గుమ్మకొండ బాల్ జంగయ్య, కుర్వసంగం అధ్యక్షులు చిక్కొండ బీరయ్య, నాయకుల వీరెడ్డి కృష్ణారెడ్డి, మొక్తాల బాల్ జంగయ్య, చిక్కొండ మల్లయ్య, కొమ్మగోని సత్యనారాయణ గౌడ్, కొమ్మగోని జంగయ్య గౌడ్, చిక్కొండ వెంకటయ్యలతో పాటు పలువురు నాయకులు మహిళలు పాల్గొన్నారు.

# రాబందుల రాజ్యం మనకొద్దు

శాసనసభ్యుడు తూడి మేఘారెడ్డి

ఇంధన పెంపుదలను నిరసిస్తూ జిల్లా కేంద్రంలో చేపట్టిన ఎద్దులబండ్ల నిరసన ర్యాలీ

**ప్రజాపక్షం/వనపర్తి న్యూ టౌన్ :** డబుల్ ఇంజన్ సర్కార్ అంటూ కేంద్ర బిజెపి సర్కార్ మొదటి బోగిలో, మోదీ రెండో బోగిలో ఆదాని అంబానీ లాంటి వారు ప్రయాణిస్తూ దేశాన్ని రాబందుల్లా పీక్కుతింటున్నారని, ఈ డబుల్ ఇంజన్ సర్కారుకు చరమగీతం పాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని వనపర్తి శాసనసభ్యుడు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు మంగళవారం ఎమ్మెల్యే మేఘారెడ్డి, శివసేన రెడ్డిలు వనపర్తిలో ఎద్దుల బండ్లతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం



ఇంధనంపై పెంచిన రేట్లు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. గంటలు మోగిస్తే చప్పట్లు కొట్టినంత మాత్రాన నిరుపేదల సమస్యలు తీరవని, ప్రజలకు అధిక భారం లేకుండా చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం అధిక ధరలను పెంచి ప్రజల నడ్డి విరుస్తోందని విమర్శించారు. భారతీయ జనతా పార్టీ నాయకులు వనపర్తిలో ధర్నాలు చేయడం సరి కాదని, బాధ్యతాయుతంగా వ్యవహరించి మోదీ ఇంటి ముందల ధర్నాలు చేసి రాష్ట్రానికి ఏదైనా మేలు చేస్తే బాగుంటుందని ఆయన అన్నారు. మోదీ సర్కార్ ఇప్పటికే మూడు పర్యాయాలు ఏడున్నర రూపాయలను పెట్రోల్ డీజిల్‌పై పెంచిందని పేర్కొన్నారు. మోదీ సర్కార్ ఇంధనం ధరలను వెంటనే తగ్గించకపోతే జిల్లా, మండల, గ్రామస్థాయిలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టి, మెడలు వంచాల్సి వస్తుందన్నారు. రానున్న రోజుల్లో కేంద్రంలోనూ రాహుల్ గాంధీ మరో ఇంజన్‌గా మారతారని ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వాకిటి ఆదిత్య, మున్సిపల్ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, మున్సిపల్ మాజీ చైర్మన్లు, వనపర్తి నియోజకవర్గం పరిధిలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తిస్తే

# ప్రాణాపాయం తప్పుతుంది

ప్రముఖ క్యాన్సర్ నిపుణుడు డాక్టర్ జి.దయాకర్ రావు

యశోద ఆసుపత్రిలో వనపర్తి మహిళకు అరుదైన శస్త్రచికిత్స 'సక్సెస్'




**ప్రజాపక్షం/వనపర్తి టౌన్ :** అపెండిక్యులర్ మాస్, కోలన్ (పెద్దప్రేగు) క్యాన్సర్ వంటి క్లిష్టమైన ఉదర సంబంధిత వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి, సరైన శస్త్రచికిత్స అందించడం ద్వారా ముప్పును నివారించవచ్చని మలక్‌పేట యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి కన్సల్టెంట్ సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ జి.దయాకర్ రావు అన్నారు. అత్యాధునిక లాపరోస్కోపిక్, అంకాలజీ సర్జరీల ద్వారా క్యాన్సర్ రోగుల్లో అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చనని ఆయన వివరించారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని ఎం.వై.ఎస్. బ్యాంకెట్ హాల్ లో క్యాన్సర్ వ్యాధిపై నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అపెండిక్యులర్ మాస్‌తో కూడిన కోలన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న వనపర్తి జిల్లాకు చెందిన 51 ఏళ్ల సూగురు యాదమ్మకు తమ ఆసుపత్రిలో అరుదైన శాస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసినట్లు ఆయన వెల్లడించారు. అనంతరం డాక్టర్ దయాకర్ రావు పర్యవేక్షణలో అత్యంత క్లిష్టమైన 'రైట్ హెమి కోలెక్టమీ', 'ఐలీయో ట్రాన్స్ వర్స్ అనాస్టమోసిస్' శాస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ మీడియా సమావేశంలో ఆసుపత్రి డిజిఎం లక్ష్మణా శ్రీకాంత్, ఏ. వాసు కిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో..

## చైల్డ్ మ్యారేజ్ అవేర్నెస్ ప్రోగ్రాం

**ప్రజాపక్షం/అలంపూర్ :** జోగులాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలం కలగొట్ల గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం నందు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ వారి జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో చైల్డ్ మ్యారేజ్ ఆక్ట్ గురించి మీటింగ్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా బాలల సంరక్షణ లీగల్ అధికారి ఎత్తం శివ ఐసిడిఎస్ సూపర్వైజర్ అస్మా హాజరై మాట్లాడుతూ చిన్న వయసు నుండి లక్ష్యం పెట్టుకొని చదవాలని సూచించారు. ఆడపిల్లలపై సోదరాభావంతో ఉండాలని తెలిపారు. బాలల లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2012 గురించి తెలియజేస్తూ లైంగిక వేధింపులు నుంచి రక్షణ కల్పించేందుకు.ఈ చట్టం రూపొందించారని ఈ చట్టంలో బాలబాలికలకు సమానమైన రక్షణ లభిస్తుంది. ఇటీవల కాలంలో ప్రతి చోట ఎదురువుతున్న సమస్య లైంగిక వేధింపులు కుటుంబ సభ్యులు ఇతర వ్యక్తుల చేతుల్లో బాలలు లైంగిక వేధింపులకు గురువుతున్నారు. బాలలు ఎవరి నుంచైనా ఇంటి వేధింపులు గురువుతన్నట్లు తెలిస్తే వెంటనే 100 లేదా 1098కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలి వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా చిన్న వయసులోనే పెళ్లిలు చేయడం చట్ట రీత్యా నేరం అని చెప్పారు. అయితే ఇలా బాల్య వివాహం చేస్తున్నట్లు తెలిస్తే గ్రామంలో ఉండే బాలల పరిరక్షణ కమిటీకి లేదా 1098 కి ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు. సామాజిక మద్యమం వల్ల పిల్లలు చెడు అలవాట్లకు ఎక్కువగా పాలుపడే అవకాశం ఉన్నది కాబట్టి బాలల అందరూ కూడా కేవలం మంచి విషయాల కోసం మాత్రమే ఫోన్స్ ఉపయింగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విలేజ్ పంచాయతీ కార్యదర్శి ధనురెడ్డి అంగన్వాడి టీచర్స్ లక్ష్మీ దేవి గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి శ్రీహరిని అగౌరవపరచడం తగదు

**ప్రజాపక్షం/ఉట్కూర్ :** రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరిని తోటి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సాక్షిగా అగౌరవపరచడం తగదని సామాజిక కార్యకర్త హెచ్.నరసింహా మంగళవారం బిజ్వార్ గ్రామం ఒక ప్రకటనలో తెలిపారు. వాకిటి శ్రీహరి మంత్రిగా ఉన్నప్పటికీ ఎక్కడా గొప్పలు చెప్పుకోకుండా, పార్టీలకు అతీతంగా అందరినీ కలుపుకొని ముందుకు వెళ్లే వ్యక్తిత్వం కలిగిన నాయకుడని పేర్కొన్నారు. రాష్ట్రంలో రాత్రి, పగలు తేడా లేకుండా ప్రజలకు ఏ సమస్య వచ్చినా దానిని తన సమస్యగా భావించి, పరిష్కారం అయ్యే వరకు పట్టుదలతో పనిచేసే నాయకుడిపై ఈ విధంగా వ్యవహరించడం పట్ల ప్రజలు తీవ్రంగా ఖండిస్తున్నారని అన్నారు. శ్రీహరికి జరిగిన అవమానంపై రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పెద్దలు వెంటనే స్పందించి, తగిన పరిష్కారం చూపిస్తూ తెలంగాణ సమాజానికి వివరణ ఇవ్వాలని కోరారు. లేకపోతే భవిష్యత్తులో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడవచ్చని హెచ్చరించారు.

## ఘనంగా 'నేషనల్ పైలెట్ డే' వేడుకలు

**ప్రజాపక్షం/వనపర్తి :** వనపర్తి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి 108 కార్యాలయంలో నేషనల్ పైలెట్ డే వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 108 సిబ్బంది కలిసి కేక్ కట్ చేసి, ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ ఆనందోత్సాహాల మధ్య వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా మేనేజర్ రత్నమయ్య మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలను కాపాడేందుకు 108 పైలెట్లు అంకితభావంతో సేవలు అందిస్తున్నారని అన్నారు. అప్రమత్తత, సమయపాలనతో పాటు అత్యుత్తమ డ్రైవింగ్ నైపుణ్యాలతో విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు భరోసానిచ్చే సేవలు చేస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా అన్ని పైలెట్లకు నేషనల్ పైలెట్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కేక్ కట్ చేసి పైలెట్ల సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో పైలెట్లు మైనుద్దీన్, శివయ్య, షఫీ, ఇబ్రహీం, భరత్ కుమార్, కమాలుద్దీన్, శేఖర్, మాసం బాబా, ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## రైతు ధర్నాను విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/వంగూరు :** నేడు మండల కేంద్రంలో చేపట్టనున్న మహా రైతు ధర్నాను విజయవంతం చేయాలని బిఆర్ఎస్ మాజీ మండల పార్టీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ వేనేపల్లి గణేష్‌రావు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ మహా ధర్నాకు బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ శాసనసభ్యులు, జయపాల్ యాదవ్, మర్రి జనార్దన్ రెడ్డిలు హాజరవుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ మహా ధర్నాకు మండలంలోని బిఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు మాజీ సర్పంచులు ఎంపిటిసిలు, కార్యకర్తలు, నాయకులు భారీగా తరలివచ్చి ఈ ధర్నాను విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు.

## ఆరోగ్యకర కుటుంబాల స్థాపనకు కృషి చేద్దాం

ఐసిడిఎస్ సిడిపిఒ షేక్ సన్ హేర



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** పౌష్టికాహారాన్ని అలవాటు చేసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన కుటుంబాలను నిర్మించుకోవచ్చని ఐసిడిఎస్ సిడిపిఒ షేక్ సన్ హేర అన్నారు. మంగళవారం వీపనగండ్ల మండల కేంద్రంలోని మండల మహిళా సమైక్య కార్యాలయంలో ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించిన మహిళా వారోత్సవాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రతి రోజూ తీసుకునే ఆహారంలో రోగనిరోధక శక్తిని పెంచే ఆకుకూరలు, పండ్లు, పప్పు ధాన్యాలు, చిరుధాన్యాలు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. అధికంగా చక్కెర, నూనె, ఉప్పు కలగిన ఆహార పదార్థాలు, జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని కోరారు. బాల్య వివాహాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ఆమె పిలుపునిచ్చారు. చిన్నారులను చెడు అలవాట్లకు దూరంగా ఉంచినప్పుడే ఆరోగ్యకరమైన కుటుంబ వ్యవస్థ ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) మద్దిలేటి, సూపర్వైజర్ సోనీ, మండల వైద్యాధికారి రాజశేఖర్, అంగన్వాడీ టీచర్లు, వైద్య సిబ్బంది, మండల మహిళా సమైక్య ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



## రైతులకు ఇబ్బందుల్లేకుండా ధాన్యం సేకరణ

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**ప్రజాపక్షం/చివ్వెంల/తిరుమలగిరి** : జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, రైతులకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. మంగళవారం చివ్వెంల మండలం బీబీగూడెంలోని శివదుర్గ రైస్‌మిల్, తిరుమలగిరి మండలంలోని ఈటూరి గ్రామంలో సోమేశ్వర రైస్‌మిల్ ఇండస్ట్రీ, వ్యవసాయ మార్కెట్, పారారైస్‌మిల్, తాటిపాముల పిఏసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే అన్‌లోడింగ్ చేయాలని, మిల్లర్లు ధాన్యం దిగుమతిలో జాప్యం చేయకూడదని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు రైస్ మిల్లులకు తరలించేలా రవాణా సౌకర్యాలను పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. తరుగు పేరుతో రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌ఓ మోహన్‌బాబు, డిఎం సివిల్ సప్లై శ్రీధర్ రెడ్డి, చివ్వెంల తహశీల్దార్ చంద్రశేఖర్, తిరుమలగిరి తహశీల్దార్ హరిప్రసాద్, రైస్ మిల్లర్ల యజమానులు పాల్గొన్నారు.

## కెజిబివిలో ఖాళీ సీట్లు... అర్హులైన బాలికలు దరఖాస్తులు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో ఖాళీగా ఉన్న సీట్లకు అర్హులైన విద్యార్థినులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ప్రత్యేక అధికారి ఎం.జ్యోతి కోరారు.ప్రస్తుతం 6వ తరగతిలో 40,7వ తరగతిలో 20,8వ తరగతిలో 5సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.అదేవిధంగా ఇంటర్ ఎంపీసీ గ్రూపులో 40,బైపీసీ గ్రూపులో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయని వివరించారు.మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దాతృత్వంతో పాఠశాలలో డిజిటల్ బోధన,ఆటస్థలం, బాత్రూంలను ఏర్పాటు చేసినట్లు ఆమె వెల్లడించారు. 10 సంవత్సరాలకు పైగా అనుభవం కలిగిన అధ్యాపకులతో బోధన అందించడంతో పాటు మంచి భోజనం,ఉచిత హాస్టల్ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు.నియోజకవర్గంలో డిజిటల్ బోధన సౌకర్యం కలిగిన ఏకైక విద్యాలయం కేజీబీవీ అని పేర్కొన్నారు.విద్యార్థినులను కంటికి రెప్పలా చూసుకుంటామని,ప్రత్యేక అధికారి పర్యవేక్షణ నిరంతరం ఉంటుందని తెలిపారు.ఆసక్తి గల విద్యార్థినులు,తల్లిదండ్రులు త్వరగా సంప్రదించి ప్రవేశాలు పొందాలని ఆమె సూచించారు.

## ఎలాంటి తప్పులు లేకుండా జనగణన

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : ఎన్యూమరేటర్లు ఎలాంటి తప్పులు లేకుండా జనగణన సకాలంలో పూర్తి చేయాలని మున్సిపల్ కమీషనర్ సిహెచ్ హన్మంత రెడ్డి సూచించారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో జనగణన 2027 కొరకు నియామకం చేయబడిన ఫీల్డ్ ట్రైనర్స్, సూపర్‌వైజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్‌వైజర్లు కూడా ఎన్యుమరేటర్ల నుంచి వచ్చిన డేటాను సంపూర్ణంగా పరిశీలించి ఎలాంటి తప్పులు లేకుండా సూర్యాపేట మున్సిపాలిటిలో జనగణన పూర్తి చేయాలన్నారు. పట్టణ ప్రజలు సెల్ఫ్ యాన్యుమరేషన్‌లో భాగంగా ఇచ్చిన రిఫరెన్స్ ఐడిలను కూడా సంపూర్ణంగా డేటాను పరిశీలించిన పిదప మాత్రమే సబ్మిట్ చేయాలని కోరారు. పట్టణ ప్రజలు తమ ఇంటికి వచ్చిన ఎన్యుమరేటర్లకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటి అడిషనల్ చార్జి ఆఫీసర్ బుచ్చిబాబు, ఫీల్డ్ ట్రైనర్లు గోపారపు రాజు, కస్తూరి కిషన్ ప్రసాద్, పిల్లలమర్రి ఉపేందర్, అక్కెనపల్లి శ్రీనివాసరావు, టెక్నికల్ అసిస్టెంట్ సంతోష్ పాల్గొన్నారు.

## ధాన్యం డబ్బు కోసం తప్పని తిప్పలు

### నెల రోజులు అవుతున్నా రైతులు అకౌంట్లలో పడని పైకం

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్** : ఆరుగాలం శ్రమించి పండించిన పంటను అమ్ముకున్న రైతన్నకు తిప్పలు తప్పడంలేదు. ప్రభుత్వం ధాన్యం కాంటా వేసిన 48 గంటల్లో రైతు ఖాతాల్లో డబ్బు జమ చేస్తామని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల నుంచి దాన్యాన్ని సేకరిస్తుంది. కానీ నెల రోజులు అవుతున్నా వడ్ల డబ్బులు అకౌంట్లలో పడక రైతులు ఇబ్బంది పడుతున్న పరిస్థితి నెలకొని ఉంది. మండలంలోని అనంతారం గ్రామంలో ఏర్పాటు చేసిన నారాయణ గూడెం సహకార సంఘం ధాన్యం కొనుగోలు కేంద్రంలో 200 మంది రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసి మండలంలోని మాచారంలోని హని రైస్ మిల్లుకు అలాట్ కావడంతో ధాన్యం ఎగుమతి చేశారు. ధాన్యం కాంటాలు వేసి నెల రోజులు కావస్తున్నా మిల్లు నుండి ట్రక్ షీట్ రాకపోవడంతో రైతులు ఖాతాల్లో డబ్బులు పడలేదు. దీంతో రైతులు ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకున్నా వెంటనే డబ్బులిచ్చేవారు కేంద్రాల్లో అమ్మి ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు. వారం రోజుల్లో రుతుపవనాలు ప్రవేశించనుండడంతో ఎరువులు, విత్తనాలకు డబ్బులు లేక రైతులు గోసపడుతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి ఖాతాల్లో డబ్బులు వేయించాలని రైతులు వేడుకుంటున్నారు.

## బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి

### నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్**: బాల్య వివాహాలను అరికట్టడంతో పాటు బాలికల అభివృద్ధికి సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు.ప్రజా పాలప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మంగళవారం రెడ్‌క్రాస్ భవనంలో మహిళా,శిశు,దివ్యాంగులు,వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహ రహిత తెలంగాణ లక్ష్యంతో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల ఎంతోమంది బాలికల జీవితాలు దెబ్బతింటున్నాయని, కుటుంబాల్లో ఆవేదన మిగులుతోందని అన్నారు.తమ ప్రాంతాల్లో జరిగే బాల్య వివాహాలపై పోలీసులు లేదా అధికారులకు సమాచారం అందించాలని విద్యార్థులకు సూచించారు. బాలికలు సంఘాలుగా ఏర్పడి సమస్యలు పంచుకోవాలని,బాల్య వివాహాల నియంత్రణలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమని తెలిపారు.విద్యార్థులు సోషల్ మీడియాను పరిమితంగా వాడాలని,ఏఐ ఫొటో మార్ఫింగ్ వంటి సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ ప్రణామం వయోవృద్ధుల డే కేర్ సెంటర్‌ను సందర్శించి వృద్ధుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.క్యారమ్స్ ఆడుతున్న వృద్ధులతో ఆప్యాయంగా ముచ్చటించారు. ఎండ తీవ్రత దృష్ట్యా అనవసరంగా బయట తిరగవద్దని సూచించారు.కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ గోలి అమరేందర్ రెడ్డి,జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణి,సీడీపీఓ లావణ్య,సీడబ్ల్యూసీ చైర్మన్ చింత కృష్ణయ్య, సభ్యులు భాస్కర్,వెంకన్న,డీసీపీఓ గణేష్ పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోళ్లపై రైతుల్లో బిజెపి అపోహలు

### భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/భువనగిరి** : ధాన్యం కొనుగోలు అంశంపై రైతుల్లో బిజెపి అపోహలు సృష్టిస్తుందని, గందరగోళ పరిస్థితులు కల్పించే ప్రయత్నం చేస్తోందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి విమర్శించారు. భువనగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయ లబ్ధి కోసమే బీజేపీ భరోసా యాత్ర నిర్వహిస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం వడ్ల కొనుగోలు విషయంలో పూర్తి చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. గత రెండు పంటల సీజన్ల నుంచి కేంద్ర ప్రభుత్వం వడ్లు కొనుగోలు చేయకపోవడం వల్ల మిల్లుల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోయాయని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సిఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) ఆర్డర్లు ఇవ్వకపోవడం వల్లే తెలంగాణలో ఈ పరిస్థితి ఏర్పడిందని అన్నారు. మా ప్రజాప్రతినిధులు, అధికారులు, మిల్లర్లు, రైతులతో సమన్వయం చేస్తూ వడ్ల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. మా ముఖ్యమంత్రి మంత్రులు స్వయంగా సమీక్షా సమావేశాలు నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని పేర్కొన్నారు. పండిన ప్రతి గింజను కొనుగోలు చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. రైతులు అధైర్యపడవద్దని, ప్రతిపక్షాల మాటలు నమ్మి అయోమయానికి గురికావద్దని సూచించారు. పక్క రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలోనే అధిక ధరకు వడ్ల కొనుగోలు జరుగుతోందని తెలిపారు. కొనుగోలు చేసిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ అయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుటోందని చెప్పారు. గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం కంటే తమ ప్రభుత్వం మరింత మెరుగ్గా వడ్ల కొనుగోలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు. గతంలో 'వరి వేస్తే ఉరి' అన్న పరిస్థితులను గుర్తు చేస్తూ, ప్రస్తుతం రైతును రాజుగా చేసే దిశగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి పంట దిగుబడి నమోదైందని, అధిక దిగుబడి వచ్చినప్పటికీ రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. రైతులను ఇబ్బందులకు గురి చేసిన ప్రభుత్వం బీజేపీనేనని ఆరోపిస్తూ, రైతు వ్యతిరేక నల్ల చట్టాలను తీసుకువచ్చి రైతుల ఉద్యమాల తర్వాత వాటిని వెనక్కి తీసుకున్న విషయాన్ని గుర్తు చేశారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికలు పూర్తయిన వెంటనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన ఘనత కూడా బీజేపీ ప్రభుత్వానిదేనని విమర్శించారు. రైతు సంక్షేమం పేరుతో ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ప్రజలు వాస్తవాలను గుర్తించాలని ఎమ్మెల్యే సూచించారు. రైతు భరోసా యాత్ర తెలంగాణలో కాకుండా ఢిల్లీలో నిర్వహించి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని రాష్ట్ర బీజేపీ నాయకులకి అనిల్ కుమార్ రెడ్డి సూచించారు. ఈ సమావేశంలో మునిసిపల్ చైర్ పర్సన్ తంగళ్లపల్లి శ్రీవాణి రవి కుమార్, వైస్ చైర్ పర్సన్ పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, గ్రంథాలయ చైర్మన్ అవేజ్ చిస్తీ, మాజీ మునిసిపల్ చైర్మన్లు పోతంశెట్టి వెంకటేశ్వర్లు, బర్రె జహంగీర్, కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షులు కూర వెంకటేష్, కౌన్సిలర్ తాహెరా బబ్లు, బొంతల నర్సింగ్ రావ్, బెండ స్వరూప లాల్ రాజ్, చల్లగురుగుల కృష్ణవేణి రఘుబాబు, సుజాయత్ అలీ కౌసర్, పచ్చల జగన్, లయిక్ అహ్మద్, పోలిశెట్టి అనిల్, బురాన్, చల్ల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



## రైతు సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యం

**ప్రజాపక్షం/దేవరకొండ** : రైతు సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం తొలి ప్రాధాన్యం ఇస్తుందని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. మంగళవారం ఎంఎల్‌ఏ క్యాంపు కార్యాలయంలో ధాన్యం సేకరణ, కొనుగోలు వేగవంతంపై రైస్ మిల్లర్లు, సంబంధిత అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ అన్నదాతల ప్రయోజనాలే పరమావధిగా, కొనుగోళ్లలో జాప్యం లేదా నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనేక సవాళ్ల మధ్య కూడా యాసంగి ధాన్యం కొనుగోళ్లను సమర్ధవంతంగా నిర్వహిస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి రైతుల తరుపున ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈకార్యక్రమంలో జేసి శ్రీనివాస్, ఆర్డీవో పద్మప్రియా, డిఎస్పి శ్రీనివాస్‌రావు, డిఎంసిఎస్ రాంపత్తి, డిసిఎస్‌వో వెంకటేశం, డిసివో మైకల్ జోష్, ఏడి అగ్రికల్చర్ శ్రీలక్ష్మి , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పది రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి

### రైతుల కోసం హమాలీలకు రూ.10.20 లక్షలు సొంతంగా చెల్లిస్తా : ఎమ్మెల్యే రాజ్ గోపాల్ రెడ్డి



**ప్రజాపక్షం/మునుగోడు** : నియోజకవర్గ వ్యాప్తంగా ఏసంగి పంట దాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి పది రోజుల్లో కల్లాలలో ఉన్న మొత్తం దాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులను ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ఆదేశించారు మంగళవారం మునుగోడులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నల్లగొండ,యాదాద్రి భువనగిరి జిల్లాల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు.దాన్యం కొనుగోళ్లలో లారీల కొరత, హమాలీల సమస్యలు,గోదాముల కొరత,మిల్లుల బ్లాక్‌లిస్టింగ్ కారణంగా ఏర్పడుతున్న ఇబ్బందులపై ఎమ్మెల్యే అధికారులతో విస్తృతంగా చర్చించారు. రైతులు ఇబ్బందులు పడకుండా తాత్కాలిక చర్యలతో పాటు శాశ్వత పరిష్కార మార్గాలను రూపొందించాలని సూచించారు. అనుకున్న దానికంటే అధిక దిగుబడి రావడం, హమాలీలు మరియు లారీల కొరత, గోదాముల నిల్వ సామర్థం తక్కువగా ఉండడం వల్ల కొనుగోళ్లలో జాప్యం జరుగుతోందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. రైతుల ఇబ్బందులు చూసి హమాలీలకు అదనంగా రూ.10.20 లక్షలు రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని హమాలీలకు ప్రభుత్వం చెల్లించే కూలీకి అదనంగా రూ.10,20,000 తన సొంత నిధులతో చెల్లిస్తానని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి అధికారులకు హామీ ఇచ్చారు. హమాలీల కొరత కారణంగా కొనుగోళ్లు ఆలస్యం కాకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు.9లక్షల క్వింటాళ్ల సామర్థంతో గోదాముల నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలిఈ సమావేశంలో నల్లగొండ అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్,డిఆర్‌డిఓ శేఖర్ రెడ్డి,చండూరు ఆర్‌డిఓ శ్రీదేవి, చౌటుప్పల్ ఆర్‌డిఓ శేఖర్ రెడ్డి,యాదాద్రి డీసీఓ,నల్లగొండ ఇన్‌చార్జ్ డీసీఓ,సివిల్ సప్లై అధికారులు,అన్ని మండలాల ఎమ్మార్వోలు, వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## పండించిన ప్రతి గింజా కొనేవరకు వదిలిపెట్టం

### బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

**ప్రజాపక్షం/భువనగిరి** : పండించిన ప్రతి గింజా కొనేవరకు వదిలిపెట్టం అని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం భువనగిరి మండలం వడపర్తి గ్రామంలో భారతీయ జనతా పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు ఊట్కూరి అశోక్ గౌడ్ అధ్యక్షతనా మీడియా సమావేశం నిర్వహించారు. జరిగింది. ఈ కార్యక్రమం ముఖ్య అతిథి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ధాన్యం, మొక్కజొన్న, పొద్దుతిరుగుడు పంటలను చివరి గింజ వరకు కొనేవరకు ప్రభుత్వాన్ని వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు. 'రైతు గోస.. భాజపా భరోసా' పేరుతో చేపట్టిన బస్సు యాత్ర మంగళవారం యాదాద్రి జిల్లా వడపర్తి కి చేరుకున్న సందర్భంగా, రాష్ట్రంలో 80% కొనుగోళ్లు పూర్తయ్యాయని ముఖ్యమంత్రి గొప్పలు చెబుతున్నారు. కానీ వాస్తవానికి క్షేత్రస్థాయిలో 25% కూడా కొనుగోలు జరగలేదు. దళారుల చేతిలో రైతులు దారుణంగా మోసపోతున్నారని, కావాలనే కొనుగోళ్లను మూడు వారాలు ఆలస్యం చేశారన్నారు. వర్షాలకు ధాన్యం తడిసి పాడైపోతే, ఆ నెపం ప్రకృతి మీద నెట్టేసి చేతులు దులుపుకోవాలన్నదే ఈ ప్రభుత్వ కిరాతక ఆలోచన. రైతులకు మేమున్నామని భారతీయ జనతా పార్టీ పూర్తి భరోసా ఇస్తోందని చెప్పారు. కల్లాల్లో ఉన్న ఆఖరి గింజ కొనుగోలు చేసే వరకు రైతుల పక్షాన బిజెపి పోరాడుతూనే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎంపీ గోడాం నగేష్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ఎమ్మెల్యేలు కాటేపల్లి వెంకటరమణారెడ్డి, పైడి రాకేష్ రెడ్డి , సూర్యనారాయణ, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బస్వ లక్ష్మి నర్సయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు బూర నర్సయ్య గౌడ్, కసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు వేముల అశోక్, గౌతమ్ రావు, రాష్ట్ర అధికార ప్రతినిధి తాడూరి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గూడూరు నారాయణ్ రెడ్డి పాల్గొన్నారు.

## నేర నియంత్రణే లక్ష్యం

### నల్లగొండలో భారీ కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్-46 మంది అనుమానితులు అదుపులోకి









**ప్రజాపక్షం/నల్లగొండ**: నేరచరిత్ర కలిగిన వ్యక్తులు,రౌడీషీటర్లపై కఠిన చర్యలు తప్పవని,ప్రజలు అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద వ్యక్తులపై సమాచారం అందించాలని జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ హెచ్చరించారు.నేర నియంత్రణ లక్ష్యంగా మంగళవారం తెల్లవారుజామున నల్లగొండ పట్టణంలో జిల్లా పోలీసు శాఖ భారీ కార్డెన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టింది. డిఎస్‌పి కె.శివరాం రెడ్డి నేతృత్వంలో 7 మంది సీఐలు,18 మంది ఎస్‌ఐలు,నార్కోటిక్ డాగ్ సహా 200 మంది సిబ్బంది 10 బృందాలుగా ఏర్పడి పట్టణాన్ని జల్లెడ పట్టారు.సతీష్ నగర్ సహా పలు కాలనీలు, లాడ్జిలు, అద్దె గదులు, రైల్వే స్టేషన్, బస్టాండ్, ప్రధాన కూడళ్లలో సోదాలు నిర్వహించారు. మొత్తం 360 ఇళ్లలో తనిఖీలు చేసి 46 మంది అనుమానితులను గుర్తించారు. అదేవిధంగా ఇతర రాష్ట్రాలకు చెందిన 18 మంది వ్యక్తులను గుర్తించారని తెలిపారు. వీరిలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన 10 మంది, బీహార్‌కు చెందిన 4 మంది, తమిళనాడు కు చెందిన 1 వ్యక్తి, అస్సాం కు చెందిన 1 వ్యక్తి, హర్యానాకు చెందిన ఇద్దరు ఉన్నారని వివరించారు.తనిఖీలలో భాగంగా ఇద్దరు రౌడీషీటర్లు,5 మంది ట్రబుల్ మాంగర్స్‌ను గుర్తించి వారిపై ప్రత్యేక నిఘా పెట్టారని అలాగే ఆరుగురికి గంజా టెస్ట్ లు నిర్వహించగా వీరిలో ఇద్దరిని గంజా సేవించినట్లు గుర్తించడం జరిగిందన్నారు. అలాగే అక్రమంగా నిల్వ ఉంచిన 16 గుట్కా బ్యాగులను స్వాధీనం చేసుకోవడంతోపాటు సరైన పత్రాలు, రిజిస్ట్రేషన్ సక్రమంగా లేని 54 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలు త్రిచక్ర వాహనాలు వీటిలో అధిక శబ్దం కలిగిన 02 వాహనాలను స్వాధీనం చేసుకొని సంబంధిత కేసులు నమోదు చేస్తున్నారని తెలిపారు. అదనంగా 4 సెల్ ఫోన్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారని నేరచరిత్ర కలిగిన వ్యక్తులు, రౌడీషీటర్లు, శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

## తూనికల కొలతల ఆమోదం పొందాలి

**ప్రజాపక్షం/బీబీనగర్** : తూకం వేసే కాంటాలు ఉన్న ప్రతి ఒక్కరు యాదాద్రి భువనగిరి జిల్లా తూని గల కొలతల అధికారిచే ఆమోదం పొందాలని జిల్లా తూనికల కొలతల అధికారి వెంకటేష్ అన్నారు. మంగళవారం బీబీనగర్ మండల కేంద్రంలో మండలంలో గల 33 చౌక ధరల దుకాణాల డీలర్ల వేయింగ్ మిషన్‌లకు నంబర్లు వేసి అవగాహన కల్పించాలరూ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిరాణా షాపులు వే బ్రిడ్జి చికెన్ మాంసాహార దుకాణాలలో వేయింగ్ మిషన్ ఉన్న ప్రతి ఒక్కరూ ప్రతి సంవత్సరము జిల్లా అధికారి చే ఆమోదం పొందాలని కోరారు లేనియెడల తనిఖీలు నిర్వహించి జరిగినట్లయితే జరిమానా విధించబడునని ఆయన తెలిపారు.



## కొనుగోళ్ళు వేగవంతం చేయాలని ధర్నా

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో రైతుల ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీఎస్పీ పార్టీ ఆధ్వర్యంలో నేతాజీ విగ్రహం వద్ద రైతులతో కలిసి మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్పీ మండల అధ్యక్షుడు మీసాల సైదులు మాట్లాడుతూ గత పది సం.లుగా బీఆర్ఎస్ నాయకులు, మిల్లర్లు యాజమాన్యంతో కలిసి రైతులను ఇబ్బందులకు గురి చేశారని, ప్రస్తుతం కాంగ్రెస్ నాయకులు కూడా మిల్లర్లతో కుమ్మక్కై అదే పరిస్థితిని కొనసాగిస్తున్నారని ఆరోపించారు.జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్లోడ్ కార్యక్రమాన్ని చేపట్టినప్పటికీ, మిల్లర్లు రెండు కిలోలు అదనంగా వసూలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. బిఆర్ఎస్ నాయకులు, మిల్లర్లు, కాంగ్రెస్ నాయకులు కలిసి రైతులను నష్టపరిచే విధంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే వేగవంతంగా కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మీసాల సుమన్, గూని శ్రీకాంత్ సిపిఎం నాయకులు మంచాల మధు చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హత్య కేసులో ఐదుగురు నిందితుల అరెస్ట్

### 12 గంటల్లోనే హంతకులను గుర్తించిన పోలీస్

### హత్యకు ఉపయోగించిన నాలుగు సెల్‌ఫోన్లు, ఒక స్కూటర్, గొడ్డలి స్వాధీనం

### జిల్లా ఎస్‌పి కె. నరసింహ వెల్లడి




**ప్రజాపక్షం/సూర్యాపేట** : సూర్యాపేట మండలంలోని సోలిపేట గ్రామంలో సోమవారం రాత్రి భూతగాదాలో హత్యకు గురైన మేకల జయరాములుకు సంబంధించిన కేసును పోలీసులు ఐదుగురు నింధితులను గుర్తించి 12 గంటల్లోనే కేసును చేధించారు. హత్యకు ఉపయోగించిన ఒక గొడ్డలితోపాటు నాలుగు సెల్‌ఫోన్లు, ఒక స్కూటర్‌ను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను జిల్లా ఎస్‌పి కె. నరసింహ మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. జయరాములు గతములో తన పిల్లల చదువుల నిమిత్తము సూర్యాపేటలో నివాసము ఉంటూ తనకు వారసత్వముగా వచ్చిన మూడు ఎకరముల వ్యవసాయ భూమిని తన చిన్న అన్న కృష్ణయ్యకు కౌలుకు సుమారు 12 సంవత్సరాలు ఇచ్చాడు. పిల్లల చదువు అనంతరం జయరాములు తన స్వంత గ్రామమైన సోలిపేటకు వెళ్ళి తన భూమిని తానే సాగు చేసుకుంటున్నాడు. తనకు భూమి కౌలుకు ఇవ్వకుండా తానే స్వయంగా సాగుచేసుకుంటున్నాడని జయరాములు చిన్న అన్న అయిన కృష్ణయ్య, అతని కుమారుడు కిరణ్ (సిఐఎస్‌ఎఫ్ కానిస్టేబుల్), కిరణ్ భార్య మౌనిక, కృష్ణయ్య భార్య లక్ష్మమ్మ వ్యవసాయ భూమి గెట్టు విషయములో మృతునితో తరుచూ గొడవపెట్టుకుంటూ ఉండేవారు. ఇండ్లు కూడా పక్క పక్కనే ఉండడంతో ఇంటి హద్దుల విషయంలో కూడా వారు, ఇంటికి మరో పక్కన ఇల్లు గల మట్టపల్లి రామచంద్రు అనే వ్యక్తి కూడా తరుచూ గొడవపడేవారు. వారం రోజుల క్రితం కిరణ్ తన భార్య మౌనికతో కలిసి సోలిపేటకు వచ్చి తన వ్యవసాయ భూమిలో నాలుగు రోజుల క్రితము బోర్‌వేసి సోమవారం రోజున బోర్‌కు మోటర్ బిగించగా బోరునీళ్లు బాగా పోయడంతో కిరణ్, అతని తల్లిదండ్రులు కృష్ణయ్య, లక్ష్మమ్మ, కిరణ్ భార్య మౌనిక, రామచంద్రులు కలిసి అక్కడే దావత్ చేసుకున్నారు. అట్టి సమయంలో జయరాములు అక్కడికి వెళ్లి తన వ్యవసాయ పొలములో వరి కొయ్యకాళ్లకు నిప్పు పెట్టి కొద్దిసేపు ఉండి వెళ్లిపోయాడు. ఆ సమయంలో నిందితులు అతన్ని చూసి జయరాములు తరచూ తమతో గొడవపడుచు ఇబ్బందులు పెట్టుచున్నాడని అతన్ని చంపితే అడ్డము ఎవరూ ఉండరని అతని ఎలాగైన ఈరోజు చంపుదామని నిర్ణయించుకొని పథకము పన్నారు. కొద్దిసేపటి తరువాత అక్కడి నుండి కృష్ణయ్య, లక్ష్మమ్మలు ఇంటికి వెళ్ళిపోయారు, వారు వెళ్ళిపోయిన తరువాత రామచంద్రు, కిరణ్, మౌనికలతో సాయంత్రం జయరాములు వరి కొయ్యకాళ్ల నిప్పు ఆర్ప దానికి మళ్లీ పొలము వస్తాడు అదును చూసి అప్పుడు చంపుదామని అతను రాగానే తనకు ఫోన్ చేయాలని రామచంద్రు ఇంటికి వెళ్లిపోయాడు. సాయంత్రం సుమారు 6 గంటల సమయంలో జయరాములు తిరిగి వ్యవసాయ పొలము వద్దకు వెళ్లి కొద్దిసేపు అక్కడ ఉండగా ఇది గమనించిన కిరణ్ భార్య మౌనిక రామచంద్రుకు ఫోన్ చేయగా అతను ఫోన్ లిఫ్టు చేయలేదు. దీంతో కిరణ్, మౌనికలు గొడ్డలి తీసుకొని వారి స్కూటర్‌పై ముందుగా వెళ్లి గ్రామ ఆర్చీ వద్ద కాపు కాసి ఉండగా రాత్రి సుమారు 7 గంటల సమయంలో జయరాములు తన మోటర్ సైకిల్‌పై ఇంటికి వెళ్లుచూ అర్చీ వద్దకు రాగానే కిరణ్, మౌనిక కలిసి అతన్ని అడ్డగించి అతనితో గోడవపడి కిరణ్ తన చేతిలో ఉన్న గొడ్డలితో జయరాములు మెడ, తల, చేతులు, ఇతరచోట్ల ఇష్టము వచ్చినట్లు నరకగా తీవ్ర గాయాలతో జయరాములు అక్కడికి అక్కడే చనిపోయాడు. నేరస్తులు వెంటనే ఇంటికి వెళ్లి జయరాములును హత్యచేసిన విషయం చెప్పి వెంటనే ఊరి నుంచి పారిపోయారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు జరిపారు. నమ్మదగిన సమాచారం మేరకు సిఐ రాజశేఖర్ కేసు ఆధ్వర్యంలో మంగళవారం హైటెక్ బస్టాండ్ వద్ద నేరస్తులను అదుపులోకి తీసుకొని విచారణ చేయగా భూమి గెట్టు తగాదా మనసులో పెట్టుకొని హత్య చేసినట్లు నేరస్తులు నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. 12 గంటల్లో హత్యకేసు నింధితులను గుర్తించి అరెస్టు చేయడంలో పర్యవేక్షణ చేసిన సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్నకుమార్, రూరల్ సిఐ రాజశేఖర్, ఎస్‌ఐ బాలు నాయక్, సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, సూర్యాపేట డిఎస్‌పి ప్రసన్నకుమార్, రూరల్ సిఐ రాజశేఖర్, ఎస్‌ఐ బాలు నాయక్ సిబ్బంది ఉన్నారు.

## బూత్ స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి చర్యలు

ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం కోసం పార్టీ క్యాడర్‌ను పటిష్టం చేసే విధంగా నాయకులు కృషి చేయాలని ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం బిఎన్‌రెడ్డి నగర్ బిఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి ఆధ్వర్యంలో వివిధ పార్టీల యువ నాయకులు ఎంఎల్‌ఎ సుధీర్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ కండువాలు కప్పి పార్టీలో ఆహ్వానించారు. అనంతరం ఎంఎల్‌ఎ మాట్లాడుతూ పార్టీ కష్టపడి కార్యకర్తలుకు రాబోయే ప్రభుత్వం మనదే అని, పార్టీ అధికారంలో వచ్చిన తర్వాత కార్యకర్తలను గుర్తించి వారికి ప్రధాన్యత ఇస్తామని తెలిపారు. పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త సైనికుడిగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. కార్యక్రమంలో అనిల్‌కుమార్ చౌదరి, మాధ వరం నరసింహారావు, అర్జున్‌గౌడ్, మనోజ్ కుమార్, కొంగర మహేష్, మధుసూదన్‌రెడ్డి, కొంగర నరేష్, విజయ్ లక్ష్మి, సక్కు బాయ్, రాధిక, మేరీ, సురేష్‌రెడ్డి, కిరణ్ నేత పాల్గొన్నారు.

## సిద్దాపూర్‌లో చెత్త డంపింగ్ యార్డు వేస్తే ఆందోళనలు చేస్తాం



**ప్రజాపక్షం/కొత్తూరు:** కొత్తూరు మండలం సిద్దాపూర్ గ్రామస్తులతోపాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున షాద్‌నగర్ ఆర్‌డిఓ ఆఫీస్‌కు చేరుకొని ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. సిద్దాపూర్‌లో చెత్త డంపింగ్ యార్డు వేస్తే ఆందోళన కార్యక్రమాలు చేస్తామన్నారు. మంగళ వారం చెత్త డంపింగ్ యార్డుతో ప్రజలు ఎదుర్కొనున్న సమస్యలపై ఆర్‌డిఓ సరితకు వినతిపత్రం అందజేశారు. అక్కడి నుండి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ క్యాంపు కార్యాలయానికి చేరుకొని తమ గోడును వెలబోసుకు న్నారు. అధికారులు స్పష్టత ఇచ్చే వరకు పోరాటాలు చేస్తామన్నారు.


**ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తా...**కొత్తూరు మండలం సిద్దాపూర్‌లో ఏర్పాటు చేయనున్న చెత్త డంపింగ్ యార్డు విషయం ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళడం జరిగిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వివరించారు. రైతులకు, ప్రజలకు నష్టం కలిగించే పనులు ఏమి చేయమని, ఎవరు అధైర్య పడోద్దని పేర్కొన్నారు. సిద్దాపూర్ చెత్త డంపింగ్ యార్డుకు సంబంధించిన విషయాన్ని కలెక్టర్ నారాయణరెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని ఆర్‌డిఓ సరిత వివరించారు. కార్యక్రమంలో కొత్తూరు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, అగీరు రవికుమార్ గుప్తా, మహిళా నాయకురాలు నుస్రత్ భేగంతోపాటు రైతులు, మహిళలు పాల్గొన్నారు.

## విద్యతోపాటు క్రమశిక్షణ అవసరం



**ప్రజాపక్షం/కొందుర్గు:** సమాజంలో బాలికలకు విద్యతోపాటు క్రమశిక్షణ అలవాటు చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని కొందుర్గు సర్పంచ్ చౌడాపురం ప్రభాకర్ అన్నారు. మంగళవారం కొందుర్గు మండల కేంద్రం లోని పంచాయతీ కార్యాలయంలో బాలికలను రక్షిద్దాం..బాలికలను చది విద్దాం అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ చౌడాపురం ప్రభాకర్ మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టేం దుకు తల్లిదండ్రులు, యువత ముందుకు రావాల్సిన అవసరం ఉంద న్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చంద్రశేఖర్, వార్డు సభ్యులు కావలి ప్రవీణ్, తంగేళ్లపల్లి నవీన్, మాజీ ఎంపిటిసి మాణెయ్య, అంగన్‌వాడి టీచర్స్, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## జిహెచ్‌ఎంసి కమిషనర్‌కు ఎమ్మెల్యే వినతి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పర్యావర ణానికి ముప్పు కలిగించే ఎకోటౌన్ మాకొద్దు సారూ అంటూ జిహెచ్ ఎంసి కమీషనర్ ఆర్‌వి కర్ణన్‌ను కోరారు. మంగళవారం హైద్రాబా ద్‌లోని జిహెచ్‌ఎంసి కమీషనర్ ఆర్‌వి కర్ణన్‌ను మర్యాదపూర్వకం గా కలిసి సమస్యలతో కూడిన విన తిపత్రం అంధించారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ పర్యావరణానికి ముప్పు కలిగిస్తున్న ఎకో టౌన్ ప్రతిపాదనకు తాము పూర్తిగా వ్యతిరేకమన్నారు. పరిశ్రమల ఏర్పాటు కోసం సిద్దాపూర్ రైతులు భూములు ఇస్తే ఎకో టౌన్ లాంటి ప్రతిపాదనలు తీసుకువచ్చి పర్యావరణానికి ముప్పు తెస్తామంటే ఉరుకునే ప్రసక్తి లేదని కమీషనర్‌కు సూచించారు. ఇందుకు కమీషనర్ కర్ణన్ స్పందిస్తూ హైద్రాబాద్ ప్రాంతంలోనే ఏకోటౌన్‌కు నాలుగు ప్రాంతా లకు ప్రతిపాదనలు ఉన్నాయని, ఏకోటౌన్‌లో చెత్త నుండి విద్యుత్ ఉత్పత్తి తయారు చేస్తారని వివరించారు.

## ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

**ప్రజాపక్షం/కొత్తూరు:** ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘ టన మండల పరిధిలోని పులిచర్లకుంటతండా, వైఎం తండాలో మంగళ వారం ఉ చోటు చేసుకుంది. తండాకు చెందిన పత్లావత్ ధర్మికి ఐదుగురు సంతానం ఉన్నారు. తన చిన్నకుమారుడు పత్లావత్ తులచ్య (36) అనే వ్యక్తి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకు న్నట్లు కొత్తూరు సిఐ నరహరి తెలిపారు. మృతుడి భార్య పిల్లలతో కలిసి పుట్టింటికి వెళ్ళిన నేపథ్యంలో తీవ్ర మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకు న్నట్లు పేర్కొన్నారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ నరహరి తెలిపారు.

### నీటి సంపులో పడి మహిళ ఆత్మహత్య

ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘ టన మండల పరిధిలోని ఎస్‌బి పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. సిఐ నర హరి తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం ఉదయం ఎస్‌బిపల్లి గ్రామానికి చెందిన ఎమ్మె సంతోషా (41) ఇంట్లో ఉన్న నీటి సంపులో పడి మృతి చెందినట్లు సిఐ తెలిపారు. మృతురాలి భర్త రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ నరహరి తెలిపారు.

# పర్యాటకుల పర్యవేక్షణకు అదనపు సిబ్బందిని నియమిస్తాం

టిజిటిడిసి జనరల్ మేనేజర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హుస్సేన్‌సాగర్ బోటింగ్ యూనిట్‌లో అదనపు జాగ్రత్త చర్యగా పర్యాటకుల కద లికలపై మరింత పర్యవేక్షణ కోసం అదనపు సిబ్బందిని నియమించనున్నట్లు తెలంగాణ టూరిజం డెవలప్ మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (టిజిటిడిసి) తెలియజే సింది. బోటింగ్ యూనిట్‌లో అన్ని భద్రతా ప్రమాణాలు కచ్చితంగా అమలు చేస్తున్నామని, సిబ్బంది, బోటు డ్రైవర్లకు నిరంతర శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మని టిజిటిడిసి తెలిపింది. హుస్సేన్‌సాగర్ బోటింగ్ కార్యకలాపాలకు సంబంధించి మే 25వ తేదీన 'ప్రజా పక్షం' దిన పత్రికలో 'లుంబిని పార్క్‌లో అడుగడుగునా అధికారుల నిర్లక్ష్యం' అనే శీర్షికతో ప్రచురితమైన కథ నంపై టిజిటిడిసి జనరల్ మేనేజర్ (వాటర్ ఫ్లీట్) స్పందిస్తూ "హుస్సేన్‌సాగర్‌లో నిర్వహిస్తున్న బోటింగ్ సేవలు దేశీయ, విదేశీ పర్యాటకులకు వినోదాన్ని అందించే ఉద్దేశంతో కొనసాగుతున్నాయి. కార్పొరేషన్ బాధ్యత టికెట్లు జారీ చేయడం వరకు మాత్రమే పరి మితం. బోటింగ్ టికెట్ వ్యవస్థ పూర్తిగా టిమ్స్, ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తున్నందున అక్రమాలకు అవకాశం లేదు. బోటు ప్రయాణం కోసం వచ్చే పర్యాటకుల వ్యక్తి గత ఉద్దేశాలను ప్రశ్నించడం సాధ్యం కాదు. ప్రతి బోటు ప్రయాణానికి ముందు పర్యాటకులకు తప్పనిసరిగా లైఫ్ జాకెట్లు అందజేసి వాటిని ప్రయాణం పూర్తయ్యే వరకు వాటిని ధరించాలని సూచిస్తున్నాం. అయితే, బుద్ధ విగ్రహం వద్ద ఫొటోలు, వీడియోలు లేదా సోషల్ మీడియా రీల్స్ కోసం కొందరు పర్యాటకులు తాత్కాలి కంగా జాకెట్లు తొలగిస్తున్నారు. ఆత్మహత్యాయత్నాల వంటి దురదృష్టకర సంఘటనలు జరిగిన సందర్భాల్లో బోటు డ్రైవర్లు, శిక్షణ పొందిన ఈతగాళ్లు తమ ప్రాణా లను సైతం పణంగా పెట్టి పలుమార్లు రక్షణ చర్యలు చేపట్టారు. ఇటీవల జరిగిన ఆత్మహత్య ఘటనలో కూడా వెంటనే సహాయక చర్యలు చేపట్టినా దురదృష్టవశాత్తూ సంఘటన చోటుచేసుకుంది" అని టిజిటిడిసి జనరల్ మేనేజర్ వివరించారు.

## ఎంఎంసిలో కొత్త స్వయం సహాయక సంఘాల ఏర్పాటు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళా సాధికారతకు ప్రాధాన్యత ఇస్తూ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసి) ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల బలోపేతానికి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యాచరణ కింద మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో కొత్త స్వయం సహాయక సంఘాల ఏర్పాటు, బ్యాంకు ఖాతాల ప్రారంభం, సభ్యులకు శిక్షణ వంటి చర్యలను అమలు చేశారు. కొత్తగా ఏర్పడిన సంఘాల సభ్యులతో పాటు బుక్ కీపర్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే క్రియాశీ లంగా లేని స్వయం సహాయక సంఘాల పునరుద్ధరణకు చర్యలు చేపట్టి నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమ పురోగతిని మెప్మా పోర్టల్‌లో ఆన్ లైన్ ద్వారా నమోదు చేస్తున్నట్లు వెల్లడించారు.

## మహిళా పారిశ్రామికవేత్తల ప్రోత్సాహానికి చర్యలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళా సాధికారత, స్వయం ఉపాధి అవకాశాల ప్రోత్సాహానికి జిహెచ్ ఎంసి ఆధ్వర్యంలో మహిళా పారిశ్రామికవేత్తల డ్రైవ్ – మహిళా శక్తి ఐడియేషన్, కంప్లీషన్ కార్య క్రమాన్ని నిర్వహించారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక (పిపిపిపి)లో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమం 12వ వారం, 82వ రోజుకు చేరు కుంది. జిహెచ్‌ఎంసి పరిధిలోని వివిధ సర్కిళ్లలో నిర్వహించిన కార్యక్రమంలో మహిళలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, స్థానిక సంస్థల ప్రతి నిధులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సుమారు 360 మంది మహిళలు పాల్గొని పారిశ్రామిక నైపు ణ్యాలు, వ్యాపార అవకాశాలు, ఆర్థిక అక్షరాస్యత, మార్కెటింగ్ వ్యూహాలు వంటి అంశాలపై అవగా హన పొందారు. కొత్త ఆలోచనలను నిలకడైన వ్యాపారాలుగా మార్చుకోవడం, స్వయం ఉపాధి అవకాశాలను వినియోగించుకోవడం వంటి అం శాలపై నిపుణులు మార్గదర్శనం చేశారు. జిహెచ్





ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఆదేశాల మేరకు అధికారులు మహిళలను ప్రభుత్వ సహాయ పథకా లను వినియోగించుకోవాలని ప్రోత్సహించారు. పరస్పర చర్చలు, ఆచరణాత్మక సమావేశాలు మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాయని అధికారులు తెలిపారు. మహిళా సాధికారత, సమ్మిళిత సామాజికఆర్థిక అభివృద్ధికి కార్యక్రమం దోహదపడుతుందన్నారు. కొత్త స్వయం సహాయక సంఘాల ఏర్పాటు, బ్యాంకు ఖాతాల ప్రారంభం, సభ్యులకు శిక్షణ వంటి చర్యలను అమలు చేశా రు. సంఘాల సభ్యులతో పాటు బుక్ కీపర్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. క్రియాశీ లంగా లేని స్వయం సహాయక సంఘాల పునరుద్ధ రణకు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

## రోగులకు కనీస సౌకర్యాలు కల్పించాలి

రంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి.స్వర్ణ కుమారి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఆసుపత్రికి వచ్చే రోగులకు కనీస సౌకర్యాలు కల్పించాలని రంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి.స్వర్ణ కుమారి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం తలకొండపల్లి, గట్టు ఇప్పలపల్లికొత్తూరు, కేశం పేట్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి.స్వర్ణకుమారి అకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న సిబ్బంది వివరాలను, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించి విధులకు హాజరు కాని సిబ్బందికి మెమోలు జారీ చేస్తామన్నారు. హాస్పిటల్‌లోని బెడ్లను, మెడిసిన్ ఎక్స్పైరీ డేట్‌లను హాస్పిటల్ పరిసరాలను పరి శీలించి శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. గర్భిణీలకు సరైన వైద్య సేవలు అందుతున్నాయా అని వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసుప త్రులలో డెలివరీల సంఖ్య పెరిగేలా చూడాలని ఆరోగ్య సిబ్బందిని కోరారు. ప్రతి మంగళవారం మహిళల ఆరోగ్య పరి రక్షణ కోసం నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా క్లీనిక్‌లను నిర్వ హించడమే కాకుండా క్లినిక్ లకు వచ్చే మహిళలకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారిని జిల్లా స్థాయి ఆసుప



త్రులకు రిఫరల్ చేయాలని, అలాగే మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. రక్తహీనత ఉన్న వారికి సరైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులు ఉండే ప్రాంతంలో కూర్చునే ఏర్పాట్లు, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలని, ఆసుప త్రికి వచ్చే రోగులకు నాణ్యమైన సేవలు అందించాలని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలు చేరుకోవాలని, వైద్యులు మరియు సిబ్బంది ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల సేవా భావంతో పనిచే యాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### పోలీస్ వ్యవస్థపై నమ్మకం పెరిగేలా

## ప్రతి ఫిర్యాదును పరిష్కరించాలి

ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రజలకు పోలీస్ వ్యవస్థ పై నమ్మకం పెరిగేలా ప్రతి ఫిర్యాదును స్వీకరించి పరిష్కరించాలని ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్‌జోషి అన్నారు. మంగళవారం ఫ్యూచర్ సిటీ సిపి తరుణ్ జోషి కడ్తాల్ పోలీస్ స్టేష న్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ ఆవరణను పరిశీలించి, విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. రికా ర్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజా ఫిర్యా దులను అత్యంత మర్యాదతో స్వీకరించాలని, బాధితుల సమస్యలను శ్రద్ధగా వినాలని, అలాగే చట్టప్రకారం త్వరితగతిన పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజలతో స్నేహపూర్వక పోలీసింగ్



పై ప్రత్యేక దృష్టి సారించాలని సిపి ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం లేకుండా, సమయపాలనతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. పోలీస్ స్టేషన్, పరిసరా లను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. కార్యక్ర మంలో మహేశ్వరం డిసిపి కె.నారాయణరెడ్డి, ఎసిపి ఎస్.జానకిరెడ్డితో పాటు కడ్తాల్ ఇన్స్పెక్టర్ వి.సైదిరెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## సామాన్యులపై భారం వేస్తున్న నరేంద్రమోదీ ప్రభుత్వం

పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు తక్షణమే తగ్గించాలని కాంగ్రెస్ శ్రేణులు నిరసన

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధర లను తక్షణమే ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ శ్రేణులు డిమాండ్ చేశారు. మంగళవారం షాద్‌నగర్ ఆర్‌డిఓ ఆఫీస్ ముందు కాంగ్రెస్ మండల పార్టీల అధ్యక్షులతోపాటు సర్పంచులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్‌డిఓ సరితకు వినతిపత్రాన్ని అంధించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు మాట్లా డుతూ ఐదు రాష్ట్రాల ఎన్నికల ప్రచారాల్లో పెట్రోల్, డీజిల్ ధరలను పెంచే ప్రసక్తి లేదని, ఎంత నష్టం ఇచ్చిన కేంద్రమే బరిస్తుందని చెప్పిన ప్రధాని నరేంద్రమోదీ గత పది రోజుల నుండి పెట్రోల్, డీజిల్‌పై లీటర్‌కు రూ.8లకి పైగానే ధరలు పెంచారని వివరించారు. పెరిగిన ధరలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో వ్యవసాయ రంగంతోపాటు అన్ని వాణిజ్య రవాణా రంగాలపై పెనుభారం పడుతుందని వాపోయారు. దాంతోనే నిత్యావసర వస్తువుల ధరలతోపాటు పండ్లు, కూరగాయల ధర లు సైతం పెరుగుతున్నాయని వివరించారు. పెరిగిన ధరలతో సామాన్య ప్రజలు రోడ్లపైకి వచ్చే అస్కారం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బిజెపి తన ఉనికిని కాపాడుకునేందుకే ప్రజలపై ప్రేమ ఉన్నట్లు నటిస్తుందే తప్పా మరేమి లేదని వాపోయారు. బంగారం కొనవ



ద్దని, పెట్రోల్, డీజిల్ వాడకాన్ని తగ్గించాలని ఒకవైపు ప్రచారం చేస్తునే మరోవైపు లక్షలు ఖరీదు చేసే సూట్లు వేసుకొని విదేశాలు తిరగవచ్చా అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం మత రాజకీయాలతో పబ్బం గడుపుతుందే తప్పా సామాన్య ప్రజలకు ఎలాంటి మేలు చేయడం లేదని ప్రశ్నించారు. ధర్నా కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు రఘునాయక్, మండల అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, కుమారస్వామి గౌడ్, రమేష్, రాయికల్ శ్రీనివాస్, పురుషోత్తంరెడ్డి, జాకారం శేఖర్, పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్, మున్సిపల్ అధ్యక్షుడు సుదర్శన్ గౌడ్, నేతలు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, మహ్మద్ ఇబ్రహీం, ఖాదర్‌ఘోరీ, సర్పంచ్‌లు చించోడు శ్రీనివాస్, ఆర్.బాబునా యక్, కొమ్ముకృష్ణ, గోపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మెన్ బసవేశ్వర్, వైస్ చైర్మెన్ అందె మోహన్, కౌన్సిలర్లు బచ్చలి నరేష్, మురళిమోహన్, పెంటయ్య, కొప్పునూరి ప్రవీణ్, ఉప సర్పంచ్ లింగారెడ్డిగూడ అశోక్, మార్కెట్ డైరెక్టర్ కరుణాకర్, బుద్ధ నర్సింహులు, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

## జన గణనకు వచ్చే అధికారులకు ప్రజలు పూర్తి సహకారం అందించాలి

రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** జన గణన 2027 లో భాగంగా ఈ నెల 11వ తేదీ నుండి ప్రారంభమ యిన మొదటి దశ ఇండ్ల జాబితా,ఇండ్ల గణన ప్రక్రియలో జిల్లా ప్రజలు గణనకు వచ్చే (ఎన్యు మరేటర్లు) అధికారులకు తమ పూర్తి సహకారం అందించాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి ఒక ప్రకటనలో తెలి పారు. భారత ప్రభుత్వం జన గణన 2027 ప్రక్రి యను రెండు దశలలో చేపడుతోందన్నారు. అందులో భాగంగా మొదటి దశలో మే 11 నుండి జూన్ 9వ తేదీ వరకు ఇండ్ల గణన చేప ట్టడం జరిగినదని అదనపు కలెక్టర్ వివరించారు. ఇండ్ల గణన కోసం 11.05.2026 నుండి 09.06.2026 వరకు ఇంటి వద్దకు వచ్చే నమోదు అధి కారికి పూర్తి సహకారాన్ని అందించి అధికారులు అడిగిన అన్ని వివరాలు తెలి యజేయాలని ప్రజలకు సూచించారు. ప్రజలు అందించిన వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ప్రజలందరూ తప్పనిసరిగా ఇండ్ల గణనకు వచ్చే అధికారికి సరైన సమాచారాన్ని ఇచ్చి దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రజలు అధికారులకు సరైన సమాచారాన్ని అందించి సహకరించాలని అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి జిల్లా ప్రజలను కోరారు.

# 3న జరిగే సిఎం సభకు పకడ్బందీ ఏర్పాట్లు

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** జూన్ 3న రంగారెడ్డి జిల్లా అబ్దు ల్లాపూర్మెట్టు మండలం కోహెడలో జరిగే రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి సభకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలె క్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులకు సూచిం చారు. మంగళవారం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మల్కాజిగిరి పోలీసు కమిషనర్ సుమతీతో కలిసి కోహెడలో జరిగే ముఖ్యమంత్రి కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెంటు పరిధి లోని కోహెడ రెవిన్యూ సర్వే నంబర్ 167/1లో కోహెడ వ్యవసాయ మార్కెట్ ఏర్పాటుకు జూన్ నెల 3న ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో



అవసరమైన అన్నిఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం 239 ఎకరాలు కేటాయించిన నేపథ్యంలో 167/1లో సాగు చేసుకుంటున్న రైతులను గుర్తించి అర్హులైన రైతులకు న్యాయం చేస్తామన్నారు. ఈసంద ర్భంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ ఏ రాష్ట్రంలో లేని విధంగా ఇక్కడ 239 ఎకరాలలో అంత ర్జాతీయ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మించడం జరుగుతుందని, తెలంగాణ కు మణిహారంలాగా కోహెడ మార్కెట్ ఉంటుందని తెలి పారు. జూన్ 3న శంకుస్థాపన కార్యక్రమాన్ని ముఖ్య మంత్రి చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని, అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. మల్కాజిగిరి పోలీసు కమిషనర్ బడుగుల సుమతి మాట్లాడుతూ ముఖ్య మంత్రి కార్యక్రమానికి ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా పోలీస్ శాఖ నుండి పూర్తి సహకారం అందించి విజయవంతం అయ్యేలా చూస్తామని తెలిపారు. కార్య క్రమంలో గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ సిహెచ్ మధుసూదన్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్‌డిఓ అనంత్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కర్ణాటక ఉల్లంఘనను అడ్డుకోండి

ప్రధానికి తమిళనాడు సిఎం విజయ్ లేఖ



**చెన్నై :** కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల మధ్య కావేరీ నది నీటి పంపకాల వివాదం మళ్లీ రాజుకుంది. కర్ణాటక కొత్త డ్యామ్ పనులకు సిద్ధమవడంతో తమిళనాడు అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ ప్రాజెక్టును ఆపాలని కోరుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీకి తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ అత్యవసర లేఖ రాశారు. మేకెదాటు దగ్గర కర్ణాటక ప్రభుత్వం డ్యామ్ నిర్మించాలని చూస్తోంది. అయితే ఈ ప్రతిపాదనను తిరస్కరించాలని సిఎం విజయ్ ప్రధానిని కోరారు. కర్ణాటక అక్కడ శంకుస్థాపన ఏర్పాట్లు చేస్తోందని లేఖలో పేర్కొన్నారు. కావేరీ నీటి వివాద ట్రైబ్యునల్ ఇచ్చిన ఆదేశాలను కర్ణాటక ప్రభుత్వం ఉల్లంఘిస్తోందని విజయ్ ఆరోపించారు. ఈ ఆదేశాలను గతంలో సుప్రీంకోర్టు కూడా సమర్థించిందని తెలిపారు. ఎగువన ఉన్న రాష్ట్రాలు దిగువ రాష్ట్రాల అనుమతి లేకుండా కొత్తగా ఎలాంటి జలాశయాలు నిర్మించొద్దని పేర్కొన్నారు. తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల అంగీకారం కర్ణాటకకు తప్పనిసరని అన్నారు. ట్రిబ్యునల్ అనుమతించిన ప్రాజెక్టుల జాబితాలో మేకెదాటు లేదని సీఎం విజయ్ పేర్కొన్నారు.

# పేదల సమస్యలు పరిష్కరించే సత్తా మోదీ ప్రభుత్వానికి లేదు

- అన్ని వర్గాల ప్రజలు ఈ విషయం గ్రహించారు..
- బిజెపి సర్కార్‌పై ఆగ్రహంతో ఉన్నారు..
- మోదీ వ్యూహం ప్రజలను ఖూనీ చేసే విషప్రయోగంలాంటిది
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శలు



**న్యూఢిల్లీ :** ఇంధన ధరల పెరుగుదలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. పేదల సమస్యలను పరిష్కరించే సామర్థ్యం మోదీ ప్రభుత్వానికి లేదని ప్రజలు గ్రహించారని, అందుకే అన్ని వర్గాల ప్రజలు ఈ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. గత 12 ఏళ్లలో ముడి చమురు ధరలు తగ్గినప్పుడు ప్రజలకు ఎందుకు ఉపశమనం కల్పించలేదని కాంగ్రెస్ అధినేత ప్రశ్నించారు. మంగళవారం ఖర్గే విలేకరులతో మాట్లాడుతూ 'ఇది మోదీజీ వ్యూహం... పేద ప్రజలను చంపేందుకు చేసే ఒక రకమైన నెమ్మది విషప్రయోగం లాంటిది. వారు ఎప్పుడూ ధరలను కొద్దికొద్దిగా పెంచుతూనే ఉంటారు. కానీ కేవలం ఒక్క వారంలోనే ధరలు రూ. 10 నుంచి 12 వరకు పెరగడం చూస్తుంటే, మోదీజీ ఈ సమస్యలపై దృష్టి సారించదలుచుకోలేదని, పైగా దేశాన్ని వినాశనం వైపు నెట్టివేస్తున్నారని స్పష్టమవుతోంది. అదే సమయంలో, తాను దేశం కోసం అన్నీ చేస్తున్నానని, త్యాగాలు చేస్తున్నానని, ప్రజల కోసం పనిచేస్తున్నానని ఆయన పదే పదే చెబుతుంటారు. కానీ ఇక్కడి ప్రజలు మాత్రం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్రవ్యోల్బణం ఇలాగే పెరుగుతూ పోతే, నిరుద్యోగం అధికమవుతూ ఉంటే, కర్మాగారాలు మూతపడుతుంటే, ఎంఎస్‌ఎంఇలు, చిన్న తరహా పరిశ్రమలు మూసివేతకు గురైతే... అప్పుడు పరిస్థితి ఏమవుతుంది?' అని ఆయన ప్రశ్నించారు. అన్ని వర్గాల ప్రజలు ఈ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, పేదల సమస్యలను పరిష్కరించే సత్తా ఈ ప్రభుత్వానికి లేదని వారు గ్రహించారని ఖర్గే పేర్కొన్నారు. ప్రశ్నపత్రాల లీకేజీ సమస్య తీవ్రమైందని, ఈ సమస్యలపై ఎందుకు దృష్టి సారించడం లేదని నిలదీశారు. ఆయన దేశాన్ని పరిపాలిస్తారా, లేక ప్రపంచ దేశాలన్నింటినీ పర్యాటకుడిలా చుట్టి వస్తారా అని ప్రశ్నించారు. ఎక్స్ వేదికగా చేసిన ఒక పోస్ట్‌లో, పిఐబి (ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో) విడుదల చేసిన అధికారిక ప్రకటనను ఖర్గే ఉటంకించారు. సరిగ్గా 12 ఏళ్ల క్రితం ఇదే రోజున— అంటే మే 26, 2014న— ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బాధ్యతలు స్వీకరించినప్పుడు, 'ఇండియన్ బాస్కెట్'లో ముడి చమురు ధర బ్యారెల్‌కు 108.05 డాలర్లుగా ఉందని, అలాగే డాలర్ రూపీ మారకం విలువ రూ. 58.59గా ఉందని ఆయన ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. ఆ సమయంలో పెట్రోల్ లీటరుకు రూ. 71.51 చొప్పున, డీజిల్ లీటరుకు రూ. 56.71 చొప్పున లభించేవని ఖర్గే తన ఎక్స్ పోస్ట్‌లో తెలిపారు. నేడు, ముడి చమురు ధర బ్యారెల్‌కు 99 డాలర్ల కంటే తక్కువగా ఉంది. అయినప్పటికీ, పెట్రోల్, డీజిల్ ధరలు లీటరుకు వరుసగా రూ. 102.12 మరియు రూ. 95.20 కు పెరిగాయని ఖర్గే అన్నారు. మరో మాటలో చెప్పాలంటే, ముడి చమురు చౌకగా మారగా, పెట్రోల్ ధర సుమారుగా 42.8%, డీజిల్ ధర దాదాపు 67.9% పెరిగిందని ఆయన అన్నారు. 'పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల ప్రతి రంగాన్ని ప్రభావితం చేస్తుందని ప్రతి ఆర్థికవేత్తకు తెలుసు. రవాణా నుండి ఆహార వస్తువుల వరకు, సామాన్యుడిపై ద్రవ్యోల్బణం భారం తీవ్రమవుతూనే ఉంది. అయినప్పటికీ, ప్రభుత్వ లాభాల వేట నిరాటంకంగా కొనసాగుతూనే ఉంది' అని ఖర్గే అన్నారు. ముడి చమురు ధరలు తగ్గినప్పుడు, పెట్రోల్, డీజిల్ ధరలు ఎందుకు పెరిగాయన్నారు. ప్రజలకు ఎందుకు ఉపశమనం లేదు? అని అన్నారు. తాజా ఇంధన ధరల పెంపుపై కాంగ్రెస్ సోమవారం ప్రధానమంత్రి మోదీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది. 'మెహంగాయ్ మానవ్' (డబ్బు కోసం బతికే మనిషి) మళ్లీ తన పని మొదలుపెట్టాడని, ఎన్నికల సమయంలో వాగ్దానాలు చేయడం, మిగతా సమయాల్లో ప్రజల జేబులపై దాడి చేయడం తప్ప ఆయనకు వేరే పని లేదని రాహుల్ గాంధీ ఆరోపించారు.

# రోడ్డెక్కిన ఉల్లిరైతులు


ప్రభుత్వ సేకరణ ధరలకు వ్యతిరేకంగా ఆందోళనలు
ముంబయి–ఆగ్రా జాతీయ రహదారి దిగ్బంధం



**నాసిక్ :** మహారాష్ట్రలో ఉల్లి రైతులు రోడ్డెక్కారు. ప్రభుత్వ సేకరణ ధరలకు నిరసనగా, ప్రతిపక్ష మహా వికాస్ అఘాడి (ఎంవిఎ) నాయకుల నేతృత్వంలో పలువురు ఉల్లి రైతులు మంగళవారం నాసిక్ జిల్లాలో రద్దీగా ఉండే ముంబయి–ఆగ్రా జాతీయ రహదారిని దిగ్బంధించి ఆందోళన చేపట్టారు. 'కాండా ఉత్పాదక్ షేత్కారి క్రాంతి మహా మోర్చా' చాంద్వాడ పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడంతో పోలీసులు జోక్యం చేసుకుని నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా కొందరు ఆందోళనకారులు రహదారిపై నిలిచిపోయిన వాహనాల టైర్లలో గాలి తీయడానికి ప్రయత్నించినట్లు సమాచారం. ఎన్‌సిపి(ఎస్‌పి) ఎమ్మెల్యే రోహిత్ పవార్, శివసేన (యుబిటి) నాయకుడు అంబాదాస్ దాన్వే, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు హర్షవర్ధన్ సప్కల్‌లతో కూడిన ప్రతిపక్ష నాయకులు ఎద్దుల బండిపై ర్యాలీకి నాయకత్వం వహించగా, పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. ఆందోళన సందర్భంగా పవార్ మాట్లాడుతూ 'ప్రభుత్వం ఉల్లిపాయలకు క్వింటాల్‌కు రూ.1,580 ధరను ప్రకటించింది. దీనిపై రైతులు అసంతృప్తిగా ఉన్నారు. వారికి కిలో ఉల్లిపాయలకు రూ.24 ధర లభించాలి. మా ఆందోళనకు ప్రభుత్వం భయపడుతోంది. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు బుధవారం ఢిల్లీ వెళ్తారు. ఏం జరుగుతుందో వేచి చూడాలి' అని అన్నారు. ఈ నిరసన సందర్భంగా ఆందోళన చేస్తున్న రైతులకు మెలోడీ టాఫీలను పంపిణీ చేశారు. 'ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవల ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోనికి మెలోడీ టాఫీలను బహుమతిగా ఇచ్చారు. దాని ఫలితంగా, పార్లే ఇండస్ట్రీస్ షేర్లు పెరిగాయి. ఆయన ఉల్లిపాయలను కూడా బహుమతిగా ఇవ్వాలి, అప్పుడు వాటి ధరలు కూడా ఆకాశాన్నంటతాయి' అని ఆందోళనకారులు అన్నారు. ఉల్లి రైతులు, ఉల్లిపాయకు రూ. 3,000 కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి), అమ్ముడుపోయిన పంటకు క్వింటాల్‌కు రూ. 1,500 సబ్సిడీ, ఎగుమతులపై నిషేధాన్ని ఎత్తివేయడం, నేషనల్ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (నాఫెడ్) ద్వారా ఉల్లిపాయల సేకరణలో జరుగుతున్న అవినీతిపై సమగ్రమైన, నిష్పక్షపాత విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో సప్కల్ మాట్లాడుతూ ఉల్లి రైతులు తమ పంటకు క్వింటాల్‌కు కేవలం రూ. 200–300 మాత్రమే పొందుతున్నారని ఆరోపించారు. రైతుల ప్రయోజనాలను కాపాడటంలో నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆయన ఆరోపించారు. ఉల్లిపాయల సేకరణను ప్రకటించినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు ప్రక్రియను ప్రారంభించలేదని ఆయన ఆరోపించారు. వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ కమిటీల ద్వారా మాత్రమే సేకరణ జరగాలని ఆయన డిమాండ్ చేశారు. ద్రవ్యోల్బణం కారణంగా రైతులకు తమ పంటకు హామీతో కూడిన ధరలు లభించకపోవడంతో వ్యవసాయం, జీవనోపాధి కష్టంగా మారాయని ఆయన అన్నారు. ఉల్లి రైతులకు హామీతో కూడిన ధర లభించే వరకు కాంగ్రెస్, ఎంవిఎ తమ ఆందోళనను కొనసాగిస్తాయని ఆయన స్పష్టం చేశారు.

# ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేదు

ఆర్‌బిఐ కేంద్రానికి బోనస్ ఇచ్చి ఆదుకుంటోంది : కాంగ్రెస్



**న్యూఢిల్లీ :** దేశ ఆర్థిక పరిస్థితిపై ప్రతిపక్ష కాంగ్రెస్ విరుచుకుపడింది. ప్రభుత్వానికి రికార్డు స్థాయిలో రూ. 2.87 లక్షల కోట్ల డివిడెండ్‌ను రిజర్వ్ బ్యాంక్ ప్రకటించడంతో, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని ఎంత గొప్పగా చిత్రీకరిస్తున్నారో అర్థమవుతోందని పేర్కొంది. వాస్తవానికి అది అంత ఆశాజనకంగా లేదని కాంగ్రెస్ మంగళవారం వ్యాఖ్యానించింది. ప్రభుత్వానికి ఆర్‌బిఐ ఒక ఉపకారం చేసి భారీ బోనస్‌ను అందించడమే ఇందుకు నిదర్శనమని ఆ పార్టీ పేర్కొంది. పశ్చిమ ఆసియాలో నెలకొన్న సంఘర్షణల కారణంగా దిగుమతి బిల్లులు పెరగడం, సరఫరా గొలుసులో అంతరాయాలు ఏర్పడటంతో ఖజానాకు ఆర్థిక చేయూతను అందించే ఉద్దేశంతో 2026 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను ప్రభుత్వానికి రూ. 2.87 లక్షల కోట్ల రికార్డు స్థాయి డివిడెండ్‌ను భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బిఐ) శుక్రవారం ప్రకటించింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో అందించిన రూ. 2.69 లక్షల కోట్ల డివిడెండ్‌తో పోలిస్తే, ఈసారి ప్రకటించిన మొత్తం 6.7 శాతం అధికం. 'కేంద్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని ఎంత గొప్పగా చూపిస్తున్నారో, వాస్తవానికి అది అంత ఆశాజనకంగా లేదనే విషయం... ఆర్‌బిఐ ప్రభుత్వానికి ఒక ఉపకారం చేసి, భారీ బోనస్‌ను అందించడం ద్వారా రుజువైంది.
వరుసగా మూడు ఆర్థిక సంవత్సరాల పాటు తాను నిర్వహించే 'ఆకస్మిక ప్రమాద నిధి' స్థాయిని పెంచుకుంటూ వచ్చిన ఆర్‌బిఐ, 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను ఆ నిధిని తగ్గించాలని నిర్ణయించుకుంది. ఈ నిర్ణయం ఫలితంగానే కేంద్ర ప్రభుత్వానికి లభించే డివిడేండ భారీగా పెరిగింది' అని ఎక్స్ పోస్ట్‌లో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆకస్మిక ప్రమాద నిధిని తగ్గించకపోయి ఉంటే ప్రభుత్వానికి ఎంత మొత్తం లభించేదో, దానికి అదనంగా మరో రూ. 92,000 కోట్లు కేంద్ర ప్రభుత్వానికి అదనపు వరంగా లభించాయని రమేశ్ పేర్కొన్నారు. ప్రమాద నిధుల కేటాయింపులు, చట్టబద్ధమైన నిధులకు బదిలీలు చేయడానికి ముందు, 2026 ఆర్థిక సంవత్సరంలో తమ నికర ఆదాయం రూ. 3.96 లక్షల కోట్లకు చేరిందని, అంతకు ముందు ఆర్థిక సంవత్సరం (2025)లో ఈ మొత్తం రూ. 3.13 లక్షల కోట్లుగా ఉందని ఒక ప్రకటనలో ఆర్‌బిఐ తెలిపింది.

# మరో ఎఐఎడిఎంకె తిరుగుబాటు ఎమ్మెల్యే రాజీనామా

**చెన్నై :** తమిళనాడులో శాసనసభ్యుల రాజీనామాలు కొనసాగుతున్నాయి. ఎఐఎడిఎంకె తిరుగుబాటు వర్గానికి చెందిన మరో ఎమ్మెల్యే మంగళవారం తమిళనాడు అసెంబ్లీకి రాజీనామా చేశారు. దీంతో 234 మంది సభ్యులున్న సభలో ప్రతిపక్ష పార్టీ బలం 47 నుంచి 43కి తగ్గింది. ఈనెల 25న రాజీనామా చేసిన ముగ్గురు ఎఐఎడిఎంకె శాసనసభ్యుల రాజీనామాలను ఆమోదించవద్దని కోరుతూ ఎఐఎడిఎంకె అధినేత ఎడప్పాడి కె పళనిస్వామి నేతృత్వంలోని వర్గం స్పీకర్ జెసిడి ప్రభాకర్‌ను కలిసింది. ఆ కొద్దిసేపటికే అంబాసముద్రం ఎమ్మెల్యే ఈశాకి సుబ్బయ్య స్పీకర్‌ను కలిసి తన రాజీనామా లేఖను సమర్పించడం గమనార్హం. సుబ్బయ్య రాజీనామాను ఆమోదించినట్లు ప్రభాకర్ ప్రకటించారు.

# యుపిలో బూటకపు ఎన్‌కౌంటర్లు

తన మద్దతుదారుల ప్రసన్నం కోసం బిజెపి సర్కార్ వాడుకుంటోంది : అఖిలేశ్ యాదవ్



**లక్నో :** ఉత్తరప్రదేశ్‌లో బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ (ఎస్‌పి) అఖిలేశ్ యాదవ్ ఆరోపించారు. ఉత్తరప్రదేశ్‌లోని బిజెపి ప్రభుత్వం తమ మద్దతుదారులను ప్రసన్నం చేసుకోవడానికి 'బూటకపు ఎన్‌కౌంటర్లను' ఉపయోగిస్తోందని, తద్వారా వారిని 'మానసికంగా హింసాత్మకంగా' మారుస్తోందని, పోలీసు అధికారులను నేరస్థులుగా మారుస్తోందన్నారు. మంగళవారం లక్నోలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసం బూటకపు ఎన్‌కౌంటర్లను నడిపిస్తోందని, ఇటువంటి చర్యల ద్వారా అధికార స్థాయిలో ఒక పూర్తి నేర వ్యవస్థను సృష్టించిందని మాజీ ముఖ్యమంత్రి ఆరోపించారు. బూటకపు ఎన్‌కౌంటర్లు దేశ సంస్కృతికి, రాజ్యాంగానికి, ఆరోగ్యకరమైన సామాజిక ఆలోచనా విధానానికి సవాలుగా మారాయని యాదవ్ అన్నారు. 'యుపిలోని ప్రభుత్వం ఎన్‌కౌంటర్ల నెపంతో పిడిఎ (వెనుకబడిన వర్గాలు, దళితులు మరియు మైనారిటీలు)ను భయపెట్టి, వారి హక్కులను హరించాలని చూస్తోంది. ప్రభుత్వం కుల, మత ప్రాతిపదికన ఎన్‌కౌంటర్లు నిర్వహిస్తోంది, ఇది రాష్ట్రంలో సామాజిక సామరస్యాన్ని దెబ్బతీస్తోంది. బూటకపు ఎన్‌కౌంటర్లు విఫలమైన ప్రభుత్వానికి చిహ్నమని, బిజెపి ప్రభుత్వం ఇటువంటి ఘటనల ద్వారా ప్రజలపై మానసిక ఒత్తిడిని సృష్టించడానికి ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. బూటకపు ఎన్‌కౌంటర్లను సమర్థించే ప్రయత్నాల వెనుక ఉన్న మనస్తత్వాన్ని వివరిస్తూ, ప్రజల 'మానసిక సాఫ్ట్‌వేర్‌ను' 'అప్‌డేట్ లేదా అప్‌గ్రేడ్ చేయడానికి కాకుండా, దానిని 'పాతబడిపోయేలా, దిగజారిపోయేలా' చేయడానికి ఇటువంటి సంఘటనలను ఉపయోగిస్తారని అన్నారు. ఈ ప్రక్రియ సమాజాన్ని హింసతో నింపుతుందని, హత్యలను సమర్థిస్తుందని, 'బలమే హక్కు' అని నమ్మే తిరోగమన మనస్తత్వాన్ని పునరుజ్జీవింపజేస్తుందని ఆయన ఆరోపించారు. 'బూటకపు ఎన్‌కౌంటర్లు ప్రజాస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా జరుగుతున్న ఒక పెద్ద కుట్ర. ఇవి రాజ్యాంగంలో పొందుపరచబడిన న్యాయ పాలనను, సామాజిక న్యాయాన్ని తిరస్కరిస్తాయి' అని ఆయన అన్నారు. బిజెపి ప్రభుత్వం తన మద్దతుదారులను సంతృప్తి పరచడానికి బూటకపు ఎన్‌కౌంటర్లను ఉపయోగించడమే కాకుండా, రాజకీయ అధికారాన్ని నిలబెట్టుకోవడానికి వారిని మానసికంగా హింసాత్మకంగా మార్చి, ద్వేషంతో నింపుతోందని ఎస్‌పి అధినేత ఆరోపించారు. బిజెపి తన సొంత ప్రజలకు కూడా హాని చేస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. బూటకపు ఎన్‌కౌంటరు శాంతిభద్రతలను బలోపేతం చేయడానికి బదులుగా బలహీనపరుస్తాయని, ఎందుకంటే అవి పోలీసు బలగంలో అవినీతిని ప్రోత్సహిస్తాయని యాదవ్ ఆరోపించారు. బూటకపు ఎన్‌కౌంటర్లలో పాల్గొన్న పోలీసు సిబ్బంది దొరికిపోయినప్పుడు, బిజెపి ప్రభుత్వం వారికి దూరంగా ఉంటుందని, వారి కుటుంబాలు సామాజిక అవమానాన్ని ఎదుర్కొంటాయని, ప్రజలు వారిని సామాజిక ఎన్‌కౌంటర్‌కు గురిచేస్తారన్నారు. అటువంటి సంఘటనలలో భాగం కావద్దని ఆయన పోలీసు సిబ్బందికి సలహా ఇచ్చారు. ప్రభుత్వం వారిని అధికారుల నుండి నేరస్థులుగా మార్చి తన స్వప్రయోజనాల కోసం వాడుకుంటోందని ఆరోపించారు.

# గెంటివేయకముందే పారిపోండి..

అక్రమ వలసదారులకు బెంగాల్ సిఎం వార్నింగ్



**కోల్‌కతా :** బెంగాల్‌లోని బంగ్లాదేశీ అక్రమ వలసదారులను బెంగాల్ నుంచి వెళ్లగొట్టకముందే పారిపోవాలని ముఖ్యమంత్రి సువేందు అధికారి సూచించారు. రాష్ట్ర ప్రజలు స్వచ్ఛందంగా వెళ్లకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న విదేశీయుల చట్టానికి లోబడే తాము ఈ చర్యలు తీసుకుంటున్నట్లు బెంగాల్ సిఎం చెప్పారు. భారత్ నుంచి తమ పౌరులను తిరిగి స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నట్లు బంగ్లాదేశ్ ఇప్పటికే చెప్పిందని, వారిని తిరిగి తీసుకువెళ్లడం అక్కడి ప్రభుత్వ బాధ్యత అని సువేందు అన్నారు. చొరబాటుదారులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని జైల్లో పెట్టొద్దని పోలీసులను ఆదేశించినట్లు తెలిపారు. వారికి ఆశ్రయమిచ్చి, తిండి పెట్టడానికి వారేమైనా మన బంధువులా అని ప్రశ్నించారు. బెంగాల్ ప్రభుత్వం 'గుర్తించండి, తొలగించండి, బహిష్కరించండి' అనే నినాదంతో విదేశీయులను దేశం నుంచి పంపేయడానికి చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే అక్రమంగా రాష్ట్రంలోకి చొరబడినట్లు గుర్తించిన వారికి, సరైన పత్రాలు లేని వారికి తాత్కాలికంగా ఆశ్రయం కల్పించడానికి నిర్బంధ కేంద్రాలు ఏర్పాటు చేస్తోంది. మాల్దాలో తొలి నిర్బంధ కేంద్రాన్ని ప్రారంభించినట్లు అధికారులు వెల్లడించారు. త్వరలో మరిన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కాగా, అక్రమంగా రాష్ట్రంలోకి వలస వచ్చిన వారిపై బెంగాల్ ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేయడంతో బంగ్లాదేశీయులు తమ స్వదేశానికి పయనమవుతున్నారు. మంగళవారం ఉదయం ఉత్తర 24 పరగణాల జిల్లాలోని హకీంపుర్ సరిహద్దు ప్రాంతంలో పదుల సంఖ్యలో బంగ్లాదేశీయులు గుమిగూడినట్లు అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలో 'సర్' ప్రక్రియ చేపట్టిన సమయంలో కూడా ఈ సరిహద్దు నుంచి వందల సంఖ్యలో బంగ్లాదేశీయులు తమ దేశానికి వెళ్లినట్లు తెలిపారు.

# 10.51 లక్షలమందితో హజ్ సందడి ప్రారంభం

- యాత్రికులకోసం సౌదీ ఎయిర్ డిఫెన్స్ బ్యాటరీలు



**రియాద్:** పశ్చిమాసియాలో యు ద్ధవాతావరణాన్ని హాజ్ యాత్రికులు ఎంత మాత్రం లెక్కచేయలేదు. మొదటి రోజు 10.51 లక్షలమంది హజ్ యాత్రి కుల రాకతో సౌదీ అరేబియాలో సందడి ప్రారంభమైంది. యాత్రికులు మొదటి రోజు తీవ్రస్థాయిలో45 డిగ్రీల సెంటీగ్రేడ్స్ ఉష్ణోగ్రతను చవిచూశారు. ఇరాన్–అమెరికా మధ్య ఒక శాంతి ఒప్పందం కుదురుతుందని ఈజిప్టు నుండి వెళ్ళిన హాజ్ యాత్రికుడు మహ్మద్ చహాదా (50) మీడియా వద్ద ఆశాభావం వ్యక్తం చేశాడు. అదేవిధంగా ఈ ఏడాది మక్కాను సందర్శించే యాత్రికులకు ఇరాన్ దాడులవల్ల ఎలాంటి హానీ కలగకుండా ఉండేందుకు ఎయిర్ డిఫెన్స్ బ్యాటరీలతో రక్షణ బందోబస్తును ప్రభుత్వం ఏర్పాటు చేసింది.ఈ డిఫెన్స్ ఏర్పాట్లుకు సంబంధించిన ఒక వీడియోను యాత్రికులకోసం సోషల్ మీడియాలో సౌదీఅరేబియా పోస్టు చేసింది. గత ఏడాది కంటే ఆరంభంలో ఈ సారి 11,000 మంది యాత్రికులు ఎక్కువగా వచ్చారని, యుద్ధం గురించి యాత్రికులు ఎలాంటి భయాలు వ్యక్తం చేయలేదని సౌదీ ప్రభుత్వం పేర్కొంది. మళ్ళీ యుద్ధం మొదలవుతుందని ఒకవైపు వార్తలు వస్తున్నప్పటికీ యాత్రికులు ఎంతమాత్రం భయపడకుండా మక్కాకు వెళ్ళడం ప్రారంభించారు. ఏప్రిల్‌నెలలో అమెరికా–ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చిన తర్వాత కొంత ప్రశాంతత ఏర్పడింది. అంతకుముందు ఇరాన్ డ్రోన్లు, క్షిపణి దాడులతో సౌదీ అరేబియా అతలాకుతలమైంది. గల్ఫ్‌లోని ఇతర దేశాల మౌలిక సదుపాయాలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయి. మార్చి ఎనిమిదో తేదీన అల్–ఖార్జ్ సెంట్రల్ సిటీలో ఇరాన్ చేసిన దాడుల్లో ఇద్దరు పౌరులు మరణించారు. ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్ బేస్‌పై కూడా ఇరాన్ దాడులు చేసింది. ఈ పరిస్థితుల్లో సౌదీ ప్రభుత్వం ఎయిర్ డిఫెన్స్ బ్యాటరీ వ్యవస్థను ఏర్పాటు చేసింది. మక్కా గగనతల వీధులను ఈ ఎయిర్ డిఫెన్స్ బ్యాటరీలు కాపాడతాయి.
ఇరాన్‌లో యుద్ధం వల్ల యావత్ ప్రపంచం ప్రభావితమైంది. యుద్ధాలు ప్రజలకు మేలు చేయవు, ప్రజలకు హాని జరుగుతుంది, యుద్ధాన్ని ఎవరూ కోరు కోరు, నెలల తరబడి అనిశ్చితి, విపరీతగా పెరిగిన విమాన ప్రయాణం ఖర్చులు, విమానాల రాకపోకలు నిలిచిపోవడం వంటి అనేక అంతరాలను దాటుకుని, అధిగమించి ఎట్టకేలకు తాము మక్కాకు చేరుకున్నామని యాత్రికులు తమ మొదటిరోజు అనుభవాలను మీడియాకు చెప్పారు. ప్రపంచంలో ప్రతి ముస్లిం కూడా తన జీవితంలో ఏదో ఒకసారి మక్కాకు వెళ్ళిరావాలని కోరుకుంటారని, అందుకే తాను వచ్చానని మొరాకో దేశానికి చెందిన 68 ఏళ్ళ వృద్ధుడు డ్రైష్ మహ్మద్ చెప్పారు. ఇస్లాంకు ఉన్న ఐదు మూల స్తంభాలలో హాజ్ యాత్ర ఒకటి అని, ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం (చాంద్రమాన క్యాలెండర్) 12 నెలల్లో ఈ యాత్ర జరుగుతుంది. ప్రతి ముస్లిం మక్కాలోని గ్రాండ్ మసీదుకు వెళ్ళి ఘనాకారంలో ఉన్న కాబా చుట్టూ ఏడు సార్లు ప్రదక్షిణలు చేస్తాడు. దీనిని తవాఫ్ అంటారు. ఆ తర్వాత మహ్మద్ ప్రవక్త చిట్ట చివరి ఉపన్యాసం చేశాడని చెబుతున్న అరఫా పర్వతాన్ని యాత్రికులు సందర్శిస్తారు.


# టివికె, డిఎంకె కార్యకర్తల మధ్య ఘర్షణ



**పెరంబలూరు :** తమిళనాడులో టివికె, డిఎంకె కార్యకర్తలకు మధ్య ఘర్షణ చెలరేగింది. మంగళవారం పెరంబలూరులోని కున్నం బస్‌స్టాండ వద్ద విసికె, టిఎంకె పార్టీల మద్దతుదారులు వేర్వేరుగా నిరసనలు చేపట్టేందుకు భారీ సంఖ్యలో గుమిగూడగా, ఆ పార్టీల సభ్యులు ఘర్షణకు దిగి, ఒకరిపై ఒకరు రాళ్లు విసురుకున్నారు. ప్రజా శాంతిభద్రతలకు భంగం వాటిల్లుతుందనే ఆందోళనతో పోలీసులు మొదట రెండు పార్టీలకు నిరసనలు చేపట్టేందుకు అనుమతి నిరాకరించినప్పటికీ, సభ్యులు లెక్కచేయకుండా బస్‌స్టాండ సమీపంలో గుమిగూడారు. కొత్తగా ఏర్పడిన టివికె నేతృత్వంలోని ప్రభుత్వంలో చేరిన విడుతలై చిరుతైగళ్ కచ్చికి, దాని మాజీ మిత్రపక్షమైన ద్రవిడ మున్నేట్ర కజగానికి మధ్య తీవ్ర ఘర్షణ చెలరేగింది. ఈ ఘర్షణలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఘర్షణ పడుతున్న సభ్యులను విడదీసి, వారిని అక్కడి నుంచి చెదరగొట్టడానికి పోలీసులు జోక్యం చేసుకున్నారని ఒక సీనియర్ అధికారి తెలిపారు. రెండు పార్టీల సభ్యులు ఒకరిపై ఒకరు రాళ్లు విసురుకున్నారని, కొందరు శారీరక ఘర్షణలకు దిగడంతో ఉద్రిక్తత పెరిగిందని ఆ అధికారి తెలిపారు. ప్రభుత్వ ఏర్పాటు సమయంలో తొలుత టివికెకు మద్దతు తెలిపిన విసికె, ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ నేతృత్వంలోని మంత్రివర్గంలో చేరినప్పటి నుండి ఈ రెండు పార్టీల మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. డిఎంకె ఉప ప్రధాన కార్యదర్శి ఎ. రాజా, విసికెను విమర్శిస్తూ, అది పెరట్లో వంగిపోయి, తన లేత కొబ్బరికాయలను ఇంటికి కాకుండా ఇరుగుపొరుగు వారికి ఇచ్చే ఒక కొబ్బరి చెట్టు లాంటిదని అన్నారు. హింసాకాండ మధ్య, రాజా తన పార్టీ సభ్యులను మరిన్ని ఘర్షణలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. 'నిర్మాణాత్మక చర్చ ప్రజాస్వామ్యానికి రక్షణ కవచం. ఘర్షణలు, కొట్లాటలు ప్రజాస్వామ్యానికి వ్యతిరేకం మాత్రమే కాదు, అవి అవివేకం కూడా. మన నాయకుడు ఎం. కరుణానిధి ఎల్లప్పుడూ నొక్కిచెప్పినట్లుగా, మనం హింసను నివారించి, పేదరికాన్ని అధిగమిద్దాం' అని ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# మోదీకి నేను 'పెద్ద అభిమానిని'

ప్రధానిపై ట్రంప్ మరోసారి ప్రశంసల జల్లు



**న్యూఢిల్లీ :** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై మరోసారి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రశంసల జల్లు కురిపించారు. ప్రధాని మోదీకి తాను పెద్ద అభిమానిని అన్నారు. అమెరికాపై భారత్ పూర్తిగా ఆధారపడవచ్చని ట్రంప్ అభిప్రాయపడ్డారు. భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ చేసిన ఒక సోషల్ మీడియా పోస్ట్‌ను ఆయన రీట్వీట్ చేశారు. దీంతో పాటు ఢిల్లీలోని ప్రతిష్టాత్మక భారత్ మండపంలో జరిగిన అమెరికా స్వాతంత్ర్య 250వ వార్షికోత్సవ వేడుకలకు సంబంధించిన ఒక వీడియో క్లిప్‌ను కూడా జతచేశారు. అమెరికా అధ్యక్షుడి ట్రంప్ వ్యక్తిగత సందేశం వివరాలను 'ట్రూత్ సోషల్'లో పంచుకున్నారు. ఇందులో 'అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నాకు ఫోన్ చేశారు. ఆయన ఒక స్పష్టమైన సందేశం ఇచ్చారు. 'నేను ప్రధానమంత్రి మోదీని ప్రేమిస్తున్నాను. మనం భారతదేశానికి ఇంతకంటే దగ్గరగా ఎప్పుడూ లేము. నేను ప్రధానమంత్రి మోదీకి పెద్ద అభిమానిని' అని ట్రంప్ చెప్పి'నట్లు గోర్ పేర్కొన్నారు. భారత్ మండపంలో జరిగిన అమెరికా స్వాతంత్ర్య 250వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా ట్రంప్ ఫోన్ సందేశాన్ని కొత్తగా నియమితులైన అమెరికా రాయబారి వినిపించారు. 'అందరికీ నమస్కారం. నేను ప్రధానమంత్రిని ప్రేమిస్తున్నాను. నరేంద్ర మోదీ గొప్పవారు, ఆయన నా స్నేహితుడు. నేను ప్రధానమంత్రి మోదీకి పెద్ద అభిమానిని. మనం భారతదేశానికి ఇంతకంటే దగ్గరగా ఎప్పుడూ లేము. భారతదేశం నాపై, మన దేశంపై 100 శాతం ఆధారపడవచ్చు. వారికి ఎప్పుడైనా సహాయం అవసరమైతే, ఎక్కడికి ఫోన్ చేయాలో వారికి తెలుసు. వారు సరిగ్గా ఇక్కడికే ఫోన్ చేస్తారు. ప్రధానమంత్రి మోదీకి నమస్కారం. నేను మీ పెద్ద అభిమానినని ఆయనకు తెలపండి' అంటూ ట్రంప్ తన టెలిఫోన్ ప్రసంగాన్ని ముగించారు. ఈ కార్యక్రమానికి హాజరైన తన రాయబారులను ట్రంప్ ప్రశంసించారు. మార్కో రూబియోను అమెరికా చరిత్రలోనే గొప్ప విదేశాంగ మంత్రిగా అభివర్ణించారు. భారత్ మండపంలో జరిగిన కార్యక్రమానికి భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, భారత్‌లో అమెరికా రాయబారి గోర్‌తో పాటు పలువురు దౌత్యవేత్తలు పాల్గొన్నారు.

# ఇరాన్‌లో అమెరికా దాడులు

నలుగురు గార్డులు మృతి?
ఆత్మరక్షణకోసమేనని సెంట్రల్ కమాండ్ ప్రకటన



**వాషింగ్టన్ :** దక్షిణ ఇరాన్‌తో చర్చలు సజావుగా జరుగుతున్నాయని ఒకవైపు ట్రంప్ చెబుతున్నప్పటికీ, దక్షిణ ఇరాన్‌లో ఆత్మరక్షణ దాడులు చేసినట్లు అమెరికా సైన్యం మంగళవారం ప్రకటించింది. ఇరాన్ క్షిపణి ప్రయోగ స్థావరాలపైన, మందుపాతరలు అమర్చేందు ప్రయత్నం చేస్తున్న పడవలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు చేసినట్లు పేర్కొంది. ఇరాన్ బలగాల నుండి ఎదురవుతున్న ముప్పును ప్రతిఘటించేందుకు కాల్పుల విరమణ ఒప్పందం అమలులో ఉన్న ఈ తరుణంలో ఎంతో సంయమనం పాటిస్తూ ఆత్మరక్షణ చర్యలో భాగంగా సైనికులను కాపాడుకునేందుకు దాడులు చేసినట్లు అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రతినిధి కెప్టెన్ టిమ్ హాకిన్స్ ప్రకటించారు. ఈ పరిణామాలపై అమెరికా విదేశీ వ్యవహారాల మంత్రి మార్కో రుబియో స్పందిస్తూ, ఇరాన్‌తో ఒక ఒప్పందం చేసుకోవడం ఇప్పటికీ సాధ్యమేనని అన్నారు. హోర్ముజ్ జలసంధిని తెరపించేందుకు తమ ఒత్తిడిని కొనసాగిస్తామన్నారు. శాంతియుతమైన చర్చలు కొనసాగిస్తామన్నారు. ఐతే ఇరాన్ అనుకూల తబ్నాక్ అనే వార్తా వెబసైట్ చెప్పిన సమాచారం ప్రకారం, ఇరాన్ పడవలపై అమెరికా దాడులు చేసినప్పుడు నలుగురు రివల్యూషనరీ గార్డులు మరణించారు. ఐతే ఈ విషయాన్ని అటు ఇరాన్‌గానీ, ఇటు అమెరికాగానీ అధికారికంగా ప్రకటించలేదు. అదేవిధంగా హోర్ముజ్ జలసంధిలో ఉన్న బందర్ అబ్బాస్ నగరం చుట్టూ పేలుళ్ళు సంభవించినట్లు ఇరాన్ అధికారిక టెలివిజన్ కూడా ఒక వార్త ప్రసారం చేసింది. ఈ నగరంలో ఒక ఓడరేవు, రెండు ప్రయోజనాలకోసం ఉపయోగపడే విమానాశ్రయం ఉన్నాయి. ఇదిలా ఉండగా, దక్షిణ ఇరాన్‌లో అమెరికా సైన్యం దాడులను ఇరాన్ చాలా తీవ్రంగా పరిగణించింది. అమెరికా కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ఇరాన్ విదేశీమంత్రిత్వశాఖ ప్రకటించింది. అమెరికా సైన్యం చర్యలను తీవ్రంగా ఖండించింది. ఎదురుదాడులు చేస్తామని హెచ్చరిక చేసింది. హోర్ముజ్ జలసంధి సమీపంలో ఉన్న ఇరాన్ హోర్ముజ్‌గాన్ రాష్ట్రంలో మంగళవారం తెల్లవారకముందే దాడులు జరిపి అమెరికా కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ఇరాన్ మండిపడింది. భారత కాలమానం ప్రకారం మంగళవారం తెల్లవారుజామున మందుపాతరలు అమర్చేందుకు కొన్ని పడవలు ప్రయత్నం చేస్తున్నాయని, ఈ పడవలను నిరోధించేందుకు సైన్యం ఆత్మరక్షణకోసం దాడులు చేశామని సెంట్‌కామ్ ప్రకటించింది. ఐతే గడచిన 48 గంటల్లో హోర్ముజ్‌గాన్ ప్రాంతంలో అమెరికా కాల్పుల విరమణ ఒప్పందాన్ని తీవ్రంగా ఉల్లంఘించిందని, దీనికి ఆ దేశమే పూర్తి బాధ్యత వహించాలని ఇరాన్ పేర్కొంది. తదుపరి వివరాలు వెంటనే తెలియరాలేదు. ఈ దాడులు చర్చలపై ఎలాంటి ప్రభావం చూపిస్తాయన్న విషయంపై కూడా స్పష్టత లేదు. అంగీకారం కుదిరినాగానీ వెంటనే ఒప్పందంపై సంతకాలు సాధ్యం కాదని, అమెరికా మాట మారుస్తోందని ఇరాన్ ఆరోపించగా, ఒప్పందం చేసుకోవడానికి తాము ఆత్రంగా లేమని ట్రంప్ ప్రకటించారు. ఒక మేలైన ఒప్పందమే చేసుకుంటామని, లేకపోతే అసలు ఒప్పందమే ఉండదని ట్రంప్ అంటున్నారు. ఈ గందరగోళం మధ్య అమెరికా సైన్యం దాడులు జరిగాయి.

# భవిష్యత్‌ను ఉమ్మడిగా నిర్మించుకుందాం

జిన్‌పింగ్‌– షెహబాజ్ షరీఫ్ అంగీకారం
వ్యూహాత్మక సహకార భాగస్వామ్య విస్తరణ
చైనా–పాకిస్థాన్ సంయుక్త ప్రకటన



**ఇస్లామాబాద్ :** నూతనశకంలో పాకిస్థాన్–చైనా ఉమ్మడిగా తమ భవిష్యత్తును వేగంగా నిర్మించుకుని సంబంధాలను పటిష్టం చేసుకోవాలని అంగీకారానికి వచ్చాయి. ''ఒకే చైనా'' సూత్రానికి పాకిస్థాన్ తన బలమైన నిబద్ధత ప్రకటించింది. జాతీయ పునరేకీకరణ సాధించడానికి చైనా చేసే ప్రయత్నాలకు పూర్తి మద్దతు ఇస్తుంది. తైవాన్ స్వాతంత్య్రాన్ని ఏ రూపంలోనైనా దృఢంగా వ్యతిరేకిస్తామని భరోసా ఇచ్చింది. పశ్చిమాసియాలో శాంతి–స్థిరత్వం పరిరక్షణకు చైనా అధ్యక్షుడు చేసిన నాలుగు ప్రతిపాదనలకు మద్దతు ప్రకటించింది. అదేవిధంగా పాకిస్థాన్ జాతీయ సార్వభౌమాధికారాన్ని, స్వాతంత్య్రాన్ని, ప్రాదేశిక సమగ్రతను కాపాడుకోవడానికి చైనా తన అచంచలమైన మద్దతు పునరుద్ఘాటించింది. ఉగ్రవాదాన్ని వ్యతిరేకంగా పాకిస్థాన్ చేస్తున్న పోరాటానికి చైనా తన మద్దతు ప్రకటించింది. ఉగ్రవాదాన్ని నిరోధించడానికి సహకారాన్ని పెంపొందించాలని ఇరు దేశాలూ అంతర్జాతీయ సమాజానికి పిలుపు ఇచ్చాయి. అదేవిధంగా పాకిస్థాన్ జాతీయ భద్రత, స్థిరత్వం,అభివృద్ధి,శ్రేయస్సుకోసం చేసే ప్రయత్నాలకు చైనా గట్టి మద్దతు ఇస్తుంది. పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ చైనా పర్యటన సందర్భంగా ఆ దేశాధ్యక్షుడు జీ జిన్‌పింగ్,ప్రధాన మంత్రి లీ క్వియాంగ్‌లతో వేర్వేరుగా సమావేశమై ద్వైపాక్షిక సంబంధాలను భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విస్తరించుకోవాలని అంగీకరించారు.

భవిష్యత్ నిర్మాణానికి ఉమ్మడిగా,చాలా సన్నిహితంగా కలిసి పనిచేయాలని వారు నిర్ణయించారు. ఇరుపక్షాలు వివిధ రంగాలలో సహకార ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశాయి. షరీఫ్ నాలుగురోజుల చైనా పర్యటన మంగళవారంతో ముగిసింది. ఈ మేరకు రెండు దేశాల నుండి సంయుక్త ఉమ్మడి ప్రకటన వెలువడింది. చైనా ప్రధానమంత్రి లీ క్వియాంగ్ ఆహ్వానం మేరకు మే 23 నుండి 26వ తేదీ వరకూ షెహబాజ్ షరీఫ్ చైనాలో పర్యటించారు. నాయకులతో ముఖాముఖీ సమావేశం సందర్భంగా విస్తారంగా పలు అంశాలలో షరీఫ్ ఏకాభిప్రాయానికి వచ్చారు. అన్ని రంగాలలోనూ, ఎల్లవేళలా రెండు దేశాలూ వ్యూహాత్మక,సహకార భాగస్వామ్యాన్ని విస్తరించుకోవాలని, అంతర్జాతీయ జాతీయ ప్రాంతీయ స్థాయిలో ఆసక్తికరమైన అంశాలలో సమన్వయం పరస్పర ప్రయోజనాలను కలిసి పంచుకోవాలని నాయకులు నిర్ణయించుకున్నారు. రెండు దేశాలమధ్యా దౌత్య సంబంధాలు విస్తరించి 75 సంవత్సరాలు పూర్తయ్యాయి, మన రెండు దేశాలమధ్యా మైత్రీబంధం చెక్కు చెదరకుండా బలమైన ప్రకృతి శిలలా పరీక్షకు తట్టుకుని నిలబడింది, అంతర్జాతీయ,జాతీయ పరిస్థితుల్లో ఈ మైత్రి బలంగా అల్లుకుపోయింది, అంతర్జాతీయ,జాతీయ పరిస్థితులతో సంబంధం లేకుండా రెండు దేశాలమధ్యా విశ్వసనీయత కొనసాగుతోంది, గౌరవం,మద్దతు రెండువైపులా కష్టకాలంలో కొనసాగుతోందని'' అని షరీఫ్ పర్యటన చివరిరోజున సంయుక్త ప్రకటన పేర్కొంది. నాల్గవైన బెల్ట్ అండ్ రోడ్ పథకాన్ని, కారం కోరం హై వే ప్రాజెక్టు పునర్వ్యవస్థీకరణ ప్రాజెక్టులను దశలవారీగా ముందుకు తీసుకువెళ్ళడానికి రెండు దేశాలూ అంగీకరించాయి.

# ఉక్రేన్‌పై క్రమపద్ధతిలో దాడులు చేస్తాం.. మీరెళ్ళిపోండి

విదేశీ దౌత్యవేత్తలకు రష్యా హెచ్చరిక * 100 డ్రోన్లతో దాడి
మేం ఎక్కడికీ వెళ్ళం * ఇయు దౌత్యవేత్త తిరస్కృతి




**మాస్కో :** ఉక్రేన్‌పై క్రమపద్ధతిలో ఇక మీదట దాడులు చేస్తామని రష్యా ప్రకటించింది. ఉక్రేన్‌లో ఉన్న విదేశీయులు,దౌత్యవేత్తలు,విదేశీ సహాయ సంస్థలు,ఇతర యంత్రాంగాలలో పనిచేసేవారంతా దేశం వదిలివెళ్ళిపోవాలని, దాడులలో ఏదైనా జరిగితే బాధ్యత వహించబోమని ముందస్తు హెచ్చరిక జారీ చేసింది. గడచిన వారం రోజుల్లో ఉక్రేన్ చేసిన దాడుల్లో 50 మంది రష్యన్ పౌరులు మరణించారని, మరో 200 మంది తీవ్రంగా గాయపడ్డారని రష్యా విదేశీమంత్రిత్వశాఖ దౌత్యవేత్త రోడియన్ మిరోష్నిక్ చెప్పారు. రష్యా మారుమూల ప్రాంతాలలో వారు మందుపాతరలు అమరుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల మధ్య మంగళవారం తెల్లవారకముందే రష్యా 100కు పైగా డ్రోన్లు, రెండు బాలిస్టిక్ క్షిపణులతో దాడి చేసినట్లు మిరోష్నిక్ చెప్పారు. 2022లో ఉక్రేన్‌పై పూర్తిస్థాయిలో యుద్ధం ప్రారంభించిన తర్వాత మళ్ళీ మొదటిసారి మే 24న రష్యా తీవ్రస్థాయిలో కీవ్‌పై విరుచుకుపడింది. రష్యా ఆక్రమిత లుగాన్స్క్ ప్రాంతంలో ఒక ఒకేషనల్ స్కూలుపై ఉక్రేన్ డ్రోన్లు,క్షిపణులు దాడులు చేయడతో 21 మంది మరణించారు. దీనితో పుతిన్ ఆదేశాల మేరకు రష్యా సైన్యం భారీ స్థాయిలో ఎదురుదాడులకు దిగింది. రాజధాని కీవ్‌లో సైనిక,పారిశ్రామిక ఉత్పత్తి కేంద్రాలు, ఇతర నిర్ణయాత్మక ప్రాంతాలపైన క్రమ పద్ధతిలో దాడులు చేస్తామని, విదేశీయులు నగరం వదిలివెళ్ళిపోవాలని రష్యా ప్రకటించింది. రష్యా విదేశీ వ్యవహారాల మంత్రి సెర్గీ లావ్రోవ్ అమెరికా విదేశీమంత్రి మార్కో రుబియోతో సోమవారం ఫోన్ సంభాషణ చేశారు. కీవ్ నగరం నుండి అమెరికా దౌత్యవేత్తలను ఖాళీ చేయించాలని కోరారు. కాగా గడచిన ఇరవైనాలుగు గంటలలో రెండు దేశాలమధ్యా డ్రోన్లు, క్షిపణి దాడులు జరిగాయి.

ఈ దాడుల్లో ఎనిమిదిమంది ప్రాణాలు కోల్పోయారు. ఈ పరిస్థితుల్లో రష్యా చేసిన హెచ్చరికపై యూరోపియన్ యూనియన్‌కు చెందిన దౌత్యవేత్త కటారినా మాథెర్నోవా తీవ్రగా స్పదించారు. రష్యా మళ్ళీ విదేశీయులను, దౌత్యవేత్తలను బెదిరిస్తోందని, తాము ఉక్రేన్ వదిలి ఎక్కడికీ వెళ్ళేదిలేదని ఆమె సోషల్ మీడియా వేదికగా పోస్టింగ్ పెట్టారు. రష్యా బెదిరింపులు ఆ దేశ కపటత్వానికి పెద్ద ఉదాహరణగా ఉన్నాయని విమర్శించారు. భయం సృష్టించడం ద్వారా ఉక్రేన్‌ను ఏకాకిని చేయాలనే రష్యా ప్రయత్నం ఎప్పటికీ ఫలించబోదని ఆమె ఎదురు హెచ్చరిక చేశారు. ఉక్రేన్ భయపడాలని రష్యా కోరుకుంటోందని, తాము ఎక్కడికీ వెళ్ళేదిలేదని ఆమె పేర్కొన్నారు. దౌత్యవేత్తలకు బెదిరింపులు బలానికి ప్రతీక కాదని, నిస్సహాయతకు ప్రతిబింబమని అన్నారు. అదేవిధంగా ఫ్రెంచ్,పోలెండ్ దేశాల ప్రతినిధులు కూడా బాహాటంగానే తాము ఉక్రేన్‌ను వదిలివెళ్ళేది లేదని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా ఉక్రేన్ వద్ద క్షిపణుల కొరత ఉందని ఆ దేశాధ్యక్షుడు జెలెన్స్కీ అమెరికాకు చెప్పారు. ఉక్రేన్‌కు బాలిస్టిక్ క్షిపణులు అవసరం ఉందని చెప్పారు. సొంతంగా తన సామర్థ్యం పెంచుకునే ప్రయత్నంచ ఏస్తున్నామన్నారు. ఇటీవలికాలంలో ఉక్రేన్ ఆయుధపరంగా కొంత ప్రయోజనం పొందింది.

# ప్రపంచ పరిస్థితి క్లిష్టంగా మారింది

రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్



**మాస్కో :** ప్రపంచ పరిస్థితి సంక్లిష్టంగా మారిందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్ ఆందోళన వ్యక్తం చేశారు. 1991లో సోవియట్ యూనియన్ అంతర్ధానమైన తర్వాత ఆవిర్భవించిన యూరేషియాలోని సిఐఎస్ (కామన్వెల్త్ ఇండిపెండెంట్ స్టేట్స్) దేశాల భద్రతా సంస్థలు, ప్రత్యేక అధిపతుల మండలి 58వ సమావేశంలో మంగళవారం పుతిన్ మాట్లాడుతూ, సిఐఎస్ దేశాల సరిహద్దుల వెంట సరికొత్త అస్థిర ప్రాంతాలు తలెత్తడంతో ప్రపంచ పరిస్థితి గణనీయస్థాయిలో సంక్లిష్టంగా మారిందని అన్నారు. ఈనాడు ప్రపంచ సైనిక,రాజకీయ పరిస్థితులు కూడా చాలా క్లిష్టంగా ఉన్నాయని, పశ్చిమాసియాను తీవ్రమైన సంక్షోభం చుట్టుముట్టిందని, కొత్త అస్థిర ప్రాంతాలు ఆవిర్భవించాయన్నారు. ఈ పరిస్థితుల్లో రాబోయే కాలంలో జరగబోయే పరిణామాలను ఎప్పటికప్పుడు కనిపెట్టి ఉండటానికి, సమాచారాన్ని సేకరించడానికి, పంచుకోవడానికి ఒక బలమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేసుకోవాలని, ఉమ్మడిగా సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవాలని, బాహ్యశక్తుల నుండి వచ్చే ప్రమాదాలను ఎదుర్కోవడానికి నమ్మకమైన వ్యవస్థను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. దీనికోసం విశ్లేషణాత్మకమైన వ్యవస్థ, సాంకేతికత, సామర్థ్యం,సిబ్బందిని సమకూర్చుకోవాలని, ఏకీకృత విధానాలను అభివృద్ధి చేసుకోవాలని కోరారు. ఉగ్రవాదం, అతివాదం, సరిహద్దుల వెంట జరిగే వ్యవస్థీకృత నేరాలు,ప్రాథమిక భద్రతా ముప్పులు,సైబర్ నేరాలను ఎదుర్కోవడానికి విశ్వసనీయమైన సాకేంతిక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని, వీటినీ ఈ సమావేశంలో క్షుణ్ణంగా చర్చించి స్థిరమైన అభివృద్ధికి దోహదపడాలని పుతిన్ కోరారు.

## లొంగుబాటు

(మొదటి పేజీ తరువాయి)

వివరాలను వెల్లడించారు. డిజిపి మాట్లాడుతూ ఈ పరిణామంతో మావోయిస్టుల తూర్పు ప్రాంత బ్యూరో మనుగడ చివరి దశకు చేరిందని, సంస్థ ర్యకలాపాలకు ఇది వ్యూహాత్మకంగా పెద్ద దెబ్బగా భావిస్తున్నారు. హనుమకొండ జిల్లా కాజీపేట మండలం సోమిడి గ్రామానికి చెందిన పసునూరి నరహరి విద్యార్థి దశలోనే రాడికల్ స్టూడెంట్స్ యూనియన్ ప్రభావంతో ఉద్యమంలో చేరి, 1982లో సిపిఐ (ఎంఎల్) పీపుల్స్ వార్‌లో సభ్యుడిగా చేరారు. అనంతరం ఛత్తీస్‌గఢ్, నాగ్‌పూర్, బిహార్, ఝార్ఖండ ప్రాంతాల్లో వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ సంస్థలో ఉన్నతస్థాయికి ఎదిగారు. 2017లో కేంద్ర కమిటీ సభ్యుడిగా పదోన్నతి పొంది, తరువాత బిహార్–ఝార్ఖండ ప్రత్యేక ప్రాంత కమిటీకి కీలక బాధ్యతలు చేపట్టారు. నరహరి ఆయుధాల తయారీ, మరమ్మతులు, నిర్వహణలో నైపుణ్యం కలిగి ఉండటంతో పాటు తుపాకులు, మోర్టార్లు, రాకెట్లు, రాకెట్ ప్రొపెల్డ్ గ్రెనేడ్లు, బూబీ ట్రాప్‌ల తయారీలో కీలక పాత్ర పోషించారు. సంస్థ క్యాడర్‌కు సాంకేతిక శిక్షణ కూడా అందించినట్లు తెలిపారు.గుంటూరు జిల్లా దాచేపల్లి మండలం గ్రామలపాడుకు చెందిన మేదర దనమ్మ 1986లో ఉద్యమంలో చేరి, అనంతరం వివిధ బాధ్యతలు నిర్వహించారు.

2004లో నాగ్‌పూర్‌లో అరెస్టై, 2011 వరకు జైలులో ఉండి, బెయిల్‌పై విడుదలైన తర్వాత తిరిగి పార్టీలో చేరారు. 2018లో రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా పదోన్నతి పొంది బిహార్–ఝార్ఖండ ప్రాంతంలో సంస్థాగత, సాంకేతిక బాధ్యతలు నిర్వహించారు.తెలంగాణ ప్రభుత్వ పునరావాస విధానం ప్రకారం పసునూరి నరహరికి రూ.25 లక్షలు, మేదర దనమ్మకు రూ.20 లక్షల ప్రోత్సాహక నగదును డిమాండ డ్రాఫ్ట్ రూపంలో అందజేసినట్లు పోలీసులు తెలిపారు. అదనంగా ఆరోగ్య సేవలు, ఇతర పునరావాస ప్రయోజనాలు కూడా అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

**రెండేళ్లలో 822 మంది లొంగుబాటు..**

2024 నుంచి ఇప్పటివరకు తెలంగాణలో మొత్తం 822మంది మావోయిస్టు క్యాడర్లు లొంగిపోయారు. ఇందులో 5మంది కేంద్ర కమిటీ సభ్యులు, 23 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు, ఒక ప్రాంతీయ కమిటీ సభ్యుడు ఉన్నారు. అదే కాలంలో 334 ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

ప్రస్తుతం తెలంగాణకు చెందిన సిపిఐ (మావోయిస్టు)లో కేవలం ముగ్గురు మాత్రమే అండర్‌గ్రౌండ్‌లో కొనసాగుతున్నారని, వారు కూడా ఆయుధ పోరాటాన్ని వీడి ప్రధాన స్రవంతిలోకి రావాలని తెలంగాణ ప్రభుత్వం తరఫున డిజిపి సివి ఆనంద్ పిలుపునిచ్చారు.

## దేశవ్యాప్త నిరసనలు

(మొదటి పేజీ తరువాయి)

వ్యయాన్ని పెంచడం ద్వారా ఆర్థిక వ్యవస్థ అంతటా ఒక గొలుసుకట్టు ప్రభావాన్ని ప్రేరేపిస్తాయని సిపిఐ ఆరోపించింది. కార్మికులు, రైతులు, జీతభత్యాలు పొందే వర్గాలు, పేదలు ఇప్పటికే తీవ్రమవుతోన్న ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతోన్న తరుణంలో ప్రభుత్వం కనికరం లేని ద్రవ్యోల్బణంతో మరింత భారం మోపాలని ఎంచుకుందని సిపిఐ ఆగ్రహం వ్యక్తం చేసింది. కంపెనీలు ఎదుర్కొంటున్న నష్టాలను సాకుగా చూపుతూ మోదీ ప్రభుత్వం ఇంధన ధరల పెంపులను సమర్థించుకోవాలని ప్రయత్నిస్తోందని ఆరోపించింది. అయితే వాస్తవాలు దీనికి పూర్తిగా విరుద్ధంగా ఉన్నాయని తెలిపింది. కేవలం జనవరి నుంచి 2026 మార్చి త్రైమాసికంలోనే ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఒసి) రూ.14, 458కోట్ల లాభాలను, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ (హెచ్‌పిసిఎల్) దాదాపు రూ.4,902 కోట్ల లాభాలను, బిపిసిఎల్ రూ.3,191కోట్ల లాభాలను నివేదించాయి. ఈ కంపెనీల వార్షిక లాభాలు కూడా గణనీయంగా పెరిగాయని గుర్తుచేసింది. కంపెనీలు రూ. వేల కోట్లు ఆర్జిస్తూ ఉంటే ఆ ప్రయోజనాలను వినియోగదారులకు ఎందుకు బదిలీ చేయడం లేదని సిపిఐ ప్రశ్నించింది. 2014లో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రపంచ ముడి చమురు ధరలు చాలా తక్కువగా ఉన్న కాలంలో కూడా బిజెపి ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాలను స్థిరంగా పెంచుతూ, ప్రజల నుంచి ఆదాయాన్ని రాబట్టడానికి పెట్రోలియం పన్నును ఒక సాధనంగా ఉపయోగించుకుంటోందని ఆరోపించింది. అందువల్ల ప్రస్తుతం ధరల పెంపు అనేది కేవలం బాహ్య పరిణమాల ఫలితం మాత్రమే కాదని, ప్రజా సంక్షేమం కంటే కార్పొరేట్ లాభానికి, ఆర్థిక వసూళ్లకు ప్రాధాన్యతనిచ్చే దీర్ఘకాలంగా ఉన్న ఒక విధానంలో భాగమని సిపిఐ దుయ్యబట్టింది. మోదీ ప్రభుత్వం పశ్చిమాసియా సంక్షోభాన్ని ఒక అనుకూలమైన సాకుగా వాడుకుంటూ దాక్కుంటోందని నిప్పులు చెరిగింది. ఈ సంక్షోభం కేవలం యుద్ధం వల్ల సంభవించింది మాత్రమే కాదని, ఇది మోదీ ప్రభుత్వ ఆర్థిక దుర్వినియోగం, క్రమంగా పడిపోతున్న రూపాయి విలువ, పెరుగుతున్న దిగుమతుల బలహీనత, అమెరి–ఇజ్రాయెల్ కూటమి ముందు భారతదేశం తన స్వతంత్ర విధానానికి లొంగిపోవడం వంటి పర్యవసానం కూడా అని ఉదహరించింది. మోదీ ప్రభుత్వం సామాన్యప్రజలను 'త్యాగం' భరించమని అడుగుతూ, కార్పొరేట్ లాభాలను మాత్రం రక్షిస్తున్నదని సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం మండిపడింది.ద్రవ్యోల్బణం, ఆర్థిక ఇబ్బందుల నుంచి ఉపశమనం కలిగించడంలో మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించింది.

## 'హైడ్రా' భారీ ఆపరేషన్

(మొదటి పేజీ తరువాయి)

కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామ రికార్డులు, రెవెన్యూ పత్రాలు, నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ శాటిలైట్ చిత్రాల ఆధారంగా అక్కడ 6.05 ఎకరాల చెరువు ఉన్నట్లు నిర్ధారించారు. వెంటనే చెరువు హద్దులను గుర్తించి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. చెరువుకు ఆనుకుని ఉన్న సర్వే నెంబర్ 11/37లోని 5.16 ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా ఆక్రమణల నుంచి విడిపించారు. దీంతో మొత్తం 11.21 ఎకరాల భూమి రక్షించారు. ఈ భూమి విలువ సుమారు రూ.1800 కోట్లుగా అంచనా వేస్తున్నారు.

**ఓవర్‌ల్యాపింగ్ వివాదాన్ని ఆసరాగా చేసుకున్న ఆక్రమణదారులు**

కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి మండలాల సరిహద్దుల్లో ఉండటం వల్ల ఈదులకుంట వివాదాస్పదంగా మారింది. ఇదే పరిస్థితిని ఆసరాగా చేసుకుని కొన్ని నిర్మాణ సంస్థలు చెరువు భూమిలో నిర్మాణాలకు సిద్ధమయ్యాయి. కూకట్‌పల్లి మండలం పరిధిలోని సర్వే నెంబర్లు చూపిస్తూ 14 అంతస్తుల భవన నిర్మాణానికి 2022లో అనుమతులు పొందినట్లు అధికారులు గుర్తించారు. అయితే వాస్తవానికి నిర్మాణాలు చెరువు పరిధిలోనే సాగుతున్నాయని తేలింది. స్థానికుల ఫిర్యాదుతో హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ స్వయంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి చెరువు, ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్లు నిర్ధారించారు. అనంతరం మంగళవారం ఫెన్సింగ్ ఏర్పాటు చేసి భూమిని రక్షించారు.

కోకాపేట కొత్త చెరువులో ఆక్రమణల తొలగింపు

గండిపేట మండలం కోకాపేట గ్రామంలోని కొత్త చెరువులో కూడా భారీ స్థాయిలో ఆక్రమణలు జరిగినట్లు హైడ్రా గుర్తించింది. 72 ఎకరాల ఎఫ్‌టిఎల్ పరిధి ఉన్న ఈ చెరువులో మధ్యగా కట్ట నిర్మించి ఎగువ ప్రాంతంలోని 20 ఎకరాలకు పైగా భూమిని కొందరు రియల్టర్లు ఆక్రమించినట్లు తేలింది. కొంతమంది ఫెన్సింగ్‌లు, మరికొందరు రేకుల ప్రహరీలు ఏర్పాటు చేసి చెరువు భూమిని స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు చేశారు. గోల్డ్ ఫిష్ విల్లాల నిర్మాణ సంస్థ చెరువు పరిధిలో మట్టి పోసి బాస్కెట్‌బాల్, వాలీబాల్ కోర్టులు, పిల్లల ప్లే ఏరియా ఏర్పాటు చేసినట్లు అధికారులు గుర్తించారు.

సుమారు 1.09 ఎకరాల చెరువు భూమిలో జరిగిన ఈ నిర్మాణాలను హైడ్రా తొలగించింది. అలాగే చెరువు ఎగువ భాగంలో ఉన్న 20 ఎకరాలకు పైగా ఆక్రమిత భూమిని కూడా స్వాధీనం చేసుకుని హద్దులు పాతారు. భవిష్యత్తులో మళ్లీ ఆక్రమణలు జరగకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. కోకాపేటలో మాత్రమే రూ.2200 కోట్ల విలువైన భూమిని రక్షించినట్లు అధికారులు తెలిపారు.

## ట్రంప్ కొత్త మెలిక

(మొదటి పేజీ తరువాయి)

పాలస్తినా స్వతంత్ర్య రాజ్యం ఆవిర్భవించాలని, ఆ తర్వాతే ఇజ్రాయెల్‌తో సాధారణ సంబంధాలను కొనసాగిస్తామని చెబుతున్నది. ఈ విషయంలో పాకిస్థాన్ మరింత ఖరాఖండీ వైఖరితో ఉంది. పాకిస్థాన్ ఏనాడూ ఇజ్రాయెల్‌ను గుర్తించలేదు. పాకిస్థాన్ మాజీ సెనేటర్, విదేశీ విధానంలో కాకలుతీరిన వ్యాఖ్యాత ముషాహిద్ హుస్సేన్ సయ్యద్ కూడా ట్రంప్ చేసిన ప్రతిపాదనను నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. పాకిస్థాన్ ప్రజలు ట్రంప్ ప్రతిపాదనను పూర్తిగా తిరస్కరిస్తారని ఆయన అన్నారు. సౌదీఅరేబియా,ఖతార్ సహా మెజారిటీ ముస్లిం దేశాల ప్రజలు తిరస్కరిస్తారని ఎక్స్ వేదికగా ఆయన పేర్కొన్నారు. ముస్లిం దేశాలకు ఆయన పిలుపు ఇస్తూ, అబ్రహాం ఒప్పందంలో చేరితే గాజాలో బాంబుదాడులు చేయడానికి, ఊచకోతలు కోయడానికి ఇజ్రాయెల్‌కు పట్టంకట్టినట్లు కాగలదని, జెరూసలెం కేంద్రంగా పాలస్తినా రాజ్యస్థాపనను దారిమళ్ళించినట్లు కాగలదని హెచ్చరించారు. ట్రంప్ ప్రతిపాదన రాజకీయంగా అసాధ్యమైనదని విశ్లేషకులు అంచనావేస్తున్నారు.

ఐతే ట్రంప్ కొత్త ఆట ఆడుతున్నారని, ఇరాన్ చేస్తున్న అణు దౌత్యంపై ఇది ఒక కొత్త ఆట అని కొందరు అంటున్నారు.

తూర్పు జెరూసలెం రాజధానిగా స్వతంత్ర పాలస్తినా విస్తరించి మనుగడ సాగించాలనే లక్ష్యానికి పాకిస్థాన్ కట్టుబడి ఉంది. అందువల్ల ఈ విషయాన్ని పాకిస్థాన్ కూడా తిరస్కరిస్తుంది. ఇస్లామిక్ ప్రపంచంలో రాజకీయంగా బాగా ప్రజ్వరిల్లే అంశమిది. ప్రాంతీయ భద్రతను, అణు ఉద్రిక్తతలను ప్రధానాంశాలుగా చేసుకుని జరుగుతున్న చర్చలు ఇప్పుడు ఇజ్రాయెల్‌తో సంబంధాల సాధారణీకరణ చేసుకోవాలనే అంశాన్ని కూడా ముడి పెట్టడం ద్వారా చర్చలు కొత్త దశకు చేరుకున్నాయి.

అమెరికా–ఇరాన్ మధ్య గత నెల నుండీ జరుగుతున్న చర్చల్లో ఇజ్రాయెల్ పూర్తిగా దూరమైపోయింది. ఈ చర్చల ప్రక్రియలో ఇజ్రాయెల్ జోక్యం లేదని, ఇజ్రాయెల్‌ను దాదాపు అమెరికా ఏకాకిని చేసి ఇరాన్‌తో తనకు అనుకూలమైన ఒప్పందం చేసుకునేందుకు చర్చలు జరుగుతున్నాయనే భావన రావడంతో నెతన్యాహూ అభద్రతకు గురవుతున్నారు. ఇరాన్–అమెరికా మధ్య ఒప్పందం కుదిరితే ఇజ్రాయెల్ భవితవ్యంపై నీలి నీడలు కమ్ముకుంటాయని నెతన్యాహూ భావిస్తున్న దశలో రెండు రోజుల క్రితం ట్రంప్–నెతన్యాహూ మధ్య టెలిఫోన్ సంభాషణ జరిగింది. ఇరాన్‌తో ఒప్పందం జరిగినాగానీ, తన సార్వభౌమాధికారాన్ని కాపాడుకునేందుకు ఇరాన్,లెబనాన్‌లపై దాడులకు స్వేచ్ఛ ఉందని ట్రంప్ అన్నారు. ఇప్పుడు అబ్రహాం ఒప్పందం ప్రకారం ముస్లిం దేశాలు కూడా ఇజ్రాయెల్‌తో సాధారణ సంబంధాలను పునరుద్ధరించుకోవడం ద్వారా పశ్చిమాసియాలో ఇజ్రాయెల్ ఆధిపత్యాన్ని కొనసాగించాలన్నదే ట్రంప్ ఆలోచన. అందుకే ఆయన యుద్ధ ముగింపు చర్చల్లో కొత్త మెలిక సృష్టించారు.

# హక్కుల అణచివేతకు ఎపి యత్నించడం ప్రమాదకరం

అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర సమితి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజా సమస్యలపై నిరంతరం తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ, ప్రభుత్వ విధానాలను విశ్లేషిస్తూ, ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్న ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, ప్రొఫెసర్ నాగేశ్వర్‌ను అరెస్ట్ చేయడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీసు బలగాలు హైదరాబాద్‌కు రావడం అత్యంత ఆందోళనకర పరిణామమని అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర సమితి ఖండించింది.

ప్రజాస్వామ్య వ్యవస్థలో భిన్నాభిప్రాయాలు వ్యక్తపరచడం రాజ్యాంగం కల్పించిన హక్కు అని, అలాంటి హక్కులను కూడా అణచివేసేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ప్రయత్నించడం ప్రమాదకరమని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ,కల్లూరు ధర్మేంద్ర మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విమర్శించే స్వరాలను బెదిరించడం, అరెస్టుల పేరుతో మానసిక ఒత్తిడికి గురిచేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ పైన వేధింపులను వెంటనే నిలిపివేయాలని, ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న నిర్బంధ రాజకీయాలను ఆపాలని వారు డిమాండ్ చేశారు. దేశంలో పెరుగుతున్న నిర్బంధ రాజకీయాలకు, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛపై జరుగుతున్న దాడులకు యువత, విద్యార్థులు, ప్రజాస్వామ్యవాదులు ఐక్యంగా ప్రతిఘటించాలని వారు పిలుపునిచ్చారు.

**ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై కేసులను ఉపసంహరించుకోవాలి: టిఎస్ యుటిఎఫ్**

ప్రముఖ మీడియా విశ్లేషకుడు, విశ్రాంత ఆచార్యులు నాగేశ్వర్‌పై ఆంధ్రప్రదేశ్ లోని వివిధ పోలీసు స్టేషన్లలో బనాయించిన కేసులను ఉప సంహరించుకోవాలని,అరెస్టు చేసే ప్రయత్నాలను విరమించుకోవాలని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు చావ రవి,ఎ.వెంకట్ డిమాండ్ చేశారు.గత,ప్రస్తుత ముఖ్యమంత్రులతో సహా రాష్ట్రంలోని దాదాపు అన్ని రాజకీయ పార్టీలు ఏదో ఒక సందర్భంలో ఆయన సలహాలు తీసుకున్నవారేనని వారు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాగేశ్వర్‌పై కేసుల నమోదును మీడియా స్వేచ్ఛపై జరిగన దాడిగానే భావించాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికైనా ఎపి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జోక్యం చేసుకొని కేసులను ఎత్తివేసి, ఈ వివాదాన్ని ఇంతటితో ముగించాలని వారు కోరారు.

## కోట్ల మోసం

(మొదటి పేజీ తరువాయి)

సెక్యూరిటీ కౌన్సిల్ (ఎన్‌ఐసిసి) పేరుతో నడిచిన ఈ వ్యవహారంపై హైదరాబాద్ సిసిఎస్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల వివరాల ప్రకారం, అమీన్‌పూర్‌లోని టెక్ ఫెయిర్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ దత్తి నళిని కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. నిందితుడు కె.వి.ఎన్. ప్రమీల్ అర్జున్ తనను ఎన్‌ఐసిసి సంస్థ దక్షిణ ప్రాంతాధిపతిగా, అలాగే కేంద్ర ఎలక్ట్రానిక్స్ మరియు ఐటి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సంస్థ ప్రతినిధిగా పరిచయం చేసుకున్నాడు.సైబర్ సెక్యూరిటీ ట్రైనింగ్ ప్రోగ్రాములు నిర్వహించి విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, సర్టిఫికెట్లు, ప్రభుత్వ స్టైపెండ్‌లు అందిస్తామని హామీ ఇచ్చాడు. ఇందుకోసం 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' ఏర్పాటు చేస్తే కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.2 కోట్ల గ్రాంట్ వస్తుందని చెప్పి బాధితుడిని నమ్మించాడు. ప్రతి విద్యార్థికి రూ.5 వేల చొప్పున 2000 లాగిన్ క్రెడెన్షియల్స్ ఇస్తామని, విద్యార్థుల నుంచి రూ.15 వేల వరకు వసూలు చేసుకోవచ్చని ప్రలోభపెట్టాడు.అలాగే ప్రధాని నరేంద్ర మోదీ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, మాజీ సిడిఎస్ బిపిన్ రావత్ చిత్రాలు, ప్రసంగాలు, పత్రికా కథనాలు, ప్రభుత్వ సంస్థలతో భాగస్వామ్యాలున్నట్లు చూపించే బ్రోచర్లు, వెబ్‌సైట్‌ల ద్వారా సంస్థకు నమ్మకం కల్పించాడు.డిఆర్‌డిఒ, ఢిల్లీ పోలీస్, ఎస్‌బిఐ వంటి సంస్థలతో సంబంధాలున్నట్లు కూడా ప్రచారం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ హామీలను నమ్మిన దత్తి నళిని కుమార్ వివిధ దఫాల్లో ఎన్‌ఐసిసి, ప్రికస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన బ్యాంకు ఖాతాలకు మొత్తం రూ.5,56,93,158లను ఆర్‌టిజిఎస్ ద్వారా బదిలీ చేశారు. అదనంగా హైదరాబాద్, బెంగళూరులో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కార్యాలయాల ఏర్పాటు కోసం మరో రూ.3 కోట్ల వరకు ఖర్చు పెట్టినట్లు తెలిపారు.అయితే డబ్బులు తీసుకున్న తర్వాత శిక్షణలు, లాగిన్ క్రెడెన్షియల్స్, ప్రభుత్వ గ్రాంట్లు ఏవీ అందించకపోవడంతో బాధితుడికి అనుమానం వచ్చింది. అనంతరం ఢిల్లీలో ఎన్‌ఐసిసి కార్యాలయం లేదని,ఆర్‌టిఐ ద్వారా మైట్‌వై కూడా ఆ సంస్థతో తమకు సంబంధం లేదని వెల్లడించడంతో ఇది పూర్తిస్థాయి మోసమని బయటపడింది.నిందితుడు ప్రభుత్వ సంస్థల పేర్లు, జాతీయ నాయకుల చిత్రాలు, హోదాలను దుర్వినియోగం చేసి నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి భారీ స్థాయిలో మోసానికి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు సిసిఎస్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# 'ఆర్ట్ ఫర్ లైఫ్'కు రంగుల సందేశం

రోడ్డు భద్రతపై కళాకారుల సృజనకు టిజిఎస్‌ఆర్‌టిసి పురస్కారం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రోడ్డు భద్రతపై ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు కళను వేదికగా మలిచిన టిజిఎస్ ఆర్‌టిసి నిర్వహించిన ఆర్ట్ ఫర్ లైఫ్ పెయింటింగ్ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. 99 డేస్ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన కళాకారులను టిజిఎస్‌ఆర్‌టిసి ఎండి వై.నాగిరెడ్డి మంగళవారం బస్ భవన్‌లో సత్కరించారు. ఈనెల 9న హైదరాబాద్‌లోని కళాభవన్‌లో ఆర్ట్ ఫర్ లైఫ్ పేరుతో నిర్వహించిన సందేశాత్మక కళా పోటీలకు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఎండి వై.నాగిరెడ్డి మాట్లాడుతూ కళకు సమాజాన్ని ప్రభావితం చేసే అపారమైన శక్తి ఉందన్నారు. మాటలతో చెప్పలేని విషయాలను ఒక చిన్న చిత్రం ప్రజల మనసులకు చేరుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇడిలు కుశ్రో షా ఖాన్, సిహెచ్,వెంకన్న, హైదరాబాద్ ఆర్‌ఎం సుధాపరిమళ, సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎ.శ్రీనివాస కుమార్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

# ఫ్రెంచ్ ఓపెన్‌లో బసవారెడ్డి నిశేష్ సంచలనం

### ఏడో సీడ్ ఫ్రిట్జ్‌ను ఓడించిన తెలుగు సంతతి అమెరికా కుర్రాడు



పారిస్‌లో జరుగుతున్న ప్రతిష్ఠాత్మక ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో పెను సంచలనం. ఎలాంటి అంచనాలు లేకుండా వైల్ కార్డ్ ఎంట్రీగా బరిలోకి దిగిన దిగిన తెలుగు సంతతి కుర్రాడు, అమెరికా ప్లేయర్ బసవారెడ్డి నిశేష్.. తొలి మ్యాచ్‌లోనే ఏడో సీడ్ ఫ్రిట్జ్‌ను ఓడించి టెన్నిస్ సర్క్యూట్లో ప్రకంపణలు రేపాడు. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్ పోరులో నిశేష్ 7 6(7/5), 76(7/5), 67(9/11), 61తో ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ ఫ్రిట్జ్‌పై అద్భుత విజయం సాధించి ఔరా అనిపించాడు. 2 గంటల 45 నిమిషాల పాటు సాగిన పోరులో21 ఏండ్ల నిశేష్.. తన దేశానికే చెందిన ఫ్రిట్జ్‌కు దీటైన పోటీ నిచ్చాడు. ఈ మ్యాచ్లో ఫ్రిట్జ్ 71 విన్నర్లతో విరుచుకుపడినప్పటికీ, నిశేష్ అంతే దీటుగా స్పందించి 51 విన్నర్లు కొట్టడమే కాకుండా అద్భుతమైన డిఫెన్స్తో నిలబడ్డాడు. రోలాండ్ గారోస్లో జాన్ గాంబిల్ (2000లో) తర్వాత టాప్10 ప్లేయర్ను ఓడించిన అమెరికన్ గా నిశేష్ అరుదైన రికార్డు సొంతం చేసుకున్నా డు. రెండో రౌండ్‌లో అతను మరో అమెరికన్ అలెక్స్ మిచెల్సన్తో తలపడుతాడు. మిగతా మ్యాచ్లో సెర్బియా లెజెండ్ నొవాక్ జొకోవిచ్ 5–7, 7–5, 6–1, 6–4తో పెత్సి పెరికార్డ్(ఫ్రాన్స్)పై గెలిచి రెండో రౌండ్లోకి ప్రవేశించాడు. 8వ సీడ్ అలెక్స్ డి మినార్‌తో శామ్యూ్బ, 24వ సీడ్ టామి పాల్ తో హిజికాటాపై, 19వ సీడ్ ఫ్రాన్సెస్ తియాఫో తో స్విజ్జిరిపై విజయం సాధించారు. మహిళల సింగిల్స్లో రెండో సీడ్ కజకిస్తాన్ స్టార్ ఎలెనా రిబాకినాఎర్జావ్పై గెలిచి రెండో రౌండ్కు దూసుకెళ్లింది. మూడో సీడ్ స్వియాటెక్ జోన్స్పై, ఏడో సీడ్స్వితోలినా బొండ్ర నెగ్గారు. ఆరో సీడ్ అనిసిమోవాతో రాజావ్ను ఓడించగా, 13వ సీడ్ జాస్మిన్ పాలినిడయానా యామ్నాక్పై గెలిచింది. నిశేష్ పుట్టింది, పెరిగింది అమెరికాలోనే అయినా అతని తల్లిదండ్రులు సాయి ప్రసన్న, మురళీకృష్ణది ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు. 1999 లో కుటుంబంతో అమెరికాకు వలస వెళ్లిన మురళీకృష్ణ తన ఇద్దరు కుమారులైన నిశేష్, నిశాంత్‌ను చిన్నతనం నుంచే టెన్నిస్ వైపు ప్రోత్సహించారు. జూనియర్ టెన్నిస్లో తిరుగులేని ప్రదర్శన చేసిన నిశేష్.. ఐటీఎఫ్ జూనియర్ ర్యాంకింగ్స్లో ప్రపంచ నంబర్ 3 స్థానానికి చేరుకున్నాడు. 2022 జూనియర్ యూఎస్ ఓపెన్ బాలుర డబుల్స్ టైటిల్ను కూడా కైవసం చేసుకున్నాడు. 2016, 2018లో మోకాలి రెండు శస్త్ర చికిత్సలు ఇబ్బంది పెట్టినా అస్సలు వెనక్కుతగ్గలేదు. 2024 చివర్లో ప్రొఫెషనల్ ప్లేయర్గా మారిన బసవారెడ్డి అదే ఏడాది ప్యూర్టో వల్లార్టా, టిబురాన్లో రెండు ఏటీపీ చాలెంజర్ టైటిళ్లను గెలుచుకుని, ఏటీపీ నెక్స్ట్ జెన్ ఫైనల్స్కు కూడా అర్హత సాధించాడు.

**జొకోవిచ్ను ఆశ్చర్యపరిచి..**బసవారెడ్డి నిశేష్ గ్రాండ్స్లామ్ ఆడటం ఇదే తొలిసారి కాదు. గతేడాది ఆస్ట్రేలియన్ ఓపెన్లో వైల్ కార్డ్ ద్వారా మెయిన్ డ్రాలో అడుగుపెట్టి గ్రాండ్స్లామ్ అరంగేట్రం చేశాడు. ఆ టోర్నీ తొలి రౌండ్లోనే లెజెండరీ ప్లేయర్ జొకోవిచ్తో తలపడిన అతను ఫస్ట్ సెట్ను (6–4) గెలుచుకుని ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచాడు. తర్వాతి మూడు సెట్లు కోల్పోయి మ్యాచ్ ఓడినప్పటికీ జొకోవిచ్ నుంచే ప్రశంసలు అందుకున్నాడు. ఆ తర్వాత 2025 జూన్లో ఏటీపీ టాప్ 100 ర్యాంకింగ్స్లోకి దూసుకొచ్చి వింబుల్డన్, యూఎస్ ఓపెన్లోనూ ఆడాడు. ప్రస్తుతం ప్రపంచ 148వ ర్యాంకులో ఉన్న నిశేష్.. యూఎస్టీఏ రోలాండ్ గారోస్ వైల్ కార్డ్ చాలెంజ్ గెలవడం ద్వారా ఈసారి ఫ్రెంచ్ ఓపెన్ మెయిన్ డ్రా బెర్త్ను సంపాదించుకున్నాడు. తొలి రౌండ్లోనే ఫ్రిట్జ్ను మట్టికరిపించిన ఈ కుర్రాడు టెన్నిస్ ప్రపంచం దృష్టిని తనవైపు తిప్పుకున్నాడు.



## రెజ్లర్ల పసిడి మోత

వియత్నాంలో జరుగుతున్న అండర్23 ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత రెజ్లర్లు స్వర్ణాలతో హోరెత్తిస్తున్నారు. సోమవారం జరిగిన ఫ్రీస్టయిల్ విభాగంలో అక్షయ్, విక్కీ స్వర్ణ పతకాలను కైవసం చేసుకున్నారు. 57 కేజీల విభాగం ఫైనల్లో అక్షయ్ 42 తేడాతో అమన్గెల్డి (కజకిస్థాన్)పై , 97 కేజీల విభాగంలో విక్కీ 7–5 తేడాతో ఉజ్బెకిస్థాన్కు రెజ్లర్ షెర్జోద్ పొయన్పో గెలిచాడు. మహిళల 53 కేజీల ఫైనల్లో ముస్కాన్ 6–2తో వియత్నాం రెజ్లర్ తి మై లిన్ న్గుయెన్ను ఓడించి పసిడి పతకాన్ని ముద్దాడింది. తపస్య(57 కేజీ) కజకిస్థాన్‌కు చెందిన షాగాయెవాను చిత్తు చేసింది. భాగ్యశ్రీ (62 కేజీ), పుల్కిత్ (65 కేజీ) కూడా పసిడి పతకాలు నెగ్గారు.

## కార్ల్సన్ తొలి రౌండ్లోనే.. గుకేశ్, ప్రజ్ఞానంద శుభారంభం..!



నార్వే చెస్ టోర్నీలో తొలి రోజే సంచలనం నమోదైంది. ఫేవరెట్ ఆటగాడైన వరల్ నంబర్ 1 మాగ్నస్ కార్ల్సన్ కు ఊహించని ఓటమి ఎదురైంది. తొలి రౌండ్లోనే అలిరెజా ఫిరౌజా చేతిలో కార్ల్సన్ పరాజయం పాలయ్యాడు. ప్రపంచ ఛాంపియన్ డి.గుకేశ్ మారథాన్ పోరులో డ్రాతో గట్టెక్కగా, భారత గ్రాండ్మాస్టర్ ఆర్.ప్రజ్ఞానంద అద్భుత పోరాట పటిమతో శుభారంభం చేశాడు. మహిళల విభాగంలో దివ్య దేశ్ముఖ్ ధాటికి ఛాంపియన్ జు వెంజున్ చేతులెత్తేసింది. నార్వే చెస్ తొలి రౌండ్లో భారత కుర్రాడు గుకేశ్కు విన్సెంట్ కెయ్మెర్(జర్మనీ) నుంచి గట్టిపోటీ ఎదురైంది. దాదాపు ఐదు గంటల పాటు సాగిన మ్యాచ్లో ప్రత్యర్థి 144 ఎత్తులు వేయడంతో గుకేశ్ చెమటోడ్చక తప్పలేదు. ట్రై బ్రేకర్లో పుంజుకున్న భారత స్టార్ 1.5 పాయింట్లు సాధించాడు. పొరపాటుకు భారీ మూల్యం చెల్లించుకున్నాడు. ప్రజ్ఞానంద సైతం ట్రై బ్రేకర్లోనే వెస్లేను చిత్తు చేశాడు. ఎదురుదాడి వ్యూహంతో ఆడిన భారత గ్రాండ్మాస్టర్ 1.5 పాయింట్లతో గుకేశ్తో సంయుక్తంగా రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. మహిళల విభాగంలో భారత గ్రాండ్మాస్టర్ దివ్య దేశ్ముఖ్ సంచలన ఆటతో ఛాంపియన్ జు వెంజున్కు చెక్ పెట్టింది. ట్రై బ్రేకర్లో జోరు చూపించి విజేతగా నిలిచింది.

## మహిళ

# లింగ సమానత్వం... వికలాంగుల హక్కులు..



లింగ సమానత్వం కోసం జరుగుతున్న ఉద్యమాలు, వికలాంగుల హక్కుల పోరాటాలు పరస్పరం విడదీయరాని సంబంధం కలిగి ఉన్నాయి. చలనం లోపం ఉన్న మహిళలు ఓటు వేయలేని పరిస్థితిలో ఉన్నప్పుడు సమాన ఓటు హక్కులు సాధించామని చెప్పలేం. చూపు లేదా వినికిడి లోపం ఉన్న మహిళలు న్యాయ వ్యవస్థను చేరుకోలేని స్థితిలో ఉన్నప్పుడు లింగ ఆధారిత హింస నుండి విముక్తి సాధ్యంకాదు. డిజిటల్ దాడులను తగ్గించాలంటే, వికలాంగ మహిళలు, బాలికలు సురక్షిత సాంకేతికను అనుభవించే అవకాశాలు ఉండాలి. ఒక మహిళ ఎదుర్కొనే సవాళ్లు కేవలం లింగంతోనే నిర్ణయించలేమన్న విషయాన్ని ఇక్కడ గుర్తించాలి. జాతి, వర్గం, వయస్సు, వైకల్యం వంటి అంశాలు పరస్పరం ప్రభావితం చేస్తాయి. ఈ పరస్పర మేళవింపు అసమానతలను మరింత తీవ్రం చేస్తుంది. అందుకే ఐక్యరాజ్య సమితి అన్ని రకాల మహిళల హక్కుల కోసం ప్రయత్నిస్తూ, విధానాలలో వైకల్యాలను కూడా ప్రధానంగా చేర్చే దిశగా చర్యలు చేపడుతోంది. అంతర్జాతీయ నివేదికలను అనుసరించి, ప్రతి రోజు మహిళలు ప్రపంచవ్యాప్తంగా సుమారు 16 బిలియన్ గంటల ఉచిత సంరక్షణ పనిని నిర్వహిస్తున్నారు. వంట, శుభ్రత, నీరు తేవడం, పిల్లలు, వృద్ధుల సంరక్షణ వంటి పనులు ఈ గణాంకంలో ఉన్నాయి. ఈ పని లేకపోతే సమాజ వ్యవస్థలు నిలబడవు. అయినప్పటికీ, దీని కి సరైన విలువ లేదా ఆర్థిక గుర్తింపు లేదు. సమాన సంరక్షణ వ్యవస్థలు లేకపోవడం వికలాంగుల మానవ హక్కుల ఉల్లంఘనలకు దారితీస్తుంది. సరైన శారీరక, భావోద్వేగ సంరక్షణ లేకపోవడం, బలవంతపు సంస్థాగత నిర్బంధం లేదా వైద్య చికిత్సలు వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. వికలాంగ మహిళలు తమ కుటుంబాలలో కూడా సంరక్షణ బాధ్యతలు భుజాన వేసుకుంటారు. కానీ వారికి ఆర్థిక అవకాశాలు పరిమితం. సమర్థవంతమైన సంరక్షణ వ్యవస్థలు సంరక్షకులకు గుర్తింపు, వనరులు, బాధ్యతల భాగస్వామ్యా న్ని అందించాలి. సమాజ ఆధారిత మోడళ్ల ద్వారా ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల తల్లిదండ్రులకు శిక్షణ ఇవ్వడం, ఇతరులను చూసుకునే వికలాంగ మహిళలకు మద్దతు అందించడం అవసరం. కాగా, సాంకేతికత వికలాంగ మహిళల జీవితాలను మారుస్తున్న శక్తి కలిగి ఉంది. సహాయక సాంకేతిక పరికరాలు, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు కమ్యూనికేషన్, స్వావలంబన, సేవలకు ప్రాప్యతను పెంచుతాయి. 'ఎట్ స్కేల్' సంస్థ భాగస్వామ్యంతో యుఎన్ నిర్వహించిన గ్లోబల్ సర్వే లు సాంకేతికత ద్వారా చేర్చుకునే అవకాశాలను పరిశీలించాయి. అయితే సాంకేతికఆధారిత హింసకూడా పెరుగుతోందని ఆందోళన కలిగిస్తు న్న విషయం. వివిధ అధ్యయనాల ప్రకారం 16నుండి 58శాతం మహిళలు డిజిటల్ దాడులకు గురవుతున్నారు. కృత్రిమ మేధస్సు (ఎఐ) వ్యవస్థలు సమగ్రత లేకుండా రూపుదిద్దుకుంటే, అవి ఇప్పటికే ఉన్న అసమానతలను పెంచుతాయి. వికలాంగ మహిళల అనుభవాలు డేటాలో ప్రతిబింబించకపోతే, ఉద్యోగ ఎంపిక, విద్య, ఆరోగ్య సేవలలో వివక్షకు దారి తీస్తాయి. అందువల్ల ఎఐ అభివృద్ధిలో అంతర్జాతీయ స్థాయి సూత్రాలు, భద్రతా ప్రమాణాలు, విభిన్న అభివృద్ధి బృందాలు అవసరం. సమాన న్యాయం అందించాలంటే విధాన నిర్ణేతలు, చట్టం అమలు సంస్థలు లింగం, వైకల్యా ల అంశాన్ని సమగ్రంగా పరిగణించాలి. వివక్ష ఏ రూపంలోనూ అడ్డంకిగా మారకూడదు. లింగ సమానత్వం మరియు వికలాంగుల హక్కులు కలిసి ముందుకు సాగాలి. వీటిలో ఒకటి లేకపోతే, మరొకదానికి సంపూర్ణత సిద్ధించదు.

## దీర్ఘకాలిక వ్యాధులతో జాగ్రత్త..

చాలా వరకు దీర్ఘకాలిక వ్యాధుల వల్ల తక్షణ ప్రమాదం లేకపోయినప్పటికీ, అవి క్రమంగా బాధను పెంచుతూ, మృత్యుముఖంగా లోకి నెట్టేస్తాయి. కాబట్టి, ఈవ్యాధులను నిర్లక్ష్యం చేయకుండా, ఎప్పటికప్పుడు వైద్యలను సంప్రదించి, తగిన చికిత్స చేయించుకోవాలి. దీర్ఘకాలిక వ్యాధి లేదా దీర్ఘకాలిక పరిస్థితి అనేది సాధారణంగా ఒక సంవత్సరం కంటే ఎక్కువ కాలం కొనసాగుతూ, నిరంతర వైద్య సంరక్షణ అవసరం ఉండే లేదా వ్యక్తి రోజువారీ కార్యకలాపాలను పరిమితం చేసే ఆరోగ్య సమస్యగా దీనిని నిర్వచించవచ్చు. గుండె సంబంధిత వ్యాధులు, మెటాబాలిక్ సమస్యలు, నాడీ సంబంధిత రుగ్మతలు, శ్వాసకోశ సమస్యలు వంటి అనేక వ్యాధు లు ఇందులో చేరతాయి. ఉదాహరణకు అల్జీమీర్స్, కీళ్లనొప్పులు, బిపి, మూత్రపిండాల వ్యాధులు, ఆస్తమా వంటి వ్యాధులు దీర్ఘకాలిక వ్యాధులుగా పరిగణించబడతాయి. కొంతమంది వైద్య నిపుణుల అభిప్రాయం ప్రకారం పోలిసైస్టిక్ ఓవరీ సిండ్రోమ్(పిసిఒఎస్), ఎండోమెంట్రియోసిస్ కూడా దీర్ఘకాలిక పరిస్థితులుగా పరిగణించవచ్చు. ఏదిఏమైనా, ఒక సంవత్సరం కంటే ఎక్కువ కాలం కొనసాగుతూ, నిరంతర వైద్య సంరక్షణ అవసరమై ఉండడమేగాక, రోజువారీ జీవిత కార్యకలాపాలను పరిమితం చేసే రుగ్మతలను దీర్ఘకాలిక వ్యాధులుగా పేర్కోవచ్చు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) నిర్వచనం ప్రకారం దీర్ఘకాలిక వ్యాధులు సాధారణంగా వ్యక్తి నుంచి వ్యక్తికి వ్యాపించవు, దీర్ఘ కాలం పాటు మెల్లగా అభివృద్ధి చెందుతాయి. ఈ నిర్వచనాల్లో స్వల్ప తేడాలు ఉన్నప్పటికీ, దీర్ఘకాలికత, నిరంతర నిర్వహణ అవసరం అనే భావన ఒకే విధంగా ఉంటుంది. ఈ వర్గీకరణ ప్రజారోగ్య విధానాలు, బీమా వ్యవస్థలు, పరిశోధన నిధుల కేటాయింపు వంటి అంశాలపై ప్రభావం చూపుతుంది. ప్రపంచవ్యాప్తంగా దీర్ఘకాలిక వ్యాధులు మరణాలకు, అనారోగ్యాలకు ప్రధాన కారణాలు. మహిళల్లో కొన్ని దీర్ఘకాలిక పరిస్థితులు ప్రత్యేకంగా అధికంగా కనిపిస్తాయి లేదా వేరే విధంగా ప్రదర్శిస్తాయి. గుండె సంబంధిత వ్యాధులు మహిళలలో మరణాలకు ప్రధాన కారణం అయినప్పటికీ, లక్షణాలు సాంప్రదాయంగా భావించే విధంగా ఉండకపోవడం వల్ల గుర్తించడంలో ఆలస్యం జరుగుతుంది. దీర్ఘకాలిక వ్యాధి అనేది దీర్ఘకాలం పాటు కొనసాగి నిరంతర సంరక్షణ అవసరమయ్యే పరిస్థితి. నిర్వచనాల్లో స్వల్ప తేడాలు ఉన్నప్పటికీ, దీర్ఘకాలికత, నిర్వహణ అవసరం అనే అంశాలు కీలకం. సరైన జీవనశైలి, ముందస్తు గుర్తింపు, నిరంతర వైద్య సంరక్షణ మరియు సమగ్ర మద్దతుతో చాలా మంది వ్యక్తులు తమ జీవన ప్రమాణాన్ని మెరుగుపరుచుకునే అవకాశాలు ఉంటాయి.



## రెండవ ఎఎన్ఎంలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

### ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నర్సింహ్మా

### ఘనంగా రెండవ ఎఎన్ఎంల జిల్లా మహాసభ




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** గ్రామీణ స్థాయిలో ప్రజల ఆరోగ్యం కోసం తమ ప్రాణాలను ఫణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్న రెండవ ఎఎన్ఎంలకు ప్రభుత్వ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం. నర్సింహ్మా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఖమ్మం బైపాస్ రోడ్డులోని గిరిప్రసాద్ భవన్‌లో రెండవ ఎఎన్ఎం యూనియన్ (ఎఐటియుసి) ఖమ్మం జిల్లా రెండవ మహాసభ జిల్లా అధ్యక్షులు తమ్మారపు జయమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా హాజరైన నర్సింహ్మా మాట్లాడుతూ రెండవ ఎఎన్ఎంలు రాత పరీక్ష రాసి రెండేళ్లు దాటినా ప్రభుత్వం పోస్టులు నింపడంలో నత్తను తలపిస్తుందని విమర్శించారు. తక్షణమే పోస్టుల సంఖ్యను పెంచి ఎంపిహెచ్ఎ భర్తీ ప్రక్రియను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. నిత్యం ప్రజల ఆరోగ్యం కోసం పనిచేసే ఎఎన్ఎంలకు హెల్త్ ఇన్సూరెన్స్ కూడా లేకపోవడం తీవ్ర అన్యాయమన్నారు. ప్రభుత్వానికి వైద్య రంగంలో పునాదిగా ఉన్నటువంటి రెండవ ఎఎన్ఎంల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రెండవ ఎఎన్ఎంలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రాత పరీక్షలో ఉద్యోగం రాకుండా మిగిలిన పోయిన వారికి 100 శాతం గ్రాస్ శాలరీ, రూ.10 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్, రూ.10 లక్షల లైఫ్ ఇన్సూరెన్స్, రూ.10 లక్షల రిటైర్‌మెంట్ బెనిఫిట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి గాదె లక్ష్మి నారాయణ, తోట రామాంజనేయులు, సుమతి, శైలజ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతనం

### ఎఐటియుసి వరంగల్ జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు



**ప్రజాపక్షం/నెక్కొండ :** ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించి, కనీస వేతనం రూ.26వేలను అమలు చేయాలని ఎఐటియుసి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎఐటియుసి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మహిళా సంఘాల విఒలతో సంబంధం లేకుండా నేరుగా పాఠశాల ఖాతాల నుండి స్కావెంజర్ల బ్యాంక్ ఖాతాల్లో జీతాలు జమ చేయాలని, ప్రతి నెల జీతం అదే నెలలో చెల్లించే విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నిర్మల, మేరీ, పాషా, సునీత, పద్మ, రామారావు, రవి, విజయ, పాపయ్య, శ్వేత, ఐలమ్మ, రాధ, అరుణ, రజిత, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలపై కేంద్ర సర్కార్ పెనుభారం

### సిపిఐ రాష్ట్ర నాయకుడు తమ్మెర విశ్వేశ్వర్‌రావు

**ప్రజాపక్షం/తొర్రూరు :** కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్రమోదీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచి ప్రజలపై భారాలు మోపుతుందని సిపిఐ రాష్ట్ర నాయకులు తమ్మెర విశ్వేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం తొర్రూరు పట్టణ కేంద్రంలోని గాంధీ సెంటర్‌లో కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగితే కేవలం వాహనాలు నడిపేవారే నష్టపోరని, అది ప్రజల దైనందిన బడ్జెట్‌ను నేరుగా దెబ్బతీస్తుందన్నారు. లారీలు, రవాణా వాహనాల ఖర్చులు పెరుగుతాయని, దీని వల్ల కూరగాయలు, పాలు, పప్పులు, మందులు వంటి అన్ని నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతాయన్నారు. కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు ఓమ బిక్షపతి, మండల కార్యదర్శి బందు మహేందర్, సహాయ కార్యదర్శి గణపురం లక్ష్మ ణ్, పట్టణ కార్యదర్శి ముద్రబోయిన వెంకన్న, మంగళపల్లి మల్లయ్య, కోటగిరి కృష్ణ, మహేందర్, కుమారస్వామి, ఆర్.యాకయ్య, తొట్టె కుమార్, పి.కుమార్, వి.వెంకన్న, ఎన్.మహేందర్, రాజు, వీరన్న, జంగయ్య, రమేశ్, యాకన్న పాల్గొన్నారు.






**జనగామ :** గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ మంగళవారం జనగామలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఐ శ్రేణులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆది సాయన్న మాట్లాడుతూ కార్పొరేట్, ఆయిల్ కంపెనీలకు దాసుడైన మోదీ విచ్చలవిడిగా గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతున్నాడన్నారు. పెట్రో ధరల పెంపుతో నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతాయన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అయిల్ కంపెనీలకు దాసోమై పెద్దఎత్తున ప్రజలకు నష్టం కలిగించే చర్యలు దిగడం సరియైంది కాదన్నారు. పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి సొప్పరి సోమయ్య, జిల్లా నాయకులు మోటే శ్రీశైలం, చామకూరే యాకుబ్, దాయా నగేష్, ఉప్పలయ్య, మల్లేశం, నాగరాజు, కిష్టయ్య, మహేష్, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## పోరాటాలతోనే గిరిజన హక్కులు సాధన

### సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా

**ప్రజాపక్షం/బూర్గంపాడు :** గిరిజనుల హక్కుల సాధించుకోవాలంటే పోరాటాలే మార్గమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె.సాబీర్ పాషా అన్నారు. మండలంలోని ఉప్పుసాక గ్రామ పంచాయితీలోని రాజీవ్‌నగర్ కాలనీలో సిపిఐ అనుబంధ గిరిజన సంఘం మండల మహాసభ మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి అనంతరం జరిగిన సభలో సాబీర్ పాషా ప్రసంగించారు. గిరిజన గ్రామాల్లో రహదారులు, విద్యుత్, విద్య, వైద్యం, తాగునీరు వంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. సిపిఐ చేపట్టనున్న జల్, జంగిల్, జమీన్ పోరాటాల్లో గిరిజన యువతి, యువకులు ముందుండాలని కోరారు. గిరిజన గ్రామాల్లో అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, వృద్ధాప్య పింఛన్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం జరిగిన కార్యకర్తల సమావేశంలో మండల గిరిజన సంఘం కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, జిల్లా కార్యవర్గ సభ్యులు మువ్వ వెంకటేశ్వరరావు(లడ్డా), జిల్లా సమితి సభ్యులు పేరాల శ్రీనివాసరావు, మండల కార్యదర్శి సబ్బం నాగేశ్వరరావు, పాల్వంచ మమండల కార్యదర్శి పూర్ణ, నాయకులు గుత్తుల సత్యనారాయణ, సుబ్బారెడ్డి, చారి, కుంజ నాగరాజ్, తదితరులు పాల్గొన్నారు.



## సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని రద్దు చేయాలి : ఎఐటియుసి డిమాండ్




**ప్రజాపక్షం/సత్తుపల్లి :**వచ్చే విద్యా సంవత్సరం నుంచి రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అల్పాహారం పథకాన్ని హరే రామ, హరే కృష్ణ ఫౌండేషన్‌కు అప్పగించాలనే నిర్ణయాన్ని తక్షణమే విరమించుకొని, సెంట్రల్ లైజ్డ్ కిచెన్ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్నం భోజనం పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమితి సభ్యులు నిమ్మటూరి రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో ఓ ప్రైవేట్ పాఠశాలలో జరిగిన సంఘం నియోజకవర్గ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సెంట్రలైజ్డ్ కిచెన్ విధానాన్ని తక్షణమే రద్దుచేసి కార్మికుల ద్వారానే మధ్యాహ్నం భోజనం అల్పాహారం పథకాన్ని అమలు చేయాలని కోరారు. మధ్యాహ్నం భోజనం కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి. కనీస వేతనం అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం అల్పాహారం నిధులు ఇవ్వకుండా వెళ్లిపోయిందని తక్షణమే పెండింగ్ నిధులను విడుదల చేసి కార్మికులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎఐటియుసి సత్తుపల్లి మండల కార్యదర్శి తెలగారపు రామారావు, తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్నం భోజనం ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి షేక్ రహీమున్నీసా, జిల్లా సమితి సభ్యులు మహాదేవ లక్ష్మి, పూచి సీత, జక్కంపూడి వెంకటలక్ష్మి, పారేపల్లి సత్యవతి, కారం నాగలక్ష్మి, చామకూర సత్యవతి, శ్రీలక్ష్మి, రాజ్యలక్ష్మి, జరీనా, మంగమ్మ, సీతమ్మ, కృష్ణవేణి, సక్కుబాయి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌టిసి కార్మికుల హక్కుల కోసం ఎంప్లాయీస్ యూనియన్ పోరాటం

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి



**ప్రజాపక్షం/దేవరకొండ :** కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఎంప్లాయీస్ యూనియన్ పోరాటం చేస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం టిజిఎస్ ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ దేవరకొండ డిపో సమావేశం సిపిఐ కార్యాలయంలో డివి.నారాయణ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పల్లా నర్సింహారెడ్డి మాట్లాడుతూ ఆర్‌టిసి కార్మికుల హక్కుల కోసం ఎంప్లాయీస్ యూనియన్ నిరంతరం అండగా నిలిచి పోరాడుతుందని, కార్మిక వర్గ శ్రేయస్సు కోసం సిపిఐ ఎప్పుడు ముందుండి పోరాడుతుందన్నారు. ఆరు సంఘాల జెఎసి ఆధ్వర్యంలో 24 ఫిబ్రవరి 2026న ఛలో సెక్రటేరియట్ కార్యక్రమం నిర్వహించి కార్మికుల సమక్షంలో 13 మార్చి 2026న సమ్మె నోటీసు ఇవ్వడం జరిగిందని 22ఏప్రిల్ 2026న సమ్మె ప్రారంభమైన తర్వాత ప్రభుత్వం యాజమాన్యం స్పందించి చర్చలకు పిలిచి 32 డిమాండ్లను అంగీకరించిందన్నారు. ఆర్‌టిసి కార్మికులను రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా విలీనం చేస్తామని, 2021 వేతన సవరణ 11శాతంగా అమలు చేయడానికి, ఆర్‌టిసిలో యూనియన్ కార్యకలాపాలను కొనసాగించుకోవడానికి, ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్‌కి ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలియజేశారు. ఆర్‌టిసిలో కొన్ని కార్మిక సంఘాలు సమ్మెను విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నం చేసినా మొక్కవోని ధైర్యంతో ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పడిన ఆరు సంఘాల జెఎసి కార్మిక వర్గాన్ని సమీకరించి పెద్ద ఎత్తున సమ్మెను విజయవంతం చేసిదన్నారు. వేతన సవరణకు సంబంధించిన, రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలను చెల్లించడానికి, వేతన సవరణ బకాయిలను కూడా రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించడానికి అంగీకరించినారన్నారు. ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెఎసి చారిత్రక ఉద్యమం నిర్వహించి 32డిమాండ్‌లు సాధించుకోవడం జరిగిందని తెలిపారు. ఇప్పుడు ఆర్‌టిసి కార్మిక వర్గం అంత ఎంప్లాయిస్ యూనియన్‌ను బలపరిచి బలోపేతం చేయాలన్నారు. ఎంప్లాయీస్ యూనియన్ రీజినల్ గౌరవ అధ్యక్షుడు, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్‌టిసి కార్మికుల కోసం ఎఐటియుసి ఎప్పుడు అండగా నిలిచి పోరాడుతుందన్నారు. కార్మికుల శ్రేయస్సుకు ఎంప్లాయీస్ యూనియన్ పాటుపడుతుందని సంస్థ పరిరక్షణ కోసం యూనియన్ ఎప్పుడు ముందుంటుందని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి పాండురంగయ్య, నల్లగొండ రీజియన్ కార్యదర్శి ఎన్ఆర్‌సి రాజు, అధ్యక్షులు జమాల్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, నారాయణ, యాదయ్య, మైనోద్దీన్, హరి, మన్సూర్, బాబ, విజేరెడ్డి, జానీపాషా పాల్గొన్నారు. అనంతరం డిపో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జానీపాషా, అధ్యక్షుడిగా హరి, కార్యదర్శిగా జనార్ధన్‌రెడ్డి, కోశాధికారిగా యాదయ్య, ఉపాధ్యక్షులుగా కేవిఎన్‌రావు, సహాయ కార్యదర్శిగా లక్ష్మ య్య, ముఖ్య సలహాదారులుగా డివి నారాయణలను ఎన్నుకున్నారు.

# బాధ్యతలు విస్మరించి మా ప్రభుత్వంపై విమర్శలా?



- ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్ర సర్కార్‌పై మంత్రి ఉత్తమ్ మండిపాటు
- బిజెపి పాలిత రాష్ట్రాల కంటే తెలంగాణలోనే ఎక్కువ ధాన్యం కొనుగోలు చేస్తున్నామని వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్ర ప్రభుత్వం తన బాధ్యతను నిర్వర్తించడం లేదని, పైగా రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారని రాష్ట్ర నీటి పారుదల,పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాల కంటే తెలంగాణ రాష్ట్రంలోనే రెట్టింపు ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, కేంద్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే, బిజెపి ప్రజాప్రతినిధులు, నాయకులు ఇక్కడ యాత్రలు చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో తనను కలిసిన కొందరు జర్నలిస్టులతో ఉత్తమ్ కుమార్ రెడ్డి మంగళవారం ఇష్టాగోష్టిగా మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేస్తుందని, ఈ ధాన్యం మొత్తాన్ని కేంద్రమే కొనుగోలు చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 8575 కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు చేస్తున్నామని, రాష్ట్రంలో చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో నిధులను జమ చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వమే కనీస మద్దతు ధరతో ధాన్యం తీసుకోవాలని, కానీ కనీస మద్దతు ధరతో కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఏ రాష్ట్రం ఎంత ధాన్యం కొనుగోలు చేసిందో బిజెపి నాయకులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**గత బిఆర్ఎస్ కంటే రూ.5 వేల కోట్లు ఎక్కువే ఖర్చు.....**

ధాన్యం కొనుగోలు విషయంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం కంటే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.5 వేల కోట్లను ఎక్కువ ఖర్చు చేశామని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం రూ.3500 కోట్ల నిధులను విడుదల చేస్తే,తాము రూ.11,500 కోట్లను ఇచ్చామని వివరించారు. మేలో ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.9 వేల కోట్లను ఇచ్చామని ఉత్తమ్ తెలిపారు. ఈ నెల 25వ తేదీ వరకు (సోమవారం) నాటికి 54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని స్పష్టం చేశారు.

# ఐటి హబ్ నడిబొడ్డున 'డెబ్రిస్' కొండలు

- పదేళ్లుగా నిర్మాణ వ్యర్థాల పారబోత
- సవాల్‌గా మారిన తొలగింపు ప్రక్రియ
- రూ.95 కోట్ల వ్యయం
- నిస్సహాయతలో స్థానికులు
- తలపట్టుకున్న సిఎంసి అధికారులు !



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రపంచస్థాయి ఐటి కంపెనీలు, ఆకాశాన్నంటే వాణిజ్య సముదాయాలు, హైక్లాస్ గేటెడ్ కమ్యూనిటీలకు నెలవైన హైటెక్ సిటీలో నిర్మాణ వ్యర్థాలతో కూడిన భారీ గుట్ట అందవికరంగా మారింది. సంవత్సరాల తరబడి నిర్మాణ వ్యర్థాలను అక్రమంగా పారబోస్తున్న అప్పట్లో అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సిఎంసి) భారీ మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఐక్యా జంక్షన్ నుంచి మీనాక్షి టవర్స్, రాంకీ టవర్స్ వైపు వెళ్లే ప్రధాన మార్గంలో సుమారు 13 ఎకరాల విస్తీర్ణంలో 18 మీటర్ల ఎత్తున నిర్మాణ వ్యర్థాలు (సి అండ్ వేస్ట్)తో పాటు చెత్త కుప్పలు కొండల్లా పేరుకుపోయాయి. హైదరాబాద్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన వెస్ట్ సిటీ ఐకానిక్ స్థలంలో వెలిసిన ఈ 13 ఎకరాల 'డెబ్రిస్ మౌంటెయిన్స్' సమస్యను అధికారులు ఎలా అధిగమిస్తారు?, కాలుష్యం కలగకుండా, కోట్లాది రూపాయల ఖర్చు భరిస్తూ ఈ వ్యర్థాలను ఎలా క్లియర్ చేస్తారు? అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. దీనిపై అధికారులు ఎలాంటి తుది నిర్ణయం తీసుకుంటానే విషయం ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది.

**పదేళ్లుగా పారబోస్తున్న పట్టించుకోలే..**

గత పదేళ్లుగా చుట్టుపక్కల జరిగిన భారీ నిర్మాణాలకు సంబంధించిన వ్యర్థాలన్నింటిని బిల్డర్లు ఇక్కడే పారబోయడంతో ఈ ప్రాంతమంతా ఇప్పుడు ఒక పెద్ద డంపింగ్ యార్డ్‌గా మారిపోయింది. సుమారు 15 లక్షల మెట్రిక్ టన్నుల వరకు వ్యర్థాలు పేరుకపోయాయి. ప్రస్తుతం ఈ భూమిపై కోర్టులో ప్రభుత్వానికి, ప్రైవేట్ వ్యక్తులకు మధ్య వివాదం నడుస్తోంది. కేవలం సిమెంట్, ఇటుకల వ్యర్థాలే కాకుండా పాడైపోయిన పరుపులు, ఫర్నిచర్, థర్మాకోల్ షీట్లు, పైపులు, అట్టముక్కలు కూడా ఇక్కడ వేస్తున్నారు. ఇటీవలే సిఎంసి కమిషనర్ సృజన ఈ ప్రాంతాన్ని సందర్శించి, పరిస్థితిని సమీక్షించారు. అయితే ఈ వ్యర్థాలను ఇక్కడి నుంచి తొలగించడం అధికారులకు అతిపెద్ద సవాలుగా మారింది. దీనికోసం అధికారుల ముందు రెండు మార్గాలు ఉన్నప్పటికీ, రెండూ కత్తిమీద సాములాగే మారాయి. దుండిగల్ (కుత్బుల్లాపూర్) ప్లాంట్‌కు తరలించేందుకు సుమారు రూ.90 నుండి రూ.95 కోట్ల వరకు వ్యయం అవుతుందని అధికారులు ప్రాథమికంగా అంచన వేశారు. ఇంత భారీ పరిణామంలో వ్యర్థాలను రోజుల తరబడి తరలించాల్సి ఉంటుంది. అది కూడా రాత్రి సమయంలోనే తరలించాల్సి ఉంటుంది. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులతో పాటు భారీ వాహనాల రాకపోకలతో రహదారులు పాడైపోయే పరిస్థితులు ఉంటాయి. స్థానికంగానే వ్యర్థాల పునర్వినియోగ ప్లాంట్ ఏర్పాటు ఏర్పాటు చేయాలంటే రూ. 35 కోట్లు ప్లాంట్‌కు వ్యయం అవుతుంది. ప్లాంట్ ఏర్పాటు చేసి, శాస్త్రీయంగా పునర్వినియోగం చేయాలంటే, చుట్టు పక్కల ఉన్న ఐటి కారిడార్, రెసిడెన్షియల్ ఏరియాల్లో భారీగా వాయు కాలుష్యం ఏర్పాడుతుంది. గాలి దుమారం వచ్చినప్పుడల్లా ఈ కొండల నుంచి ధూళి, పాత బట్టలు, ప్లాస్టిక్ వ్యర్థాలు ఎగిరివచ్చి చుట్టుపక్కల ఉన్న ఇళ్లలో, రోడ్లపై పడుతున్నాయి. వర్షాలు పడితే పరిస్థితి మరింత ఘోరంగా పరిస్థితులు మారుతోందని స్థానికులు చెప్పారు. పదేళ్లుగా అధికారులు పట్టించుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

**విఫలమైన అధికారయంత్రాంగం..**

గతంలో జిహెచ్‌ఎంసి పరిధిలో ఉన్న ఈ ప్రాంతంలో మొదటి నుంచే అక్రమ డంపింగ్‌ను అరికట్టడంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమయ్యిందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సంబంధిత అధికార యంత్రాంగం పట్టించుకోపోవడంతోనే ఐటి కేంద్రంలో నిర్మాణ వ్యర్థాల డంపింగ్‌తో అందవికరంగా మారిందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. జిహెచ్‌ఎంసిలో సిఎన్‌డి వేస్ట్ విభాగం ఇందుకు కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. నగరం నలువైపులా అందుకు సంబంధించిన ప్రైవేట్ సంస్థలతో ప్లాంట్‌లు సైతం ఏర్పాటు చేయించారు. అయితే ఐటి కారిడార్‌లో నిర్మాణాలు చేపట్టిన వారు ఏవరూ కూడా ఈ ప్లాంట్‌లకు నిర్మాణ వ్యర్థాలను ఇవ్వకపోవడంతో పాటు సమీపంలో వివాదస్పంద భూమిలో వ్యర్థాలను పారబోస్తు వచ్చారు. ఆది కాస్తీ రోజు రోజుకు భారీ కొండగా మారిపోయింది. భవన నిర్మాణ అనుమతులు పొందే బిల్డర్లు, డెవలపర్లకు జిహెచ్‌ఎంసి టౌన్‌ప్లానింగ్ అధికారులు సిఎన్‌డి వేస్ట్, యంత్రాంగం కానీ అవగాహన కల్పించడంతో విఫలమయ్యారు. ఎప్పటికప్పుడు బహిరంగ ప్రదేశాల్లో నిర్మాణ వ్యర్థాలను పారబోసే సంస్థలపై భారీ మొత్తంలో జారీమానాలు విధిస్తే ప్రస్తుతం ఈ పరిస్థితి వచ్చేదికాదని పలువురు అంటున్నారు.

# గాంధీ ఆస్పత్రి నుంచి ఖైదీ పరార్..

**ప్రజాపక్షం/హైదరాబాద్:** చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తీసుకువచ్చిన ఓ రిమాండ్ ఖైదీ అక్కడి నుంచి తప్పించుకోవడం కలకలం రేపింది. చంచల్‌గూడ కేంద్ర కారాగారం నుంచి వైద్య పరీక్షల నిమిత్తం తీసుకువచ్చిన ఖైదీ ఆస్పత్రి నుంచి పరారైన ఘటనపై చిలకలగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం యాకుత్‌పురాకు చెందిన సయ్యద్ అమీర్ హుస్సేన్ ఓ కేసులో ఈ నెల 19న చంచల్‌గూడ జైలుకు వచ్చాడు. రిమాండ్ ఖైదీగా ఉన్న అమీర్ హుస్సేన్ ఆదివారం జైలులో ఇనుప మేకులు తిన్నాడు. దీంతో తీవ్ర అస్వస్థతకు గురైన హుస్సేన్‌ను జైలు అధికారులు చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. అదేరోజు అక్కడి నుంచి పోలీసుల పర్యవేక్షణలో ఉన్న సమయంలో తప్పించుకున్నట్లు కున్నాడు. ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు అప్రమత్తమై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఆస్పత్రి పరిసర ప్రాంతాలతో పాటు నగరంలోని కీలక ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. సిసిటివి ఫుటేజ్‌ను పరిశీలిస్తూ ఖైదీ కదలికలపై వివరాలు సేకరిస్తున్నారు. రిమాండ్ ఖైదీ ఎలా తప్పించుకున్నాడు? భద్రతా లోపాలు ఏమైనా జరిగాయా? అనే కోణాల్లో కూడా విచారణ కొనసాగుతోంది. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.చిలకలగూడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# తాగునీటి సరఫరాకు 'విజన్ 2047'

- రాబోయే రోజుల్లో కృష్ణా ఫేజ్-4, 5లకు ప్లాన్
- హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం



**ప్రజాపక్షం/సిటీబ్యూరో :** హైదరాబాద్ నగర భవిష్యత్తు అవసరాలను, పెరుగుతున్న విస్తీర్ణాన్ని దృష్టిలో ఉంచుకుని 'విజన్ 2047'కు అనుగుణంగా త్రాగునీటి సరఫరా, డ్రైనేజీ వ్యవస్థలను బలోపేతం చేస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం జలమండలి కార్యాలయంలో ఆయన ఉన్నతాధికారులతో కలిసి క్యూర్ పరిధిలో తాగునీటి లభ్యత, డ్రైనేజీ పరిస్థితులు, కొనసాగుతున్న అభివృద్ధి పనులపై మైనారిటీ శాఖ మంత్రి అజహారుద్దీన్, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి,డైరెక్టర్ సుదర్శన్, జేఎండీ మయాంక్ మిట్టల్‌లతో కలిసి సమగ్ర సమీక్ష నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. భవిష్యత్తు అవసరాల కోసం రూ.7,000 కోట్లతో గోదావరి ఫేజ్2 గత పదేళ్ల (2014–2023) కాలంలో హైదరాబాద్ భవిష్యత్తు నీటి అవసరాలపై ఎలాంటి ముందస్తు ప్రణాళికలు, ఆచరణాత్మక ఆలోచనలు జరగలేదని మంత్రి విమర్శించారు. గత పదేళ్లలో ఒక్క ఎంజీడీ (ఎజిడి) అదనపు నీటి కోసం కూడా ప్లాన్ ఆఫ్ యాక్షన్ చేయలేదన్నారు. ప్రస్తుతం నగరంలో ఉన్న కృష్ణా, గోదావరి, సింగూరు, మంజీరా, ఉస్మాన్ సాగర్, హిమాయత్‌సాగర్ వంటి అన్ని వనరుల ద్వారా దాదాపు 650 ఎంజీడీల నీటి సామర్థ్యం ఉండగా, ప్రస్తుతం 550 ఎంజీడీల నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.భవిష్యత్తు అవసరాలను గుర్తించి, ఇటీవల సీఎం రూ.7,000 కోట్ల వ్యయంతో 300 ఎంజీడీల సామర్థ్యంతో 'గోదావరి ఫేజ్2' ప్రాజెక్టుకు గండిపేట్‌లో శంకుస్థాపన చేశారని, ప్రస్తుతం ఆ పనులు వేగంగా జరుగుతున్నాయని వివరించారు. రాబోయే రోజుల్లో కృష్ణా ఫేజ్4, ఫేజ్5 ప్రాజెక్టులను కూడా ప్లాన్ చేస్తున్నట్లు ప్రకటించారు. 40, 50 ఏళ్ల క్రితం నాటి సింగూరు, మంజీరా పైప్లైన్ల మార్పిడి ప్రక్రియను కూడా ప్రారంభించామని, దీని ద్వారా నీటి వృథా తగ్గి సామర్థ్యం పెరుగుతుందని చెప్పారు.

**సమస్యలను అధిగమిస్తున్నాం..**

పారదర్శకత.. యాంత్రీకరణే లక్ష్యం ప్రభుత్వం తీసుకుంటున్న నిరంతర ఫాలోఅప్ చర్యల వల్ల నీటి సరఫరాలో సమస్యలను అధిగమిస్తున్నామని మంత్రి పొన్నం తెలిపారు. భవిష్యత్తులో జలమండలి సేవల్లో మరింత సామర్థ్యం, పారదర్శకత, లభ్యతను పెంచేందుకు వీలుగా వ్యవస్థను పూర్తిస్థాయిలో యాంత్రీకరణ చేసేందుకు ప్రయత్నిస్తున్నామని వివరించారు. నగరం రోజురోజుకూ విస్తరిస్తున్న తరుణంలో డ్రైనేజీ (సివరేజ్), తాగునీటి నెట్‌వర్క్ సంబంధించి ఎలాంటి లోటుపాట్లు లేకుండా, అన్ని రకాల ముందస్తు జాగ్రత్తలతో పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి స్పష్టం చేశారు.

**సేవల వివరాలు..**

జలమండలి పరిధి, సేవల విస్తృతిని మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ క్రింది గణాంకాల ద్వారా వివరించారు.

**మొత్తం నల్లా కనెక్షన్లు :** దాదాపు 14,50,000
**ఉచిత నీటి సరఫరా కనెక్షన్లు :** 6,23,000
**సివరేజ్ నెట్‌వర్క్ :** 14,000 కిమీ పైచిలుకు
**మ్యాన్‌హోల్స్ సంఖ్య :** 6,14,000
**ట్రంక్ సీవర్ లైన్ :** 660 కిలోమీటర్లు



# భూములు కాపాడేందుకు ఆందోళనలు

## టిఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వివిధ ప్రాజెక్టుల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం లక్షల ఎకరాల భూమిని కొల్లగొట్టేందుకు ప్రయత్నిస్తోందని, ఈ భూములను కాపాడేందుకు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని, అవసరమైతే మహాసభను ఏర్పాటు చేస్తామని టిఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. భూ నిర్వాసితులకు న్యాయం చేసే వరకు పోరాటం చేస్తూనే ఉంటామన్నారు.'ధర్మ సమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహారాజ్, వెలుగుమట్ల ఇండ్ల కూల్చివేత బాధితులతో పాటు ట్రిపుల్ ఆర్,నిర్వాసితులు, పరిగి మండలం కడ్లాపూర్ ఇండస్ట్రియల్ పార్క్ బాధితులతో కలిసి మంగళవారంహైదరాబాద్‌లోని లోక్‌భవన్‌లో గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో కవిత సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వెలుగుమట్లలో ఇండ్ల కూల్చివేతలు,ట్రిపుల్ ఆలైన్‌మెంట్ మార్పులు, రాయగిరిలో ట్రిపుల్ ఆర్ కోసం భూసేకరణ, కడ్లాపూర్‌లో ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో పేదల భూములకు సంబంధించిన అంశాన్ని గవర్నర్‌కు వివరించారు. అనంతరం కవిత మీడియాతో మాట్లాడారు. రేవంత్ ప్రభుత్వం పేదలకు చేస్తున్న అన్యాయాన్ని అడ్డుకోవాలని గవర్నర్‌ను కోరామని, తాము చెప్పిన అంశాలను గవర్నర్ ఓపికతో విన్నారని, కచ్చితంగా న్యాయం చేస్తామని హామీనిచ్చారని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేద ప్రజల పట్ల అత్యంత కర్కోటకంగా, దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. భూ నిర్వాసితుల సమస్యల పరిష్కారం విషయంలో ప్రభుత్వానికి కొన్ని రోజులు సమయం ఇస్తామని, ఆ తర్వాత సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోతే మళ్లీ పోరాట బాట పడతామని కవిత స్పష్టం చేశారు. ఫోర్త్ సిటీ, ట్రిపుల్ ఆర్, పరిగి ఇండస్ట్రియల్ కారిడర్, వెలుగుమట్లలో భూ దోపిడీకి ప్లాన్ వేశారని ఆరోపించారు.

# 'ఎబోలా'పై ప్రభుత్వం అత్యంత అప్రమత్తం

## ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు : మంత్రి దామోదర్ రాజనర్సింహ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో ఇప్పటి వరకు 'ఎబోలా' కేసులు నమోదు కాలేదని, ఆ లక్షణాలు ఉన్న వ్యక్తులను కూడా గుర్తించలేదని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ స్పష్టం చేశారు. 'ఎబోలా' అంశంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అత్యంత అప్రమత్తంగా ఉందని భరోసనిచ్చారు. రాష్ట్రంలోకి 'ఎబోలా' ప్రవేశించకుండా ఎయిర్‌పోర్ట్‌లోనే పటిష్టమైన చర్యలు చేపట్టామన్నారు. ఆఫ్రికాలోని కొన్ని దేశాల్లో ఎబోలా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు, సన్నద్ధత పట్ల హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ కార్యాలయంలో మంత్రి దామోదర రాజనర్సింహ మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టియానా జెడ్ చొంగ్తు, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవిందర్ నాయక్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరేంద్ర కుమార్, రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లా డుతూ ప్రజారోగ్య రక్షణ కోసం అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నామని, ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు ఆరోగ్య వ్యవస్థ సిద్ధంగా ఉందన్నారు. వ్యాధి లక్షణాలు ఉన్న ప్రయాణికులను వెంటనే గాంధీ హాస్పిటల్‌లోని ఐసోలేషన్ వార్డుకు తరలించాలని, ప్రభుత్వ హాస్పిటల్స్ అన్నీ అప్రమత్తంగా ఉండాలని, ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ ప్రోటోకాల్స్‌ను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. విమానాశ్రయ అధికారులు, జిల్లా నిఘా బృందాలు, హాస్పిటల్స్ మధ్య సమన్వయం పటిష్టంగా ఉండాలన్నారు.

**కేంద్ర మార్గదర్శకాల మేరకే ముందస్తు చర్యలు**

ఎబోలా విషయంలో తీసుకుంటున్న జాగ్రత్తలు, ప్రస్తుత పరిస్థితి తదితర అంశాలను అధికారులు మంత్రికి వివరించారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు రాష్ట్రంలో అవసరమైన అన్ని ముందస్తు చర్యలూ చేపట్టామని వారు తెలిపారు. డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండా, సౌత్ సూడాన్ వంటి 'ఎబోలా' బాధిత దేశాల నుంచి వచ్చే ప్రయాణికులను శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలోనే స్క్రీనింగ్, థర్మల్ స్కానింగ్ చేస్తున్నామని, వారిని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని వివరించారు. విమానాశ్రయంలో డాక్టర్లు, హెల్త్ ఇన్‌స్పెక్టర్లు, ఫీల్డ్ స్టాఫ్, పారామెడికల్ సిబ్బందితో ప్రత్యేక బృందం విధులు నిర్వహిస్తోందని వైద్య అధికారులు తెలిపారు. అత్యవసర పరిస్థితుల నిమ్మితం 108 అంబులెన్సులను 24 గంటలపాటు అందుబాటులో ఉంచుతున్నామన్నారు.

**నోడల్ అధికారిగా డాక్టర్ సునీల్**

గాంధీ హాస్పిటల్‌లో 10 పడకల ప్రత్యేక ఐసోలేషన్ వార్డులను ఏర్పాటు చేశామని, జనరల్ మెడిసిన్ హెచ్‌ఓడి, డాక్టర్ సునీల్ కుమార్‌ను నోడల్ అధికారిగా నియమించామని వైద్య అధికారులు తెలిపారు. అనుమానితుల శాంపిల్స్ పరీక్షల కోసం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (ఎన్ఐవి), పుణేకు శాంపిల్స్‌ను పంపించనున్నామన్నారు. 'ఎబోలా' వ్యాప్తి ఉన్న దేశాల నుంచి వచ్చిన, లక్షణాలు లేని ప్రయాణికులను 21 రోజుల పాటు ఇంట్లోనే సెల్ఫ్ ఐసోలేషన్‌లో ఉంచుతున్నారని. వీరిపై జిల్లా నిఘా బృందాల ద్వారా పర్యవేక్షిస్తున్నామని వారు వివరించారు. ఈ నెల 25వ తేదీ నాటికి 58 మంది ప్రయాణికులు ఎబోలా వ్యాప్తి ఉన్న దేశాల నుంచి హైదరాబాద్‌కు చేరుకున్నారని, వీరిలో ఎవరికీ వ్యాధి లక్షణాలు లేవని అధికారులు వివరించారు. అయినప్పటికీ వారిని కేటగిరీ 1 కింద వర్గీకరించి, 21 రోజుల హోమ్ ఐసోలేషన్‌లో ఉంచామని తెలిపారు.

# హైదరాబాద్‌కు మరో 60 ఎలక్ట్రిక్ బస్సులు

## -టిజిఎస్‌ఆర్‌టిసి 500 ఇ-బస్సుల ప్రాజెక్టు పూర్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగర ప్రజా రవాణాలో గ్రీన్ మొబిలిటీకి మరింత వేగం చేకూర్చేలా హైదరాబాద్ రోడ్లపైకి మరో 60 కొత్త ఓలెక్ట్రా ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయి. ఈ చేరికతో టిజిఎస్‌ఆర్‌టిసి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 500 ఎలక్ట్రిక్ సిటీ బస్సుల ప్రాజెక్టు తుది దశకు చేరుకుని పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానుంది. దీంతో రోజువారీగా ఈ బస్సులను వినియోగించే ప్రయాణికుల సంఖ్య ప్రస్తుతం ఉన్న లక్ష నుంచి 1.2 లక్షలకు పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. టిజిఎస్‌ఆర్‌టిసి–ఇవి ట్రాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త భాగస్వామ్యంతో అమలు చేసిన ఈ ప్రాజెక్టులో భాగంగా ఓలెక్ట్రా తయారు చేసిన 12 మీటర్ల లోఫ్లోర్ ఎలక్ట్రిక్ బస్సులను బుధవారం కూకట్‌పల్లి డిపోలో ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎండి వై. నాగిరెడ్డి, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు. ఇప్పటికే కంటోన్మెంట్, హెచ్‌సీయూ, మియాపూర్, హయత్‌నగర్, రాణిగంజ్ డిపోల పరిధిలో 440 ఎలక్ట్రిక్ బస్సులు విజయవంతంగా సేవలందిస్తున్నాయి. ఇప్పుడు చివరి విడతగా మరో 60 బస్సులు చేరడంతో మొత్తం 500 బస్సుల నెట్‌వర్క్ పూర్తవుతోంది.



పిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి బి. మహేష్ కుమార్ గౌడ్ జన్మదిన సందర్భంగా తెలంగాణ టూరిజం కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి కలిసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# కష్టం కార్మికులది – ఫలితం అధికారులదా?

## ఆర్‌టిసి ఇయు అధ్యక్షుడు ఎస్. బాబు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆర్‌టిసి కార్మికులు ఎంతో కష్టపడి, సమ్మె చేసి సాధించుకున్న వేతన సవరణ (పిఆర్‌సి) ఫలితాలు కార్మికులకు దక్కకుండా అధికారులకు, సూపర్‌వైజర్లకు లాభం చేకూర్చేలా ఉన్నాయని తెలంగాణ ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.బాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'కష్టం కార్మికులది – ఫలితం మరొకరిది' అన్నట్లుగా ఆర్‌టిసి యాజమాన్యం వ్యవహరిస్తోందని ఆయన ఒక ప్రకటనలో దుయ్యబట్టారు. తమ దీర్ఘకాలిక పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఆర్‌టిసి కార్మికులు ఏప్రిల్ 22 నుండి 3 రోజుల పాటు ఉధృతమైన సమ్మెలో పాల్గొన్నారని, తెలంగాణ కేబినెట్ సబ్ కమిటీతో జరిపిన చర్చల ఫలితంగా, ఆర్‌టిసి ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేయడం, ట్రేడ్ యూనియన్‌లను పునరుద్ధరించడం, 2021 వేతన సవరణ అమలు చేయడం వంటి కీలక డిమాండ్‌లను సాధించుకున్నారన్నారు. అయితే, తాజాగా ఆర్‌టిసి యాజమాన్యం విడుదల చేసిన 2021 వేతన సవరణ ఆదేశాలు కార్మికవర్గాన్ని తీవ్ర వంచనకు గురిచేసేలా ఉన్నాయని బాబు విమర్శించారు. 2021 వేతన సవరణకు సంబంధించి 5 సంవత్సరాల వేతన బకాయిల (ఎరియర్స్) ప్రస్తావనే ఆ ఉత్తర్వులలో లేకపోవడం దారుణం. 2021 నుండి రిటైరైన ఉద్యోగుల బకాయిల ఊసే యాజమాన్యం ఎత్తలేదన్నారు. దశాబ్దాల కాలంగా కార్మికులకు రావాల్సిన స్పెషల్ గ్రేడ్స్ (12 సంవత్సరాలు, 20 సంవత్సరాలు) అలాగే ఉండిపోయాయన్నారు. ఈ పిఆర్‌సిలో అయినా మార్పు వస్తుందనుకుంటే నిరాశే మిగిలిందన్నారు. సమ్మెను భగ్నం చేయడానికి విశ్వప్రయత్నం చేసిన అధికారులు, సూపర్‌వైజర్లకు మాత్రం యాజమాన్యం పెద్దపీట వేసిందని చెప్పారు. గత 2 దశాబ్దాలుగా వారికి ఉన్న గ్రేడ్ పేను, ప్రభుత్వం లో విలీనం అయ్యాక ఎక్కడ పోతుందోననే ముందస్తు జాగ్రత్తతో బేసిక్ పేలో విలీనం చేసుకున్నారన్నారు. ఇది చీమలు పెట్టిన పుట్టలో పాములు వచ్చి చేరినట్లు ఉందని బాబు మండిపడ్డారు. ఏపిఎస్ ఆర్‌టిసిలో విలీనం తర్వాత ఈ గ్రేడ్ పేను పూర్తిగా తీసివేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. గత 20 ఏళ్లుగా టైపిస్టుల స్పెషల్ పేను బేసిక్ పేలో కలపాలని డిమాండ్ చేస్తున్నా పట్టించుకోని యాజమాన్యం, అధికారుల గ్రేడ్ పేను మాత్రం చట్టాపట్టాలు కట్టి కలపడం ఏంటని ప్రశ్నించారు. 2013 నాటి అలవెన్సులనే 2021లోనూ కొనసాగించడం హాస్యాస్పదమన్నారు. జాయింట్ యాక్షన్ కమిటీతో జరిపిన చర్చల్లో 80 శాతం అలవెన్సులు పెంచుతామని చెప్పిన యాజమాన్యం, సర్క్యులర్‌లో ఆ విషయాన్ని నొక్కిపెట్టిందన్నారు. సిసిఏ కూడా పెంచలేదన్నారు. ప్రతి 4 ఏళ్లకు వేతన సవరణ జరిగే ఆర్‌టిసిలో, ఇంక్రిమెంట్‌ల స్పాన్‌ను 6 సంవత్సరాలు పెట్టడం కార్మికులను దగా చేయడమే అన్నారు. అలాగే కార్మికులకు ఉన్న ఫ్యామిలీ ప్లానింగ్ ఇంక్రిమెంట్‌ను కూడా తొలగించారన్నారు.

**యూనియన్ ప్రధాన డిమాండ్‌లు..**

- విడుదల చేసిన పిఆర్‌సి ఉత్తర్వులను వెంటనే సవరించాలి.
- కెరియర్ అడ్వాన్స్ మెంట్ స్కీమ్‌ను డ్రైవర్లు, కండక్టర్లతో పాటు ఇతర కార్మికులందరికీ వర్తింపజేయాలి.
- టైపిస్టుల స్పెషల్ పేను కూడా బేసిక్ పే లో విలీనం చేయాలి.
- చర్చల్లో అంగీకరించినట్లుగా 80 శాతం అలవెన్సులు పెంచుతూ వెంటనే కొత్త సర్క్యులర్ విడుదల చేయాలి.
- 2021 వేతన సవరణ ఎరియర్స్‌తో పాటు, 2017, 2021 లో రిటైరైన కార్మికులందరికీ వేతన సవరణ బకాయిలను తక్షణమే చెల్లించాలి.
- కార్మికుల కష్టాన్ని గుర్తించి, యాజమాన్యం తక్షణమే స్పందించకపోతే తదుపరి చర్యలకు సిద్ధమవ్వాల్సి ఉంటుందని బాబు హెచ్చరించారు.

# జిఎస్‌టి పరిధిలోకి పెట్రోల్, డీజిల్, గ్యాస్

## సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర ప్రభుత్వం మోసపూరిత మాటలు విడనాడి వెంటనే పెట్రోల్, డీజిల్, గ్యాస్‌లను జిఎస్‌టి పరిధిలోకి తీసుకురావాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్ డిమాండ్ చేశారు. యుద్ధం సమయంలో భారతదేశానికి లాభకరమైన వ్యూహాత్మక విధానాన్ని అనుసరించడంలో విఫలమైన కేంద్ర ప్రభుత్వం కనీసం ఇప్పుడైనా తన పరిధిలోనే ఉన్న పెట్రోల్, డీజిల్‌పై జిఎస్‌టి విధించే చర్యలు తీసుకోవాలని డిమాండ్ బోస్ డిమాండ్ చేశారు. పెట్రోల్‌ను జిఎస్‌టి పరిధిలోకి తీసుకువస్తే పెట్రోల్ రేట్లు పెంచవల్సిన అవసరం ఉండదని, పైగా ఇప్పుడున్న రేట్లలో సగం రేట్లతో ప్రజలకు పెట్రోల్‌ను అందించే అవకాశం ఉంటుందని, ప్రజలపై భరించరాని భారం బలవంతంగా రుద్దవల్సిన అవసరం ఉండదన్నారు. స్వతంత్ర భారతంలో ఇప్పటి వరకు పాలన చేసిన ప్రధానమంత్రి ఎవరు కూడా మోదీ చేసినంత మోసం, ప్రజా దోపిడీ చేయలేదని ఆయన ఒక ప్రకటనలో విమర్శించారు. దేశంలో అనేక ఏళ్ల నుండి పెట్రోల్‌ను జిఎస్‌టి పరిధిలోకి తేవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నా రాష్ట్రాలు ఒప్పుకోవడంలేదనే సాకుతో పెట్రోల్‌ను జిఎస్‌టి పరిధిలోకి తేవడంలేదని, ఇది కూడా పెద్ద మోసంగా పరిగణించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు అనేక విషయాల్లో కేంద్ర విధానాలను అంగీకరించనప్పటికీ బలవంతంగా రాష్ట్రాలపై కేంద్ర నిర్ణయాలను రుద్దటం ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ (సర్)ను అన్ని ప్రతిపక్ష పార్టీలు, అనేక రాష్ట్రాలు వ్యతిరేకించినప్పటికీ కేంద్రం మొండిగా అమలు చేస్తూ ప్రజల ఓటు హక్కును హరిస్తున్నారనేది వాస్తవమన్నారు. కేంద్రం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానం, ఎలక్ట్రిసిటీ బిల్లు, పోస్టల్ బిల్లు, ఎల్‌ఐసి, బ్యాంకుల ప్రైవేటీకరణ బిల్లు, లేబర్ కోడ్లు లాంటి అనేక ఉదాహరణలు చెప్పే అవకాశం ఉన్నదన్నారు.



## నేర బాట విడిచి సామాజిక శ్రేయస్సుకు తోడ్పడాలి

### మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి

**ప్రజాపక్షం/జవహర్‌నగర్:** సమాజంలో యువత ఉత్తమ పౌరులుగా ఎదిగినప్పుడే దేశ గౌరవాన్ని ఇనుమడింపచేయాలని మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి అన్నారు. ముఖ్యంగా యువత చెడు వ్యసనాలకు, మార్గాలకు లోనుకాకుండా సత్ప్రవర్తనతో జీవించాలని సూచించారు. మంగళవారం ఆమె జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి, పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లు, పాత నేరస్తులను పిలిపించి ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో నేరాల నియంత్రణకు పోలీసు యంత్రాంగం ప్రాధాన్యత ఇస్తోందని, నేరాలను వదిలి పెట్టి సామాజిక గౌరవం కాపాడాలని సూచించారు. పాత నేరస్తులను కమిషనర్ ఒక్కొక్కరిగా విచారిస్తూ, ప్రస్తుత జీవన విధానాన్ని తెల్సుకొంటూ నేరాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. నేర ప్రవృత్తిని వీడి సత్ప్రవర్తనతో సమాజంలో ఉన్నతంగా బతుకుతూ ఆదర్శంగా నిలవాలని పిలుపిచ్చారు. ఈ కార్యక్రమంలో జవహర్‌నగర్ ఏసిపి చక్రపాణి, జవహర్‌నగర్ ఎస్‌హెచ్‌ఓ సైదులు, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.



## డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పనుల పరిశీలన

**ప్రజాపక్షం/ కూకట్‌పల్లి :** ఫతేనగర్‌లోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మంగళవారం పరిశీలించారు. ప్రజాపాలన అమృత్‌నగర్ తండాకు చెందిన 62మంది లబ్ధిదారులకు బుధవారం ఇళ్ల పంపిణీ జరుగనున్న నేపథ్యంలో అక్కడి మౌలిక సదుపాయాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కెసిఆర్ ప్రభుత్వ హయాంలో కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బాలానగర్ డివిజన్ ఫతేనగర్ ప్రాంతంలో తొలి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. అమృత్‌నగర్ తండా వాసులకు గతంలో లాటరీ ద్వారా 67మందికి ఇళ్లు కేటాయించగా, మిగతా 62మంది నిరుపేదలకు ప్రస్తుతం ఇళ్లు కేటాయిస్తున్నామని తెలిపారు. స్థానిక ప్రజలకు 10శాతం ఇళ్ల కేటాయింపుతో పాటు విలేకరులకు కూడా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబులకు విజ్ఞప్తి చేశారు. ఫతేనగర్‌లో అమృత్‌నగర్ తండా వాసులు ఖాళీ చేసిన స్థలంలో వారికి ఉపయోగపడే విధంగా కమ్యూనిటీ హాల్ నిర్మించాలని, ప్రభుత్వం స్పందించకపోతే సిఎస్‌ఆర్ నిధులతో తానే నిర్మిస్తానని ఎమ్మెల్యే వెల్లడించారు. నిరుపేద విషయంలో రాజకీయాలకు అతీతంగా పనిచేయాలని, ప్రజలకు మేలు జరిగే ప్రతి కార్యక్రమానికి తాను ముందుంటానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలుగుల బాబురావు, పందాల సతీష్‌గౌడ్, తూము శ్రావణ్ కుమార్, బిక్షపతి, అంబటి శ్రీనివాస్, ప్రభాకర్‌గౌడ్, ఎమ్మార్వో స్వామితో పాటు ఇంజనీరింగ్, హౌసింగ్, వాటర్ వర్క్స్, ఎలక్ట్రికల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కెటిఆర్ గులాబీ అద్దాలు తీసి చూడాలి

### కాంగ్రెస్ నేత జెన్న రాజు

**ప్రజాపక్షం/బోడుప్పల్ :** ప్రతి పేదవాడి సొంత ఇంటి కలను నెరవేర్చేందుకు ప్రజా పాలనలో భాగంగా కాంగ్రెస్ సర్కార్ ప్రతి పేద వారికి ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వడం అది జీర్ణించుకోలేని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ కాంగ్రెస్ ప్రజాపాలనపై అబద్ధపు ప్రచారం చేస్తూ ఉన్నారని కాంగ్రెస్ నేత జెన్న రాజు ఆరోపించారు. మంగళవారం బోడుప్పల్‌లోని తన నివాసంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక పేదల సొంత ఇంటి కలను నెరవేర్చే ఉద్దేశంతో ప్రతి నియోజకవర్గానికి తొలి విడతగా మూడు వేల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసినట్లు జెన్న రాజు తెలిపారు. ఇప్పటికే అనేక ఇండ్లు పూర్తయి, లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేసుకుని సంతోషంగా నివాసం ఉంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో నూ కెటిఆర్ నిజాన్ని ఒప్పుకోలేక అబద్ధాల ప్రచారానికి దిగుతున్నారని జెన్న రాజు విమర్శించారు. నీకు ఇందిరమ్మ ఇండ్లు ఎక్కడ ఉన్నాయో అనుమానం ఉంటే ఒకసారి బోడుప్పల్ సర్కిల్ రా, మా మేడిపల్లి నగర్‌లో నిర్మించుకున్న, నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను దగ్గరుండి చూపిస్తా అంటూ ఆయన సవాల్ విసిరారు. అధికారం కోల్పోయిన నిరాశతో కెటిఆర్ నోటికి ఏది వస్తే అది మాట్లాడుతుండటం వల్ల తన రాజకీయ విలువను తానే కోల్పోతున్నారని జెన్న రాజు ఎద్దేవా చేశారు. బాధ్యత కలిగిన ప్రతిపక్ష నేతగా ప్రభుత్వానికి సలహాలు ఇవ్వడంలో తప్పు లేదని, వదిలేసి అబద్ధాలను నిజాలుగా చూపించి ప్రజలను మోసం చేయడానికి ప్రయత్నిస్తే మరోసారి ప్రజలు గట్టిగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

## తాగునీటి సమస్యలు రానీయొద్దు

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** వేసవికాలంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని మిషన్ భగీరథ డిఇ మహేందర్ అధికారితో ఫోన్ ద్వారా చర్చించడం జరిగిందని మాజీ మున్సిపల్ చైర్పర్సన్ ముల్లి పావనిజంగయ్య యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా పావని జంగయ్య యాదవ్ మాట్లాడుతూ ఘట్‌కేసర్ సర్కిల్ 6వ డివిజన్ పరిధిలోని గత ఐదు రోజులుగా మిషన్ భగీరథ మంచినీరు రావడం లేదని సంబంధిత డిఇ మహేందర్ అధికారులతో ఫోన్‌ద్వారా చర్చించగా ఘనపూర్ గుట్ట సమీపంలో పంప్ హౌస్ మోటార్ పాడైపోయిందని తెలిపారు. మోటర్‌ను తొందర్లో రిపేర్ చేసి మధ్యాహ్నంలోగా ప్రజలకు మంచినీటి సౌకర్యం కల్పిస్తామని డిఇ మహేందర్ అధికారి తెలిపారని ముల్లిపావని జంగయ్య యాదవ్ అన్నారు.

## కృష్ణారావు వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతల ఆగ్రహం

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** కూకట్‌పల్లి నియోజకవర్గంలో జరిగిన బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్యమంత్రిపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పిసిసి సభ్యులు, టిపిసిసి అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడటం మానుకోవాలని, హద్దులు దాటి విమర్శలు చేయడం సరికాదని హెచ్చరించారు. ప్రజలకు సేవచేయడం నేర్చుకోవాలని, రాజకీయ విమర్శలు బాధ్యతాయుతంగా ఉండాలని సూచించారు. హైదరాబాద్ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ప్రజా ప్రభుత్వం జిహెచ్‌ఎంసిని మూడు స్వతంత్ర కార్పొరేషన్లుగా విభజిస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని అన్నారు.

# ఫ్యూచర్ సిటీ సమీపంలో 'ఎకో టౌన్' ప్రాజెక్టు

- సిద్ధాపూర్‌లో సమీకృత వ్యర్థాల ప్రాసెసింగ్ ప్లాంట్ !
- జవహర్ నగర్ తరహాలో డంపింగ్ యార్డ్ కాదు - అధికారుల స్పష్టత
- రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్ధాపూర్‌లో 87 ఎకరాల కేటాయింపు
- వ్యర్థాల నుంచి విద్యుత్ ప్లాంట్‌తో శ్రీకారం
- అప్పుడే మొదలైన స్థానిక గ్రామాల నిరసనలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) పరిధిలోని మూడు మున్సిపల్ కార్పొరేషన్‌ల నుంచి వెలువడే వివిధ రకాల వ్యర్థాల శాశ్వత పరిష్కారానికి తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ప్రతిష్టాత్మక 'ఫ్యూచర్ సిటీ' అభివృద్ధి ప్రాంతానికి సమీపంలో ఒక అత్యాధునిక సమీకృత వ్యర్థాల ప్రాసెసింగ్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. 'ఎకో టౌన్'గా పిలిచే ఈ ప్రాజెక్టును ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) వెలుపల, రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలంలం సిద్ధాపూర్ గ్రామంలో ఏర్పాటు చేయనున్నారు. ఇందు కోసం తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టిజిఐఐసి)కి చెందిన సుమారు 87 ఎకరాల భూమిని కేటాయించినట్లు అధికారిక వర్గాల ద్వారా తెలిసింది.

**ఇది డంపింగ్ యార్డ్ కాదు.. రీసైక్లింగ్ హబ్ !**

నగరానికి శాపంగా మారిన జవహర్ నగర్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ తరహాలో సిద్ధాపూర్ సైట్ ఉండబోదని అధికారులు స్పష్టం చేశారు. జవహర్ నగర్‌లో వాయు, జల కాలుష్యంపై తీవ్ర వివాదాలు నడుస్తున్న నేపథ్యంలో, సిద్ధాపూర్ కేంద్రాన్ని కేవలం చెత్తను కుప్పలుగా పోసే డంపింగ్ యార్డ్‌గా ఉపయోగించబోమని భరోసా ఇచ్చారు. ఇది పూర్తిగా అత్యాధునిక రీసైక్లింగ్, వేస్ట్‌టురిసోర్స్ మేనేజ్‌మెంట్ ఫెసిలిటీగా పనిచేస్తుందని తెలిపారు. తడి, పొడి చెత్తతో పాటు ఈవేస్ట్ (ఎలక్ట్రానిక్ వ్యర్థాలు)ను ప్రాసెస్ చేసేందుకు ఇక్కడ స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ (అత్యున్నత ప్రమాణాలు గల) ప్లాంట్‌లను నెలకొల్పనున్నారు. ఇందులో భాగంగా మొదటి దశలో 'వేస్ట్‌టుఎనర్జీ' (వ్యర్థాల నుండి విద్యుత్) ప్లాంట్ను ఏర్పాటు చేయనున్నారు. ఇది జవహర్ నగర్ ఫెసిలిటీ నుండి వచ్చే రెఫ్యూజ్‌డెరైవ్డ్ ఫ్యూయల్ (ఆర్‌డిఎఫ్)ను ఇంధనంగా వాడుకోనుంది.

**జవహర్‌నగర్‌కు ఉపశమనం..**

ఈ కొత్త ప్లాంట్ ఏర్పాటు వల్ల జవహర్ నగర్‌కు వెళ్లే వ్యర్థాల పరిమాణం నేరుగా తగ్గకపోయినప్పటికీ, అక్కడ పేరుకుపోయిన చెత్తను వేగంగా ప్రాసెస్ చేయడానికి ఇది ఎంతగానో దోహదపడుతుంది. తద్వారా ఆ ప్లాంట్‌పై భారం తగ్గుతుందని అధికారులు విశ్లేషిస్తున్నారు. ప్రస్తుతం జవహర్ నగర్ ప్లాంట్ దుర్వాసన, కాలుష్యం కారణంగా 5 కిలోమీటర్ల పరిధిలోని స్థానిక ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు.

**ప్రపంచంలోనే అత్యధిక ఉద్గారాల సైట్‌గా జవహర్ నగర్ !**

జవహర్ నగర్ లెగసీ డంప్ నుండి వెలువడుతున్న 'లీచేట్' (కలుషిత ద్రవం) కారణంగా చుట్టుపక్కల ఉన్న పలు జలాశయాలు పూర్తిగా విషతుల్యంగా మారాయి. దీనిపై స్థానికులు జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడి పోరాడుతున్నారు. కాగా, ఇటీవల 'యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియా, లాస్ ఏంజిల్స్'(యుసిఎల్ఎ) విడుదల చేసిన నివేదికలో ప్రపంచంలోనే అత్యధికంగా కాలుష్య ఉద్గారాలను విడుదల చేస్తున్న 25 వ్యర్థాల నిర్వహణ ప్రాంతాలలో జవహర్ నగర్ ప్లాంట్ కూడా ఒకటని తేలడం ఎంత ప్రమాదకరంగా మారిందో అర్థం చేసుకోవచ్చు.

**స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత**

నగరంలో వికేంద్రీకృత వ్యర్థాల ప్రాసెసింగ్ కోసం మున్సిపల్ అధికారులు స్థలాలను అన్వేషిస్తున్న ప్రతి చోటా స్థానికుల నుండి తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. సిద్ధాపూర్ ప్లాంట్ ప్రతిపాదనపై కూడా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అప్పుడే నిరసన గళం విప్పారు. గతంలో సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం ప్యారానగర్ గ్రామంలో దాదాపు ఖరారైన ప్లాంట్ సైట్, గ్రామస్థుల ఉధృత పోరాటాలు, తెలంగాణ హైకోర్టు స్టే ఇవ్వడంతో నిలిచిపోయింది. ఇప్పుడు సిద్ధాపూర్‌లోనూ అదే తరహా వ్యతిరేకత ఎదురవుతుంది. అయితే ఇది కేవలం రీసైక్లింగ్ ప్లాంట్ మాత్రమేనని, కాలుష్య రహితంగా ఉంటుందని ప్రజలకు అవగాహన కల్పించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

## ప్రభుత్వ పాఠశాల ఏర్పాటుపై నేడు రౌండ్ టేబుల్ సమావేశం



**ప్రజాపక్షం/జవహర్‌నగర్ :** జవహర్‌నగర్‌లోని గబ్బిలాల్‌పేటలో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటుకోసం స్థలాన్ని కేటాయించాలన్న డిమాండ్‌తో బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని సిపిఐ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటపల్లి శంకర్, కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరిలు ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. సమీప ప్రాంత పేద, మధ్య తరగతి, బడుగు, బలహీనవర్గాల నిరుపేద కుటుంబీకులకు ఈ ప్రాంతంలో ఏర్పాటు చేస్తే ప్రభుత్వ పాఠశాల అందుబాటులో ఉంటుందన్నారు. దీనికోసం గతంలోనే ప్రభుత్వం పాఠశాల ఏర్పాటు కోసం అనుమతించినా నేటికీ అమలుకు నోచుకోలేక పోయిందన్నారు.

రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా ఈ ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటే లక్ష్యంగా సాధించే వరకు పోరాటానికి భవిష్యత్తు కార్యాచరణను రూపొందించే లక్ష్యంగా బుధవారం ఉదయం దళిత సంక్షేమ భవన్‌లో ఉదయం 11 గంటలకు రౌండ్ టేబుల్ సమావేశం ప్రారంభమవుతుందన్నారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు, మీడియా, ప్రజా సంఘాల ప్రతినిధులు ఈ సమావేశంలో హాజరవ్వాలని కోరారు.




## రైతులకు అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** రైతులకు పచ్చిరొట్టె విత్తనాలు అందుబాటు ఉన్నాయని రైతులు ఇట్టి ఎరువులను రైతులకు సబ్సిడిపై అందజేస్తామని మూడుచింతలపల్లి మండల వ్యవసాయాధికారి ప్రవీనా అన్నారు. మంగళవారం మూడుచింతలపల్లి రైతు వేదికలో శామీర్‌పేట సొసైటి ఆద్వర్యంలో రైతులకు సబ్సిడిపై పచ్చిరొట్టె విత్తనాలను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులకు జీలుగా, జనుము విత్తనాలు సబ్సిడిపై రైతులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. జనుము విత్తనాలు 40 కిలోలు ప్యాకెట్ రూ. 3110, జీలుగ విత్తనాలు 30 కిలోలు ప్యాకెట్ రూ. 2452 రైతు ధరకు విక్రయిస్తామని చెప్పారు. ఎరువులు కావాల్సిన రైతులు వ్యవసాయ శాఖను సంప్రదించి పచ్చిరొట్టె విత్తనాలను పొందవలిసిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, ఎఎంసి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్, మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాం రవి, కౌన్సిలర్ నీరజ్‌గౌడ్. నవీన్, ఎఇఓ సురేష్‌రెడ్డి, నాయకులు భూమేష్‌గౌడ్, శ్రీకాంత్, శ్రీనివాస్, ఇంద్రసేనారెడ్డి, రైతులు పాల్గొన్నారు. **శామీర్‌పేటలో..** శామీర్‌పేట సొసైటిలో రైతులకు పచ్చిరొట్టె విత్తనాలు అందుబాటులో ఉన్నాయని సబ్సిడిపై ఎరువులను రైతులకు అందజేస్తామని శామీర్‌పేట మండల వ్యవసాయాధికారి రమేష్ మంగళవారంఒక ప్రకటనలో తెలిపారు.

## బండి భగీరథ్‌కు మూడు రోజుల పోలీస్ కస్టడీ



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** తెలంగాణా రాజకీయాల్లో తీవ్ర సంచలం సృష్టించిన పోక్సో కేసులో ప్రధాన నిందితుడైన కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను విచారించేందుకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కోర్టు మంగళవారం అనుమతించింది. కేసు విషయమై మరిం త లోతుగా విచారించాల్సి ఉందన్న కారణాన్ని చూపిస్తూ పేట్‌బషీరాబాద్ పోలీసులు న్యాయస్థానాన్ని పోలీస్ కస్టడీకి ఇవ్వాలని పిటిషన్ దాఖలు చేయగా దీని పై విచారించిన న్యాయస్థానం మూడురోజులపాటు పోలీస్ కస్టడీకి అనుమతిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుతం చర్లపల్లి కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీ గా ఉన్నాడు.



## మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా స్థిరపడాలి

### మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహయాదవ్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా స్థిరపడాలని మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్ అన్నారు. మంగళశారం మూడుచింతలపల్లి మున్సిపల్ కేశవరంలో ఎఆర్‌డిఓ స్వచ్ఛంద సంస్థ ఆద్వర్యంలో డ్వాక్రా భవనంలో 20 మంది మహిళలకు కుట్టుమిషన్ శిక్షణ ఇప్పించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహాయాదవ్ చేతుల మీదుగా మహిళలకు సర్టిఫికెట్‌లు ప్రధానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని స్వయంగా ఉపాధి అవకాశాలు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా వృద్ధిలోకి రావాలని సూచించారు. మహిళలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఆర్‌డిఓ స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధులు, కౌన్సిలర్‌లు బొమ్మలపల్లి మల్లేష్‌యాదవ్, కొంపల్లి మాధవి భూమేష్‌గౌడ్, అంగన్‌వాడి టీచర్ పద్మ, మహిళలు పాల్గొన్నారు.

## పరీవాహక ప్రాంతాలు ముంపునకు గురికాకుండా అభివృద్ధి చేస్తాం

### బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద

**ప్రజాపక్షం/నిజాంపేట్:** పరీవాహక ప్రాంతాలు ముంపుకు గురికాకుండా నాలాలను అభివృద్ధి చేస్తామని బిఆర్ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని కుత్బుల్లాపూర్ డివిజన్‌లో స్థానిక ఎమ్మెల్యే కెపి వివేకానంద విస్తృతంగా పర్యటించారు. డివిజన్‌లోని సూర్యనగర్, రాంరెడ్డి నగర్‌లలో మంగళవారం బిఆర్ఎస్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అధికారులతో కలిసి స్థానికంగా నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు.



రాంరెడ్డి నగర్‌లోని నాలా బ్రిడ్జిని పరిశీలించిన వివేక్ సుభాష్ నగర్ డివిజన్ గంపల బస్తీలో నిర్మాణంలో ఉన్న నాలా పనుల విషయంపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ నాలాల నిర్మాణంతో పరివాహక ప్రాంతాలు ముంపుకు గురికాకుండా ఉంటుందని తెలిపారు. నియోజకవర్గంలోని దాదాపు నాలాల అభివృద్ధి పూర్తయిందని, గత పన్నెండేళ్ల కాలంలో ప్రణాళిక బద్ధంగా నాలాలను అభివృద్ధి చేశామని వివరించారు. పూర్తిస్థాయి నాలాల అభివృద్ధి ద్వారా జీరో ముంపు రహిత ప్రాంతంగా నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. నాలాల నిర్మాణ పనుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. నియోజకవర్గంలో అన్ని డివిజన్‌లలో కోట్లాది రూపాయల నిధులతో కాలనీల గుండా ప్రవహించే మురుగు కాలువలకు ఇప్పటికే రిటర్నింగ్ వాల్‌ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. వర్షాకాలంలో కాలనీలు, బస్తీలలోకి వరద నీరు, మురుగు నీరు చేరకుండా బ్రిడ్జి నిర్మాణ పనులను చేపట్టామని అన్నారు. రాంరెడ్డి నగర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులను మంజూరై టెండర్ ప్రక్రియ సైతం పూర్తయిందని, త్వరలోనే నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి పనులను ప్రారంభిస్తామని తెలిపారు.

బ్రిడ్జి నాలా పనులతో పాటు సూర్యనగర్‌లో అంతర్గత సిమెంటు రోడ్లు, స్టామ్ వాటర్ పనులను త్వరితగతిన చేపట్టి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులను వివేక్ ఆదేశించారు. ఈ సందర్భంగా స్థానికంగా గల శ్రీ హనుమాన్, శ్రీ శక్తి గణపతి దావాలయాల్లో వివేకానంద ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ రవి, విద్యుత్ ఎఇ రవిందర్ రెడ్డి, జిహెచ్‌ఎంసి ఎఇ అభిలాష్, కాలనీ అసోసియేషన్ సభ్యులు యాద వ రెడ్డి, హీరాలాల్, చంద్రశేఖర్ రెడ్డి, సుభాష్ గౌడ్, సురేశ్ కుమార్, బిఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## బాల్య వివాహాలు రూపుమాపటం సామాజిక బాధ్యత

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** బాలల భవిష్యత్తును దెబ్బతీసే బాల్య వివాహాలను పూర్తిగా రూపు మాపేందుకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎస్‌సిపిసిఆర్ కమిషన్ సభ్యులు చందన సూచించారు. ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జరిగిన బాల్య వివాహాల నివారణపై అవగాహన కార్యాక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నతనంలో వివాహాలు జరగటం బాలికల విద్య, ఆరోగ్యం, మానసిక అభివృద్ధిపై తీవ్ర ప్రభావం కనపడుతాయన్నారు. ప్రతి గ్రామంలోనూ బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎవరికైనా బాల్య వివాహాల సమాచారం తెలిస్తే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు కాల్ చేసి సమాచారమివ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో బాల్య వివాహాలను అరికట్టటం విషయంలో ప్రతి ఒక్కరం బాధ్యతగా ఉంటామంటూ ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమవంలో సిడబ్ల్యుసి సభ్యులు రాంమోహన్, ఎంఎంసి డిసి బాగేష్‌రావు, ఆల్వాల్ మెడికల్ ఆఫీసర్ శ్రీకాంత్, జిల్లా బాలరక్ష భవన్ కోఆర్డినేటర్ తిరుమలదేవి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి ఇంతియాజ్, తదితరులు పాల్గొన్నారు.

## 100 పడకల ప్రాంతీయ ఆస్పత్రి నిర్మాణ పనులు పరిశీలన



**ప్రజాపక్షం /పరిగిః** మున్సిపల్ లో రూ.100 పడకగల ప్రాంతీయ ఆస్పత్రిరూ.27కోట్ల వ్యయంతో అత్యధునిక వసతి సౌకర్యాలతో నిర్మిస్తున్న ఆసుపత్రిని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మంగళవారం స్థానిక నాయకులు, అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుపత్రి నిర్మాణం నాణ్యతతో పనులు చేపట్టాలని సూచించారు. త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలోమున్సిపల్ చైర్‌పర్సన్ రజిత, వైస్ చైర్మన్ హనుమంతు కమల్, కమిషనర్ వెంకటయ్య, కౌన్సిలర్లు ఆరిఫ్, అఖిల శ్రీనివాస్, లక్ష్మి, చంద్రయ్య, కురువ అక్కమ్మ, బాలరాజ్, తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ ఫోన్‌కాల్‌తో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని బురిడీ కొట్టించే యత్నం

### సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు

**ప్రజాపక్షం/తాండూరుః** నకిలీ కేటుగాళ్లు ఏకంగా ఓ ఎమ్మెల్యేను టార్గెట్ చేశారు. నకిలీ ఫోన్‌కాల్‌తో వికారాబాద్ జిల్లా తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోర్‌రెడ్డిని బురిడీ కొట్టించే యత్నానికి ప్లాన్ వేశాడు. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డికి ఫోన్‌చేసిన నకిలీ కేటుగాడు ఏకంగా తాను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పరిచయం చేసుకుని మోసం చేయడానికి ప్రయత్నించాడు.

ఫోన్ చేసిన నకిలీ కేటుగాడు తాను ఆర్థిక శాఖ కార్యాలయం నుంచి మాట్లాడుతున్నానంటూ దిలీప్ కుమార్ పేరుతో ఫోన్ కాల్ చేశారు. ఫోన్ కాల్ చేసిన వ్యక్తి మాట్లాడిన తీరు అనుమానాస్పదంగా ఉండడంతో వెంటనే ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అప్రమత్తమైయ్యారు. ఇటీవల ఎంఎల్‌సి పల్లా రాజేశ్వర్‌రెడ్డికి కూడా ఇలాంటి నకిలీ ఫోన్ వచ్చిన ఘటన గుర్తుకు రావడంతో అప్రమత్తమయ్యారు. దీంతో వెంటనే ఆ నకిలీ ఫోన్ కాల్‌పై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం గుర్తు చేసుకున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి వెంటనే ఈ విషయాన్ని ధృవీకరించుకున్నారు. దీంతో అప్రమత్తమైన ఎంఎల్‌ఎ వెంటనే వికారాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ధృవీకరించుకున్నారు. ఈ సందర్భం గా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులను లక్ష్యంగా చేసుకుని నకిలీ పేర్లతో ఫోన్‌కాల్ చేసి మోసాలకు పాల్పడే యత్నాలకు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్ విషయంలో ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించా రు.

అలాగే నకిలీ గుర్తింపులతో కాల్స్‌చేసి మోసాలకు పాల్పడుతున్న వ్యక్తులపై రాష్ట్ర ప్రభు త్వం, సైబర్ క్రైమ్ విభాగం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## బాల్యవివాహాలపై అవగాహన సదస్సు




**ప్రజాపక్షం/వికారాబాద్ః** తెలంగాణ ప్రభుత్వం తలపెట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో మహిళా శిశు మిషన్ వాత్సల్య పథకం, సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పురోహితులు, ఖ్వాజిలు, పాస్టర్స్ హజరు కావడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి కృష్ణవేణి మాట్లాడుతూ మన జిల్లాలో తెలిసీ తెలియక ఎక్కడో ఒకచోట బాల్య వివాహాలు జరుగుతునే ఉన్నాయని వాటి ని అరికట్టవలసిన బాధ్యత ఇక్కడ ఉన్న ప్రతి ఒక్కరిపైన ఉందని అదేవిధంగా వికారాబాద్ జిల్లాలో మారుమూల ప్రాంతాలు ఎక్కువగా ఉండటం, అదేవిధంగా పిల్లల తల్లిదండ్రులు నిరక్షరాస్యులుగా ఉండడం వల్ల పిల్లలకు చిన్నతనంలో పెండ్లి చేస్తే కలిగే ఆరోగ్య సమస్య గురించి, చట్టాల గురించి అవగాహన లేకపోవ డం వల్ల ఈ బాల్య వివాహాలు జరుగుతున్నాయని తెలిపారు. బాల్య వివాహన్ని నిర్ధారించడానికి ఆధార్‌కార్డు ప్రామాణికం కాదని, బర్త్ సర్టిఫికేట్ కానీ, ఎస్‌ఎస్‌సి మెమోను ప్రామాణికం గా తీసుకోవాలని ఇటీవలే సుప్రీంకోర్టు తీర్పు వెల్లడించింది అని తెలిపారు.

మున్సిపల్ వైస్ చైర్మన్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూబాల్య వివాహల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మన జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. కొంతమంది తల్లిదండ్రులు బాల్యవివాహలపైన అవగాహన లేకుండా మా అమ్మాయికి పెళ్లి చేస్తుంటే అధికారులు వచ్చి తీసుకెళ్లారని దానికి మీ సహకారా లు అందివ్వనని మీ అమ్మాయికి చిన్నతనంలో పెళ్లిళ్లు చేయడం ఎటువంటి అనారోగ్య సమస్య లు వస్తాయో వాళ్లకి వివరించడం జరుగుతుందని తెలిపారు.

ఎక్కడైనా బాల్య వివాహలు జరిగితే వెంటనే టోల్‌ఫ్రీ నెంబర్ 1098 కు సమాచారం అందించాలని వివరాలు గోప్యంగా ఉంచి బాల్య వివాహ నిర్మూలను తగిన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిపిస్పి జానయ్య, సంగమేశ్వర్, సిడిపిఓలు వెంకటేశ్వరమ్మ, మెహరున్నీ, తదితరులు పాల్గొన్నారు.

‘ ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ మీద సమంత, రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరు సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం ‘మా ఇంటి బంగారం’. సమంత ప్రధాన పాత్రలో నందినీ రెడ్డి తెరకెక్కించిన ఈ మూవీని జూన్ 19న రిలీజ్ చేయబోతోన్నారు. ’



## తోటికోడళ్ల కథ ‘మా ఇంటి బంగారం’

### ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో సమంత

ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ మీద సమంత, రాజ్ నిడిమోరు, హిమాంక్ దువ్వూరు సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం ‘మా ఇంటి బంగారం’. సమంత ప్రధాన పాత్రలో నందినీ రెడ్డి తెరకెక్కించిన ఈ మూవీని జూన్ 19న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో సోమవారం నాడు ట్రైలర్‌ను విడుదల చేశారు. సమంత మాట్లాడుతూ మా ఇంటి బంగారం ట్రైలర్ అందరికీ నచ్చే ఉంటుందని భావిస్తున్నాను. మా కోసం ఇక్కడికి వచ్చిన ప్రతీ ఒక్క అభిమానికి థాంక్స్. నందినీ గారు, రాజ్ గారు ప్రతీ విషయంలో పర్ఫెక్ట్‌గా ఉంటారు. ఇంత వరకు నేను వారితో వాదించే విషయం గానీ, అలాంటి ఓ ఘటన గానీ ఎదురు కాలేదు. ‘మా ఇంటి బంగారం’లో ప్రతీ ఎమోషన్ ఉంటుంది. కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఉంటుంది. యాక్షన్, డ్రామా, కామెడీ అన్ని అంశాలుంటాయి. అందరూ చూసి ఎంజాయ్ చేయండి. అభిమానులంతా గర్వపడేలా ఈ సినిమా ఉంటుంది’ అని అన్నారు. దర్శకురాలు నందినీ రెడ్డి మాట్లాడుతూ సమంత దినదినాభివృద్ధి చెందుతున్నారు. ఒకప్పటి సమంతకి ఇప్పటి సమంతకు ఎంతో తేడా ఉంది. ఇప్పుడు ఆమె నెకట్స్ లెవెల్లో ఉన్నారు. యాక్షన్, కామెడీ, ఎమోషన్ ఇలా ప్రతీ సీన్‌లో సమంత అదరగొట్టేశారు. రాజ్ నిడిమోరు మాట్లాడుతూ మా ఇంటి బంగారం అనే పేరులోనే ఎంతో ఎఫెక్షన్, లవ్ ఉంటుంది. దాని వెనకాల డార్క్ సైడ్ పొసెసివ్ నెస్ కూడా ఉంటుంది. సమంత, నందినీ రెడ్డి మధ్య ఉండే క్లోజ్‌నెస్ అందరికీ తెలిసిందే. వారిద్దరి మధ్య మంచి బాండింగ్ ఉంది. అందుకే నందినీ రెడ్డిని దర్శకురాలిగా తీసుకున్నాం. హిమాంక్ దువ్వూరు మాట్లాడుతూ ‘మా ఇంటి బంగారం’ ట్రైలర్ చూస్తేనే సమంత యాక్టింగ్ ఏ రేంజ్‌లో ఉంటుందో అర్థం అవుతుంది. ప్రొడక్షన్‌లో, యాక్టింగ్‌లో సమంతకు వందకు వంద మార్కులు పడతాయి. ఈ జర్నీలో మేమంతా ఎంతో సరదాగా, ఎంజాయ్ చేస్తూ ఉన్నాం. అందరం కలిసి టీం ఎఫెర్ట్‌తో ‘మా ఇంటి బంగారం’ను రూపొందించాం.నందినీ రెడ్డి గారు, సమంత గారి కాంబినేషన్ అందరికీ నచ్చుతుంది. జూన్ 19న మా సినిమాని చూసి ఆడియెన్స్ కచ్చితంగా ఎంజా య్ చేస్తారు’ అని అన్నారు. శ్రీముఖి మాట్లాడుతూ సమంత హీరోయిన్ అని చెప్పడంతోనే కథ వినకుండానే ఓకే చెప్పాను. సమంత నిజంగానే ఓ బంగారం. ఆమె యాక్షన్ లైవ్‌లో చూడటం ఓ ట్రీట్. ఈ చిత్రంలో ఆమె నవ్విస్తారు, ఏడ్పిస్తారు, ఫైట్స్ చేస్తారు. నాకు ఈ అవకాశం ఇచ్చిన నందినీ రెడ్డి గారికి థాంక్స్. రాజ్‌తో అసోసియేట్ అవ్వడం ఆనందంగా ఉంది. అభిమానులందరి ప్రేమతో ఈ చిత్రం పెద్ద విజయం సాధిస్తుందని కోరుకుంటున్నాను అని అన్నారు.

## సనాతన ధర్మం నేపథ్యంలో ‘త్రికాల’



భారతీయ సనాతన ధర్మంలో దాగి ఉన్న ఆధ్యాత్మిక రహస్యాలను ఆధారంగా చేసుకుని రూపొందిన మైథలాజికల్ ఫిక్షనల్ థ్రిల్లర్ ‘త్రికాల’ ప్రపంచవ్యాప్తంగా 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. నటి శ్రద్ధాదాస్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రంలో మాస్టర్ ఫేమ్ మహేంద్రన్, అజయ్, సీనియర్ నటి ఆమని కీలక పాత్రలు పోషించారు. మణి తెల్లగూటి కథ, దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని రాధిక,శ్రీనివాస్ నిర్మించగా, చాగంటి ప్రొడక్షన్ ఎల్ ఎల్ పీ ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తోంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్, ప్రచార చిత్రాలు, పాటలు ప్రేక్షకుల్లో సినిమాపై భారీ అంచనాలను పెంచాయి. ముఖ్యంగా అడవి నేపథ్యంలో రూపొందించిన విజువల్స్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్, వెన్నులో వణుకు పుట్టించే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ సందర్భంగా దర్శకుడు మణి తెల్లగూటి మాట్లాడుతూ ప్రపంచంపై చీకటి కమ్ముకున్న సమయంలో వెలుగుగా అవతరించే ఒక శక్తి చుట్టూ ‘త్రికాల’ కథ సాగుతుంది. ప్రేక్షకులకు ఇది సరికొత్త అనుభూతిని అందిస్తుంది అని తెలిపారు. నిర్మాతలు మాట్లాడుతూ మైథలాజికల్ టచ్‌తో రూపొందిన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. సంస్కృతి, ఆధ్యాత్మికత, థ్రిల్ అంశాల సమ్మేళనంగా రూపొందిన ‘త్రికాల’ ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుంది అని పేర్కొన్నారు.



## లవ్ స్టోరీకి ప్రాణమే ‘సంగీతం’

### కీరవాణి

హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా కలర్ ఫొటో, బేబి వంటి మూవీస్ ప్రేక్షకులకు అందించిన మేకర్స్ ఎస్ కెఎన్, సాయి రాజేశ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా ‘చెన్నై లవ్ స్టోరీ‘. ఈ చిత్రాన్ని అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్స్ పై నిర్మిస్తున్నారు. సాయి రాజేశ్ కథను అందిస్తున్న ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. మణిశర్మ ‘చెన్నై లవ్ స్టోరీ‘ సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ సినిమా సెకండ సింగిల్ ‘వదలనే..’ పాటను హైదరాబాద్‌లో జరిగిన ఈవెంట్ లో ఆస్కార్ విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి చేతుల మీదుగా లాంఛ్ చేశారు. ఈ కార్యక్రమంలో మ్యూజిక్ డైరెక్టర్స్ మాధవపెద్ది సురేష్, కల్యాణి మాలిక్, అనూప్ రూబెన్స్, హరి గౌర, మార్క్ కె రాబిన్, సింజిత్ యెర్రమల్లి, చేతన్ భరద్వాజ్, స్వీకర్ అగస్తీ, సురేష్ బొబ్బిలి, వివేక్ సాగర్, శ్రీచరణ్ పాకాల, తదితరులు అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎం కీరవాణి మాట్లాడుతూ బేబి సినిమా చూసిన తర్వాత సాయి రాజేశ్ ఫ్యాన్స్‌లో నేనూ ఒకరిగా మారిపోయాను. ఈ సినిమా సాంగ్స్, విజువల్స్ చూస్తుంటే బేబి సినిమా స్టాండర్డ్ లోనే ‘చెన్నై లవ్ స్టోరీ‘ ఉంటుందని, ఇదొక ఫీల్ గుడ్ మూవీ అని అర్థమవుతోంది. నా ఫ్రెండ్ మణిశర్మ చేసిన ’వదలనే..’ పాట హాంటింగ్ గా ఉంది. ఈ ఈవెంట్ లో డీవోపీ డేనియల్ విశ్వాస్, డైరెక్టర్ రవి నంబూరి, కో–ప్రొడ్యూసర్ ధీరజ్ మొగిలినేని,హీరోయిన్ శ్రీ గౌరి ప్రియ, ప్రొడ్యూసర్ సాయి రాజేశ్హీరో కిరణ్ అబ్బవరం పాల్గొన్నారు.

## ‘ప్రియసఖి’ గీతం విడుదల

‘ఎపిక్ – ఫస్ట్ సెమిస్టర్’ చిత్ర బృందం తాజాగా రెండవ గీతం ‘ప్రియసఖి’ని విడుదల చేసింది. ప్రేమ అనే భావన చుట్టూ అల్లుకున్న ఈ పాట. ఒక యువకుడు తనకు ఎంతో ప్రత్యేకమైన వ్యక్తి పట్ల మనసులో దాచుకున్న మౌన భావాలను, ఆరాధనను, అనురాగాన్ని అందంగా ఆవిష్కరిస్తూ పాడుకునే పాట ఇది. గేయ రచయిత సురేష్ బనిశెట్టి అందించిన సాహిత్యం సరళంగా ఉంటూనే, హృదయానికి హత్తుకునేలా ఉంది. ప్రతి పదం పాట భావానికి అద్భుతంగా సరిపోతూ, శ్రోతలను తక్షణమే ఆకట్టుకుంటుంది. ఈ స్వరకల్పనకు ప్రాణం పోస్తూ, గాయకుడు కె.ఎస్. హరిశంకర్ తన మృదువైన, భావయుక్తమైన గాత్రంతో మంత్రముగ్ధులను చేశారు. సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ సరికొత్తగా, ప్రశాంతంగా, భావోద్వేగభరితంగా ఉండే ఒక బాణీని సృష్టించి మరోసారి తన ప్రతిభను నిరూపించుకున్నారు. ఈ పాటలో వాద్య సంగీతం మృదువుగా సాగుతూ, గాత్రాన్ని మించిపోకుండా భావాన్ని మరింత మెరుగుపరిచింది. ఈ పాట ఒక ఆహ్లాదకరమైన అనుభూతిని కలిగిస్తూనే, తెలియని భావోద్వేగాన్ని మిగులుస్తుంది. అందుకే ఈ గీతం ఒకసారి వింటే మళ్ళీ మళ్ళీ వినాలనిపించేలా ఉంది.లండన్ నేపథ్యంతో చిత్రీకరించిన ‘ప్రియసఖి’ పాట దృశ్యపరంగా అద్భుతంగా ఉంది. ఆ సుందరమైన దృశ్యాలు పాటకు మరింత అందాన్ని తీసుకొచ్చాయి.



నాయకానాయికలు ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య మధ్య కనిపించిన కెమిస్ట్రీ మరోసారి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ‘బేబీ’ తర్వాత అత్యంత ప్రేమించబడిన వెండితెర యువ జంటలలో ఒకటిగా వారు ఎందుకు నిలిచారో, ఈ పాట మరోసారి గుర్తు చేస్తోంది. ఆదిత్య హాసన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ ఈ చిత్రాన్ని సమర్పిస్తోంది. ఈ సినిమా జూలైలో థియేటర్‌లలో అడుగు పెట్టనుంది. ఈ చిత్రానికి సహ నిర్మాతలు: వెంకట్ ఉప్పుటూరి, వి.ఎం.ఆర్ నిర్మాతలు: సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య. రచన, దర్శకత్వం: ఆదిత్య హాసన్.

## 3డిలో ‘నాగబంధం’

మైథలాజికల్ యాక్షన్‌అడ్వెంచర్ చిత్రం ‘నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్’. దర్శకుడు అభిషేక్ నామా, హీరో విరాట్ కర్ణ క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కుతోంది. ఎన్ఐకే స్టూడియోస్ బ్యానర్‌పై కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని అభిషేక్ పిక్చర్స్ సమర్పిస్తోంది. భారీ నిర్మాణ విలువలు, అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను రూపొందిస్తున్నారు.హైదరాబాద్‌లోని ఎఎంబిలో ప్రత్యేకంగా రూపొందించిన ‘నాగబంధం’ 3డి స్టాండీ కర్టెన్ రైజర్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు. ప్రాచీన దేవాలయాలు, మిస్టికల్ ప్రపంచాలు, భారీ యుద్ధ ఘట్టాలు, దైవిక శక్తులతో కూడిన సన్నివేశాలను అత్యాధునిక సాంకేతికతతో తెరపై ఆవిష్కరించేందుకుచిత్రబృందం కృషి చేస్తోంది. ప్రపంచ స్థాయి సినిమాటిక్ అనుభూతిని అందించేలా ప్రతి ఫ్రేమ్‌ను తీర్చిదిద్దుతున్నారు. నార్త్ ఇండియాలో ఈ చిత్రం హక్కులను జీ స్టూడియోస్ సొంతం చేసుకుంది. హిందీ మార్కెట్‌లో భారీ స్థాయిలో విడుదలకు ప్లాన్ చేస్తున్నారు. ఒటిటి సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో ఈ చిత్ర డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను దక్కించుకున్నట్లు తెలుస్తోంది. తెలుగు శాటిలైట్ హక్కులను స్టార్ మా సొంతం చేసుకోవడం ఈ ప్రాజెక్ట్‌పై ట్రేడ్ వర్గాల్లో ఉన్న నమ్మకాన్ని స్పష్టంగా తెలియజేస్తోంది.నభా నటేష్, ఐశ్వర్య మీనన్, జగపతి బాబు, మహేష్ మంజ్రేకర్, రిషబ్ సావ్నే తదితర ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జూలై 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్‌లలో విడుదల కానుంది.





## ఫైనల్‌కు ఆర్‌సిబి

(మొదటి పేజీ తరువాయి)

బృందం 92 పరుగుల భారీ విజయంతో ఫైనల్లో అడుగుపెట్టింది. ఆర్‌సిబి నిలిపిన 255 పరుగుల లక్ష్యాన్ని చూసి నీరుగారిపోయిన గుజరాత్ ఛేదనలో ఆది నుంచి తడబడింది. ఓపెనర్ సుదర్శన్(14) బ్యాట్‌ను వికెట్లపై పడేసుకొని హిట్‌వికెట్‌గా వెనుదిరగగా.. భువనేశ్వర్ ఫామ్‌లో ఉన్న శుభ్‌మన్ గిల్(2)ను బౌల్డ్ చేసి గుజరాత్‌కు షాకిచ్చాడు. అనంతరం హేజిల్‌వుడ్ ఓవర్లో 4, 6, 4 బాదిన బట్లర్(29) బౌల్డయ్యాడు. రసిక్ దార్‌కు రిటర్న్ క్యాచ్ ఇచ్చి నిషాంత్ సింధు(5).. తర్వాతి బంతికే హేజిల్‌వుడ్ చేతికి చిక్కి హోల్డర్(0) చిక్కగా 51కే సగం వికెట్లు కోల్పోయింది గుజరాత్. అప్పటికే ఓటమి ఖరారవ్వగా సుందర్ తేలిపోయాడు. సహకరించే వాళ్లు లేక ఒంటరైన ఇంప్యాక్ట్ సబ్ తెవాటియా(68) పరుగుల అంతరం తగ్గించే ప్రయత్నం చేశాడు. అర్ధ శతకంతో విసిగించిన తెవాటియా 19వ ఓవర్లో పటిదార్ క్యాచ్‌తో డగౌట్ చేరాడు. సిరాజ్ చివరి వికెట్‌గా ఔటవ్వగా ఆర్‌సిబి 92 పరుగులతో విజయం సాధించింది.

**చితక్కొట్టిన పటిదార్ :** క్వాలిఫయర్ 1లో కెప్టెన్ రజత్ పటిదార్(93 నాటౌట్) తుఫాన్ ఇన్నింగ్స్‌తో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రికార్డు స్కోర్ కొట్టింది. విరాట్ కోహ్లి(43), పడిక్కల్(30)లు అదిరే ఆరంభమివ్వగా.. పవర్ ప్లేలో వికెట్ నష్టానికి ఆర్‌సిబి 76 పరుగులు చేసింది. అనంతరం కెప్టెన్ రజత్ పటిదార్(93 నాటౌట్) మెరుపుఇన్నింగ్స్‌తో గుజరాత్ బౌలర్లను భయపెట్టాడు. ఖేజ్రోలియా వేసిన 15వ ఓవర్లో రెండు నో బాల్స్, వైడ్ నాలుగు ఫోర్లు, సిక్సర్ కలిపి 28 రన్స్ వచ్చాయి. మూడో వికెట్‌కు 95 రన్స్ జోడించిన కృనాల్(43)ను రబడ ఔట్ చేయగా గుజరాత్ ఊపిరిపీల్చుకుంది. కానీ, పటిదార్ రెండు సిక్సర్లతో స్కోర్ రెండొందలు దాటించాడు. ప్రసిధ్ వేసిన చివరి ఓవర్లో రెండు సిక్సర్లు బాదేశాడు. గుజరాత్ చెత్త ఫీల్డింగ్ కలిసి రావడంతో ఆర్సీబీ నాకౌట్‌లో అత్యధిక స్కోర్‌తో చరిత్ర సృష్టించింది. 2023లో ముంబై ఇండియన్స్‌పై 233/3తో గుజరాత్ సాధించిన రికార్డును బెంగళూరు బద్ధలు కొట్టింది.

## కర్ణాటకలో నాయకత్వ మార్పు లేదు

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి సిద్ధ రామయ్య, ఆయన ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్‌ల మధ్య దీర్ఘకాలికంగా కొనసాగుతున్న నాయకత్వ పోరుకు ఏదైనా పరిష్కా రం లభిస్తుందా? లేదా? అనేదే ప్రధాన ఆసక్తిగా మిగిలిపోయింది. సిద్ధరామయ్య, శివకుమార్ తమకు మద్దతు ఇచ్చే ఎమ్మెల్యేలతో కలిసి రాజధాని ఢిల్లీకి చేరుకున్నారు. దక్షిణ భారతదేశ రాష్ట్రమైన కర్ణాటక రాష్ట్రంలో నెలకొన్న నాయకత్వ సంక్షోభానికి మూల కారణం, 2023లో జరిగిన రాష్ట్ర శాసనసభ ఎన్నికల సమయంలో తనకు ఒక వాగ్దానం చేశారని ఆయన మద్దతుదారులు చెబుతున్నందున, ఆ హామీ కారణంగా తనను ముఖ్యమంత్రి పదవికి నియమించాలన్నది ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ డిమాండ్. ఇందిరా భవన్ ప్రధాన కార్యాలయంలో కాంగ్రెస్ కేంద్ర నాయకత్వం, కర్ణాటక రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు, డిప్యూటీ సిఎం కూడా అయిన డి.కె.శివకుమార్ సహా కర్ణాటక రాష్ట్ర కాంగ్రెస్ నాయకులతో దాదాపు ఏడు గంటల పాటు చర్చలు జరిపింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్షనాయకుడు రాహుల్‌గాంధీ, ఎఐసిసి ఆర్గనైజేషన్ జనరల్ సెక్రటరీ కె.సి.వేణుగోపాల్, కర్ణాటక ఎఐసిసి జనరల్ సెక్రటరీ ఇన్‌చార్జి రణ్‌దీప్ సుర్జేవాలా తదితరులు హాజరైన సమావేశంలో నాయకత్వ మార్పు అంశంపై ఎలాంటి చర్చ జరగలేదని కాంగ్రెస్ పార్టీ నాయకులు నొక్కిచెప్పారు. ఈ రోజు జరిగిన చర్చ మొత్తం కేవలం రాజ్యసభ, రాష్ట్ర శాసనమండలికి అభ్యర్థుల ఎంపిక గురించి మాత్రమేనని, మీరు ఏదైతే ఊహించారో అది కేవలం ఊహాగానాలు మాత్రమేనని, అందులో ఎలాంటి వాస్తవం లేదని సమావేశం అనంతరం కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి కె.సి.వేణుగోపాల్ మీడియాకు స్పష్టం చేశారు. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ స్థానాలతోపాటు రాజ్యసభ, కర్ణాటక శాసనమండలి సీట్లకు కూడా అభ్యర్థులను ప్రకటిస్తామని ఆయన చెప్పారు.

# మహిళా రిజర్వేషన్ తక్షణమే అమలు చేసేలా అసెంబ్లీలో తీర్మానం చేయండి

### కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రి వి.డి.సతీశన్‌కు ఎన్ఎఫ్ఐడబ్ల్యు విజ్ఞప్తి



**తిరువనంతపురం :** చట్టసభల్లో మహిళా రిజర్వేషన్‌లను తక్షణమే చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ కేరళ శాసనసభలో తీర్మానం చేయాలని కేరళ రాష్ట్ర ముఖ్యమంత్రి వి.డి.సతీశన్‌కు ఎన్ఎఫ్ఐడబ్ల్యు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ యనను మంగళవారం నాడు సిపిఐ జాతీయ కార్యదర్శి అన్నీ రాజా, ఎన్ఎఫ్ఐడబ్ల్యు అధ్యక్షురాలు సయ్యదా హమీద్, ప్రధాన కార్యదర్శి నిషా సిద్ధు తదితరులతో కూడిన ప్రతినిధి బృం దం వినతిపత్రాన్ని సమర్పించింది. జ నగణన, నియోజకవర్గాల పునర్విభజనతో సంబంధం లేకుండా తక్షణమే చ ట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌ను అమలు చేసేందుకు పార్లమెంట్ వర్షాకాల సమావేశంలో సవర ణ బిల్లును ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందని ప్రతినిధి బృందం పేర్కొంది. ఈ మేరకు కేరళ శాసనసభ తీర్మానం చేసి కేంద్రానికి పం పాలని కోరింది. దీనిపై కేరళ సిఎం సతీశన్ సా నుకూలంగా స్పందించినట్లు ప్రతినిధి బృందం తెలియజేసింది. ఎటువంటి జాప్యం లేకుండా మహిళా రిజర్వేషన్ చట్టాన్ని తక్షణమే అమలు చేసేందుకు మద్దతు కోరుతూ దేశవ్యాప్తంగా ముఖ్యమంత్రులు, ఎంపిలను కలిసి విజ్ఞప్తి చే యాలనే ఎన్ఎఫ్ఐడబ్ల్యు దేశవ్యాప్త ప్రచారోద్యమంలో భాగంగా ఈ సమావేశం జరిగింది.

## జీతాలు (మొదటి పేజీ తరువాయి)

అందేలా చూడాలని, ఓటర్ ఐడి, ఆధార్, సీపెక్ డేటా ఆధారంగా పెన్షన్లను స్ట్రీమ్ లైన్ చేయాలని, కొత్తగా అందించే పెన్షన్లలో ఒంటరి మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఐఎఎస్ అధికారులకు నెల నెలా సమయానికి జీతాలు అందినట్లే గ్రామ పంచాయతీ సిబ్బందికి కూడా అలాగే జీతాలు అందాలని, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ అనే తేడా లేకుండా ప్రభుత్వంలోని అన్ని శాఖల పరిధిలోని ఉద్యోగులకు మొదటి తారీఖునే జీతాలు అందేలా చూడాలని, సిబ్బంది జీతాలు ఒక్కరోజు ఆలస్యమైనా ఊరుకునేది లేదని సిఎం అన్నారు. రాష్ట్రంలోని 50 వేల మంది గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రతీ నెలా మొదటి తారీఖునే జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని సిఎం అధికారులను ఆదేశించారు. సిబ్బంది జీతాలు చెల్లించడానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రతీ నెలా రూ.50 కోట్లు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క, ఎంపి వేం నరేందర్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## భారత్–అమెరికా డీల్

(మొదటి పేజీ తరువాయి)

సంబంధిత పెట్టుబడులతో సహా కీలకమైన ఖనిజాలు, అరుదైన భూలోహాల సరఫరా గొలుసు అంతటా మన సహకారాన్ని మరింత పెంచడమే ఈ చట్రం లక్ష్యం’ అని జైశంకర్ చెప్పారు. ఈ ఫ్రేమ్ వర్క్ పటిష్ఠమైన, వైవిధ్య భరితమైన సరఫరా గొలుసులను బలోపేతం చేస్తుందని, ప్రాజెక్ట్‌లకు ఆర్థిక సహాయం అందిస్తుందని, అలాగే కీలక ఖనిజాలు, అరుదైన మూలకాల సమర్థవంతమైన నిర్వహణను నిర్ధారిస్తుందని విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్ వెల్లడించారు. ‘ఎన్నో సవాళ్లు, అదే సమయంలో ఎన్నో అవకాశాలు ఉన్న ఈ ప్రపంచంలో మన సహకారం ఎంత సన్నిహితంగా ఉందో చెప్పడానికి ఇది ఒక నిదర్శనం’ అని అన్నారు. తన ప్రసంగంలో మార్కో రూబియో అమెరికా భారతదేశం మధ్య ఉన్న వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ఇరుదేశాల జాతీయ ప్రయోజనాల దృష్ట్యా దాని ప్రాముఖ్యతను ప్రధానంగా ప్రస్తావించారు. ‘ఇది దానికి ఒక స్పష్టమైన ఉదాహరణ’ అని ఒప్పందంపై సంతకాలు చేయడాన్ని ప్రస్తావిస్తూ రూబియో చెప్పారు. ‘మన ఆవిష్కరణ ఆర్థికవ్యవస్థకు ముఖ్యమైన కీలక ఖనిజాలు, సరఫరా గొలుసులకు విశ్వసనీయమైన దీర్ఘకాలిక ప్రాప్యతను నిర్ధారించడంలో వ్యూహాత్మక ప్రయోజనాలు ఉన్న రెండు దేశాలం మనం’ అని ఆయన అన్నారు. ‘ఈ ఒప్పందం ఒక మైలురాయి’ అని అమెరికా ఒక ప్రకటనలో తెలిపింది.ఈ పెట్టుబడులు పాక్స్ సిలికా, మేం పునరుజ్జీవింపజేస్తున్న దౌత్య వాణిజ్య సంబంధాలతో కలిసి ప్రభుత్వ వ్యయాలకంటే అనేక రెట్లు అధికంగా ప్రైవేట్ మూలధనాన్ని సమీకరిస్తూ గుణకార ప్రభావాన్ని చూపుతున్నాయని ఆయన అన్నారు. ఈ సందర్భంగా మార్కో రూబియో అమెరికా మద్దతు ఉన్న పాక్స్ సిలికా కార్యక్రమాన్ని కూడా ప్రస్తావించారు. ‘ఫిబ్రవరి 4న వాషింగ్టన్ డి.సి.లో మేం నిర్వహించిన క్రిటికల్ మినరల్స్ ఫోరంలో మీరు మాతో చేరినప్పుడు దీనికి పునాది పడింది’ అని రూబియో గుర్తు చేశారు. పాక్స్ సిలికాపై భారత్ సంతకం చేసిన తర్వాత ఇది మరీ ఊపందుకుందన్నారు. కీలక ఖనిజాలు, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కోసం సురక్షితమైన, స్థితిస్థాపకమైన, ఆవిష్కరణలు ఆధారిత సరఫరా గొలుసును నిర్మించడానికి గత ఏడాది డిసెంబర్‌లో పాక్స్ సిలికా కార్యక్రమాన్ని నిర్వహించారు.





## కళాకారులు కీలకం

(మొదటి పేజీ తరువాయి)

కోదండరామ్ మాట్లాడుతూ అన్ని వర్గాలకు ప్రజాకళాకారులు కీలకమన్నారు. గతంలో ఫ్యూడల్ వ్యవస్థ వల్ల మనిషి స్వేచ్ఛగా జీవించే హక్కును కోల్పోయారని, ఇప్పుడు ప్రజల భావోద్వేగాలను ఆసరాగా చేసుకుని రెచ్చగొట్టే కుట్రలకు పాల్పడుతున్నారని, ప్రజల హక్కుల పరిరక్షణ మనందరి బాధ్యత అని అన్నారు. నాటి కళాకారుల చరిత్ర, త్యాగాలను తెలుసుకుని నేటి యువ కళాకారులు ధైర్యంతో ముందడుగు వేయాలని సూచించారు. తొలుత ఇ.టి.నరసింహ ప్రారంభోపన్యాసం చేస్తూ మతోన్మాద శక్తులు మత విద్వేషాలను రెచ్చగొట్టి ప్రజల మధ్య వైషమ్యాలను సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కళాకారులు అప్రమత్తంగా ఉండాలని, పాటల ద్వారా ప్రజలను చైతన్యం చేయాలని కోరారు. ప్రధానంగా సోషల్ మీడియా ద్వారా కళా ప్రదర్శనలిస్తూ ప్రజలను చైతన్యవంతం చేయడం ముఖ్యమన్నారు. గతం కంటే రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలన్నారు. ఎంఐఎం, బిజెపి ఒక్కటేనన్నారు. హైదరాబాద్ పాతబస్తీకి పరిమితమైన ఎంఐఎం ఇప్పుడు దేశవ్యాప్తంగా విస్తరించిందంటే ఎవరి వల్ల సాధ్యమైందో అర్థం చేసుకోవచ్చన్నారు. మతోన్మాదుల ఆగడాలను తరిమికొట్టేందుకు ప్రజా కళాకారులు తమ పాటలను మరింత విస్తృతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల సంపదను అదాని, అంబానీకి ప్రధాని మోదీ పంచిపెడుతున్నారని, అది దేశ ఆర్థిక వ్యవస్థకు తీవ్ర నష్టమన్నారు. దేశంలో 96 శాతం మంది ప్రజలు మోదీ పాలనను వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) పేరుతో మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు కన్నం లక్ష్మీ నారాయణ అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.ఛాయాదేవి, ఇండియన్ పీపుల్స థియేటర్ అసోసియేషన్ (ఇప్టా) జాతీయ కౌన్సిల్ సభ్యులు కె.స్వామి, తెలంగాణ ప్రజానాట్యమండలి అధ్యక్షులు కె.శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి పల్లె నరసింహ, ఉపాధ్యక్షులు చంద్రశేఖర్, కోశాధికారి పడాల నళిని, సహాయకార్యదర్శి కొండల్‌రావు, నాయకులు జగన్, ఆర్ఎన్.రవి, తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధానకార్యదర్శి కట్టా నరసింహ, తెలంగాణ రాష్ట్ర ప్రజానాట్యమండలి సహాయ కార్యదర్శి, ఉప్పలయ్య, సిపిఐ హైదరాబాద్ కార్యదర్శి బి.స్టాలిన్, కార్యవర్గ సభ్యులు నెర్లకంటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com